RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 227 శనివారం 15 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## సస్పెన్షన్ కుట్ర పూరితం..అక్రమం



- నేను ఎక్కడ కూడా నీ అనలేదు..మీరు అని మాత్రమే అన్నాను
- ముందే నిర్ణయం తీసుకున్న సస్పెన్షన్
- బీఆర్ఎస్ పార్టీ నుండి ఎవరు కూడా సభ తప్పుదోవ పట్టించలేదు
- హుందాగా సభ సంప్రదాయాలను పాటిస్తూ మాట్లాడా
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

## ఏ గూడుపుఠాణి చేయడానికి
# ఈ తెరచాటు సమావేశాలు

- తెలంగాణ బీజేపీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్యంగా సమావేశం కావడం సిగ్గుపడాల్సిన విషయం
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా?
- పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా, ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేదు
- రేవంత్ రెడ్డిపైబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బీజేపీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్యంగా సమావేశం కావడం సిగ్గుపడాల్సిన విషయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు.తెలంగాణ బీజేపీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్యంగా సమావేశం కావడం సిగ్గుపడాల్సిన విషయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీజేపీ కోవర్టులు ఉన్నారని రంకెలు వేసే రాహుల్ గాంధీకి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు.తెలంగాణ బీజేపీకి చెందిన కొందరు నాయకులు రేవంత్ రెడ్డితో రహస్యంగా భేటీ అవుతున్నారని

## తెలంగాణ గ్రూప్-3 ఫలితాలు విడుదల

- మొత్తం 1,365 సర్వీసుల పోస్టుల భర్తీ
- పరీక్షకు 2,69,483 మంది హాజరు
- ఈ నెల 10వ తేదీన గ్రూప్ 1, 11న గ్రూప్ 2 ఫలితాలు
- 400 మార్కులకు జరిగిన పరీక్షలో ఓ అభ్యర్థి 339.239 మార్కులు
- మొదటి 50 ర్యాంకుల్లో కేవలం 4 మహిళలే ఉండటం గమనార్హం

## ఉక్రెయిన్‌తో 30రోజుల సీజ్ ఫైర్‌కు




- కానీ కండిషన్స్ అప్లై!
- ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి రష్యా అధ్యక్షుడు సూత్రప్రాయ అంగీకారం!
- యుద్ధం నిలిపివేయాలనే ప్రతిపాదనలను అంగీకరిస్తున్నాం
- విరమణ అనేది దీర్ఘకాలిక శాంతికి దారి తీసేలా ఉండాలి



## పాక్‌కు భారత్ చురకలు


- పాకిస్థాన్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్
- తీవ్రవాదానికి కేంద్రం ఎక్కడ ఉందో ప్రపంచానికి తెలుసని చురకలు
- హింస వెనక భారత్ హస్తం ఉందని ఆరోపణ
- రైలు హైజాక్ వెనక అఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయన్న పాక్

## గాలి జనార్దన్ రెడ్డిపిటిషన్ కొట్టేసిన తెలంగాణ హైకోర్టు



- బంగారు నగలు తుప్పు పట్టిపోతాయన్న గాలి జనార్దన్ రెడ్డి
- గాలి ఇంటి నుంచి 53 కిలోల బంగారు నగలు స్వాధీనం
- కేసు విచారణ పూర్తయ్యాకే అవి ఎవరికి చెందుతాయన్నది నిర్ణయిస్తామన్న హైకోర్టు

## నామినేటెడ్ పోస్టుల భర్తీపై చంద్రబాబు కసరత్తు



- ఆలస్యం చేయకుండా పేర్లు పంపండి
- దరఖాస్తులన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నాం
- రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్‌లను నియమిస్తాం
- పార్టీ కోసం కష్టపడిన వారి వివరాలు నామినేటెడ్ పదవుల కోసం అందించాలి
- రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత మిగిలినవారికి అవకాశాలు
- రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు

## నేను ఒక్కడినే..
# భయం అంటే తెలీదు.. అదే నా కవచం!




- ఇల్లేమో దూరం.. చేతిలో దీపం లేదు.. గుండె ధైర్యమే కవచంగా ధరించిన వాడిని
- దేశమంతా తలతిప్పి చూసేలా 100 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించాం
- మనం నిలదొక్కుకోవడమే కాకుండా.. నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టా
- సినిమాను దృష్టిలో పెట్టుకుని ఎదగలేదు, సమాజాన్ని, దేశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎదిగాను

జనసేన 12వ ఆవిర్భావ సభలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సంచలన కామెంట్స్ చేశారు. 2014లో అన్ని తానొక్కడినై పార్టీని స్థాపించానని చెప్పారు. తనకు భయం అంటే ఏంటో తెలియదని, గుండె ధైర్యమే తన కవచం అన్నారు. భయం లేదు కాబట్టే 2019లో బరిలోకి దిగానని తెలిపారు.

**ఓడినా అడుగు ముందుకే..**

ఈ మేరకు 2019లో తాము ఓడినా ముందడుగే వేశామన్నారు. 'మనం నిలబడ్డాం నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం. 2019లో - **వివరాలు 2 లో**

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 15 - 03 - 2025

## మొదటిపేజీ తరువాయి

## ఉక్రెయిన్‌తో 30 రోజుల సీజ్ ఫైర్‌కు



అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అనుకూలంగా మాట్లాడారు. అయితే ఈ కాల్పుల విరమణ అనేది శాశ్వత శాంతికి దారితీయాలని, సంఘర్షణలకు మూల కారణాలను పరిష్కరించాలని అన్నారు. దీనిపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్- పుతిన్ కీలక ప్రకటన చేసినప్పటికీ ఒప్పందం ఇంకా కార్యరూపం సంతరించుకోలేదని చెప్పారు. ఇటీవల సౌదీ అరేబియా వేదికగా జరిగిన చర్చల్లో 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకారం తెలిపింది. ఈ ఒప్పందంపైనే పుతిన్ తాజాగా స్పందించారు."యుద్ధం నిలిపివేయాలనే ప్రతిపాదనలను మేము అంగీకరిస్తున్నాం. అయితే ఈ విరమణ అనేది దీర్ఘకాలిక శాంతికి దారి తీసేలా ఉండాలి. సంక్షోభ మూలాలను తొలగించేలా ఉండాలి" అని పుతిన్ వ్యాఖ్యానించారు.అంతకుముందు పుతిన్- బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకోతో క్రెమ్లిన్‌లో సమావేశమై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్?తో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు కృతజ్ఞతలు తెలిపారు. "కాల్పుల విరమణ ఒప్పందం ప్రతిపాదన సరైందే. మేము దానికి మద్దతు ఇస్తాం. అయితే ఈ విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిపై చర్చించాలి. అందుకోసం అమెరికాతో మాట్లాడాల్సిన అవసరం ఉంది" అని పుతిన్ పేర్కొన్నారు. ఈ విషయంపై ట్రంప్‌నకు తాను ఫోన్ చేసే అవకాశం ఉందని చెప్పారు. శాంతియుత మార్గాల ద్వారా ఈ సంక్షోభానికి ముగింపు పలకాలనే ఆలోచనకు తమ మద్దతు ఉంటుందన్నారు.వైట్‌హౌస్‌లో నాటో చీఫ్ మార్క్ రుటేతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రిపోర్టర్లు పుతిన్ వ్యాఖ్యలపై స్పందన కోరారు. దీనిపై ట్రంప్ మాట్లాడారు. "పుతిన్ చాలా ఆశాజనకమైన ప్రకటన చేశారు. కానీ ఇది ఇప్పుడే పూర్తి కాలేదు. దీనికి సంబంధించి నేను పుతిన్‌ను నేరుగా కలవడం లేదా ఫోన్లో మాట్లాడతా. ఏదేమైనా ఈ విషయాన్ని త్వరగా తేల్చాల్సిన అవసరం ఉంది. తుది ఒప్పందానికి సంబంధించి ఇప్పటికే చాలా చర్చలు జరిగాయి. రష్యా ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఒకవేళ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆ దేశం తిరస్కరిస్తే అది ప్రపంచాన్ని తీవ్రంగా నిరాశపరుస్తుంది. మేము చీకట్లో చర్చలు జరపట్లేదు. ఉక్రెయిన్ కోల్పోయి, తీసుకునే భూభాగాల గురించి చర్చలు జరుపుతున్నాము. ఇందులో అతిపెద్ద విద్యుత్ ప్లాంట్ కూడా ఉంది. ఇది ఎవరికి చెందుతుందో చూడాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**ఆ అణు విద్యుత్ కేంద్రం ఎవరికి?**

ట్రంప్ నేరుగా ఆ పవర్‌ప్లాంట్ పేరు చెప్పకపోయినా- అది జపోరిజియా అణు విద్యుత్ కేంద్రం అనే అర్థమవుతోంది. ప్రస్తుతం అది రష్యా ఆధీనంలోకి ఉంది. యూరప్‌లోని జపోరిజియా అతిపెద్ద అణువిద్యుత్ కేంద్రం కావడం గమనార్హం. మరోవైపు ఉక్రెయిన్ విషయం తేల్చడానికి అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ మాస్కోకు వెళ్లారు.

## గాలి జనార్ధన్ రెడ్డి పిటిషన్ కొట్టేసిన తెలంగాణ హైకోర్టు



ఓఎంసీ (ఓబుళాపురం మైనింగ్ కంపెనీ) కేసులో సీజ్ చేసిన 53 కిలోల బంగారు నగలు పాడైపోతున్నాయని, వాటిని తమకు అప్పగించాలని గాలి జనార్ధనరెడ్డి చేసిన విజ్ఞప్తిని తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చింది. నగదు, 5 కోట్ల రూపాయల విలువైన బాండ్లను కూడా విడుదల చేయాలని గాలి జనార్ధనరెడ్డి, ఆయన కుమార్తె బ్రాహ్మణి, కుమారుడు కిరీటిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. నగలు తుప్పు పట్టి, విలువ తగ్గుతుందన్న గాలి వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఓఎంసీ కేసు విచారణ పూర్తయిన తర్వాతే వాటిపై హక్కులు ఎవరికి చెందుతాయన్నది నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ ద్వారా 884.13 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని సీబీఐ కేసు నమోదు చేసిందని, నేరపూరిత సొమ్ముతో కొన్న నగలపై ఈడీ కూడా హక్కులు కోరుతోందని కోర్టు పేర్కొంది. ఈ దశలో సీజ్ చేసిన వాటిని అప్పగించడానికి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయిన తర్వాత నగలను, సొమ్మును తిరిగి తీసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చని హైకోర్టు తెలిపింది. కోర్టు తీర్పుతో గాలి జనార్దన్ రెడ్డి కుటుంబం తీవ్ర నిరాశకు గురైంది.

## ఏ గూడుపుఠాణి చేయడానికి ఈ తెరచాటు సమావేశాలు



గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేసినట్టు వచ్చిన పత్రికా కథనాన్ని తన 'ఎక్స్' వేదికగా పంచుకున్న కేటీఆర్ విమర్శలు గుప్పించారు."బీజేపీ నేతలతో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్య సమావేశాలా.. సిగ్గు.. సిగ్గు..!" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ ఈ చీకటి సమావేశాలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి దిక్కుమాలిన చిల్లర రాజకీయాలు తెలంగాణ నేలపై ఇంత వరకు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు.ఒకవైపు బయటకు బీజేపీ నేతలతో కుస్తీపడుతున్నట్లు పోజులు కొట్టి, దొంగచాటుగా దోస్తీ చేసే ఈ నీచ సంస్కృతికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఏ గూడుపుఠాణి చేయడానికి ఈ తెరచాటు సమావేశాలు నిర్వహిస్తున్నారో దమ్ముంటే ముఖ్యమంత్రి బయటపెట్టాలని కేటీఆర్ నిలదీశారు.పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా, ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేని ముఖ్యమంత్రికి, ఈ రహస్య సమావేశాలకు మాత్రం సమయం దొరకడం క్షమించలేని ద్రోహమని అన్నారు. అట్టర్ ఫ్లాప్ ముఖ్యమంత్రిగా ముద్రపడి, ఇక ఏ క్షణంలోనైనా తన సీఎం కుర్చీ చేజారే సూచనలు కనిపించడం వల్లే ముఖ్యమంత్రి బీజేపీతో ఈ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రాన్ని ఆగంచేసి, డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో సహించదని పేర్కొన్నారు. రెండు ఢిల్లీ పార్టీలకు తెలంగాణ సమాజం కర్రు కాల్చి వాతపెడుతుందని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణ గ్రూప్-3 ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**


తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షా ఫలితాలను విడుదల చేసింది. మొత్తం 2లక్షల 49వేల 557 మందికి సంబంధించిన జనరల్ ర్యాంకులతో పాటే ఫైనల్ కీని సైతం విడుదల చేసినట్టు ప్రకటించింది. ఈ నెల 10వ తేదీన గ్రూప్ 1, 11న గ్రూప్ 2 ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ షెడ్యూల్ ప్రకారం గ్రూప్ 3 ఫలితాలు విడుదల చేసింది. ఈ సారి గ్రూప్ 3లో పురుషులు సత్తా చాటారు. 400 మార్కులకు జరిగిన పరీక్షలో ఓ అభ్యర్థి 339.239 మార్కులు సాధించారు. మొదటి పది ర్యాంకుల్లో కేవలం ఒక్కరు మాత్రమే మహిళ కాగా మొదటి 50 ర్యాంకుల్లో కేవలం 4 మహిళలే ఉండటం గమనార్హం.2022 డిసెంబర్ లో మొత్తం 1388 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా 5 లక్షల 36వేల 400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది నవంబర్ 17,18 తేదీల్లో నిర్వహించిన పరీక్షకు 50.24 శాతం అంటే 2లక్షల 67వేల 921 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో 18వేల 364మంది ఓఎంఆర్ ఇన్ వ్యాలీడ్ కాగా 2 లక్షల 49వేల 557 మంది జనరల్ ర్యాంకులను టీజీపీఎస్సీ ప్రకటించింది. జనవరి 8వ తేదీన గ్రూప్ 3 ప్రాథమిక కీ విడుదల చేసిన కమిషన్ 8 నుంచి 12వ తేదీ వరకు కీపై అభ్యంతరాలను స్వీకరించింది. అయా అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిన అనంతరం తుది కీ, జనరల్ ర్యాంకులు విడుదల చేసినట్టు కమిషన్ పేర్కొంది.అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్ సైట్‌లో లాగిన్ ఐడీ ద్వారా ఫలితాలు చూసుకోవచ్చని తెలిపింది. జనరల్ ర్యాంకుల ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్?కి ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వటంతోపాటు వెబ్ సైట్ లోనూ వివరాలు పొందుపరుస్తామని స్పష్టం చేసింది. గ్రూప్ 3 ఫలితాల విడుదల సందర్భంగా టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ అతి తక్కువ సమయంలోనే ఎలాంటి తప్పులు లేకుండా గ్రూప్స్ ఫలితాలు విడుదల చేశామన్నారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని కమిషన్ ఇచ్చిన అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 19న ప్రకటించనున్నారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీపై చంద్రబాబు కసరత్తు

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్‌లను నియమించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నామినేటెడ్ పదవుల కోసం వచ్చిన 60 వేల దరఖాస్తులు అన్నింటినీ నిశితంగా పరిశీలించి సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమించనున్నట్లు వెల్లడించారు.వైఎస్సార్సీపీ నేతలతో సంబంధాలు వద్దు: పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నందున, పేర్ల సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు చేస్తున్న ఆలస్యం తగదని హితవు పలికారు. వీలైనంత త్వరగా పార్టీ కోసం కష్టపడిన వారి వివరాలను నామినేటెడ్ పదవుల కోసం అందించాలని ఆదేశించారు. తెలుగుదేశం నాయకులు ఏ స్థాయిలో కూడా వైఎస్సార్సీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని పునరుద్ఘాటించారు. గ్రూపు రాజకీయాలకు ఎక్కడా తావు ఇవ్వకుండా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.c

**మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దు :** తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నందున, మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దని, రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత మిగిలినవారికి అవకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. ఇప్పటికే పదవులు తీసుకున్న వారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నామో, ఇప్పుడూ అంతే హుందాగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.



**పార్టీలకు అతీతంగా పథకాలు :** పదవులు తీసుకున్నవారు ఎన్నికల్లో ప్రభావం చూపించాలని స్పష్టం చేశారు. తెలుగుదేశం నాయకులు ఏ స్థాయిలో కూడా వైఎస్సార్సీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదనే విషయాన్ని తాను చెప్తుంటే, వైఎస్సార్సీపీకి ఓటు వేసిన వారికి పథకాలు ఇవ్వొద్దని చెప్పినట్లు ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంక్షేమ కార్యక్రమాల అమల్లో వివక్ష ఉండదని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు వేరు, రాజకీయ పరమైన సంబంధాలు వేరు అని వివరించిన సీఎం, వైఎస్సార్సీపీ వారిని దరిచేరనివ్వొద్దని తేల్చిచెప్పారు.

**3 పార్టీలను కలుపుకొని ముందుకెళ్లాలి :** జిల్లా ఇంఛార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలని ఆదేశించారు. పాలనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఇన్చార్జ్ మంత్రులు జిల్లాలకు వెళ్లే సమయంలో ఆయా జిల్లా కో-ఆర్డినేటర్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మంత్రులు సమాచారం అందించాలన్నారు. కార్యకర్తలు, నాయకులతో మమేకమవ్వడంతోపాటు జిల్లా పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలన్నారు. ప్రతి ఎమ్మెల్యే అసెంబ్లీలో, ఎంపీలు పార్లమెంట్‌లో తమ నియోజకవర్గ సమస్యలను లేవనెత్తి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను కలుపుకుని ప్రజాప్రతినిధులు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.


**బీసీలకు రూ.20 వేల సబ్సిడీ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం గుర్తు చేశారు. ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిపాలన మనం అందించాలని తెలిపారు. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడం మన విధానమన్న చంద్రబాబు, పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి గ్రామంలో అమలు చేసేందుకు ఎమ్మెల్యేలు, నేతలు చొరవ తీసుకోవాలని సూచించారు. 2 కిలోవాట్‌ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రూ.20 వేల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనంగా అందిస్తామన్నారు. కేంద్రం ఇచ్చే రాయితీతో కలిపి బీసీలకు రూ.80 వేల మేర రాయితీ వస్తుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటే లక్ష్యం పెట్టుకోవాలని ఆదేశించారు.

# పాక్‌కు భారత్ చురకలు

**మొదటిపేజీ తరువాయి**

భారత్‌పై పాకిస్థాన్ మరోసారి నోరుపారేసుకుంది. తమ దేశంలో హింస వెనక భారత్ హస్తం ఉందని ఆరోపించింది. దాయాది దేశం చేస్తున్న నిరాధార ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అంతర్జాతీయ తీవ్రవాదానికి కేంద్రం ఎక్కడ ఉందో ప్రపంచానికి తెలుసని చురకలు అంటించింది. ఇతరులపై నిందలు మోపే బదులు తన అంతర్గత సమస్యలపై దృష్టి సారించాలని పాకిస్థాన్‌కు హితవు పలికింది.బలూచిస్థాన్ రైలు హైజాక్ పథక రచన విదేశాల్లో జరిగిందని పాకిస్థాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ అన్నారు. హైజాక్ ఆసాంతం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీకి చెందిన మిలిటెంట్లు అఫ్గానిస్థాన్‌లోని తమ హ్యాండర్లతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి ఉగ్రవాద గ్రూపులు తమ గడ్డను ఉపయోగించడాన్ని అనుమతి ఇవ్వకూడదని చెప్పారు. ఈ మేరకు అఫ్గాన్? ప్రభుత్వాన్ని పదే పదే కోరినట్లు అలీ ఖాన్ వెల్లడించారు."ఈ ఉగ్ర చర్యకు పాల్పడినవారు, ప్రణాళికలు రచించినవారు, ఆర్థిక సహాయం చేసినవారిని జవాబుదారీగా చేయాలి. ఈ దాడికి పాల్పడిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెట్టడానికి పాకిస్థాన్ ప్రభుత్వానికి సహకరించాలని మేము అఫ్గానిస్థాన్‌ను కోరుతున్నాం" అలీ ఖాన్ అన్నారు.

**'భారత్ వైపు వేలు చూపించేవారు'**



గతంలో ఏ అఘాయిత్యానికి పాల్పడినా భారత్ వైపు చూపించేవారని, ఇప్పుడు పాక్ విదేశీ విధానంలో ఏమైనా మార్పు ఉందా అన్న ప్రశ్నకు ఏ మార్పు లేదని ఆయన బదులిచ్చారు. తమ దేశానికి వ్యతిరేకంగా భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. పొరుగు దేశాల్లో అస్థిరతకు కృషి చేస్తోందన్నారు.

**అంతా అవాస్తవం : అఫ్గానిస్థాన్**

రైలు హైజాక్ వెనక అఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. పాక్ చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. పాక్ బాధ్యతారహిత వ్యాఖ్యలు వారి దిగజారుడు విధానాలకు నిదర్శనమని మండిపడింది. తమ సమస్యలను పరిష్కరించుకోలేని పాక్ ఇతర దేశాలపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికింది.

# సస్పెన్షన్ కుట్ర పూరితం..అక్రమం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సస్పెన్షన్ అనేది అక్రమైనది కుట్రపూరితంగా చేసిందన్నారు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. ఇది ముందే నిర్ణయం తీసుకున్న సస్పెన్షన్ బీఆర్ఎస్ పార్టీ గొంతు నొక్కేందుకు ముందే నిర్ణయం తీసుకున్నారు అన్నారు.ఏక వచనం అంటున్నారు నేను ఎక్కడ కూడా నీ అనలేదు. మీరు అని మాత్రమే అన్నాడు.సభలో మాట్లాడిన్నప్పుడు వాళ్లకు మాత్రమే సమయం ఇస్తారు.మాకు ఇవ్వడం లేదు అన్నారు.గవర్నర్ ప్రసంగం గురించి ఒక్క కాంగ్రెస్ సభ్యుడు మాట్లాడలేదు.కానీ మా బీఆర్ఎస్ పార్టీ నుండి ఎవరు కూడా సభ తప్పుదోవ పట్టించలేదు, నేను లేచి గవర్నర్ ప్రసంగం పై మాట్లాడడం స్టార్ట్ చేశా కాంగ్రెస్ సభ్యులు నా ప్రసంగం వినిపించకుండా అరిశారు అన్నారు. మధ్యలో వాళ్ళ విప్ మాట్లాడడు అసలు అలా మధ్యలో విప్ కు సమయం ఇవ్వద్దు.. మధ్యలో ఇలా మాట్లాడడం సరైంది కాదు అని మా సీనియర్ సభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ స్పీకర్ సభ సంప్రదాయం కాదు అన్నారు.నేను చాలా స్పష్టంగా మాట్లాడను,సభ సంప్రదాయలు పాటిస్తూ మాట్లాడను స్పీకర్ ఎన్నికైన తరువాత పార్టీ గురించి మాట్లాడవద్దు అన్నారు. అభ్యంతరమైన పదాలు ఉంటే సభలో చర్చించి అభ్యంతరకరమైన పదాలు ఉంటే తొలగిస్తారు, లేదు అంటే స్పీకర్ కార్యాలయంకు పిలిచి ఫ్లోర్ లీడర్లను పిలిచి మాట్లాడి సభకు క్షమాపణ చెప్పమని అడుగుతారు అన్నారు.పార్టీలకు అతీతంగా ఎన్నికైన స్పీకర్ మా విప్ అని ఎలా అంటాడు.. స్పీకర్ 15 నిమిషాలు సభ వాయిదా అని 4 గంటలు ఏం చేశారు అన్నారు. అంటే ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి వీరికి అందుబాటులోకి రాక ఎం చేయాలో తెలియక 4 గంటలు వేట్ చేశారు అక్కడ ముఖ్యమంత్రి ఒకే అంటే ఊరు యాక్షన్ చేశారు అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు ఎవరు ముందు మాట్లాడితే వారిని సస్పెండ్ చేయాలని ముందే ప్రణాళిక సిద్ధం చేశారు అందులో భాగంగానే ముఖ్యమంత్రి చెప్పే వరకు ఆగారు అన్నారు.నేను చాలా హుందాగా సభ సంప్రదాయాలను పాటిస్తూ మాట్లాడాను కానీ వారు ముందే అనుకున్న విషయం కనుక నన్ను అక్రమంగా సస్పెన్షన్ చేశారు సస్పెన్షన్ చేసినంత మాత్రాన ప్రజల సమస్యలపై ప్రభుత్వం ను నిలదీయడం అవుతాదా చెప్పాలన్నారు. బరాబరు ప్రజల కోసమే పని చేస్తాం గత 15 రోజులుగా రైతులు పడుతున్న బాధలు చూసి నన్ను వారి కోసం సభలో మాట్లాడమని కోరారు మా అధినేత ఆదేశాల మేరకు భవిష్యత్ లో ముందుకు పోతా అన్నారు. మా జిల్లా కాంగ్రెస్ నాయకులు చిన్న వారు వారి గురించి మాట్లాడం వేస్ట్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కాదు అన్నారు. కాంగ్రెస్ నాయకులను తిడుతున్న మాటలు చుస్తే అర్థం అవుతుందన్నారు.

# నేను ఒక్కడినే.. భయం అంటే తెలీదు.. అదే నా కవచం!

**మొదటిపేజీ తరువాయి**

ఓడిపోయినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు. మన ఆడపడుచుల్ని అవమానించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ఇదేం న్యాయం అని వీర మహిళలు అడిగితే కేసులు పెట్టి జైళ్లలో వేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిని కూడా జైల్లో పెట్టారు. నన్ను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారు. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టాం. దేశమంతా మన వైపు చూసేలా 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం' అని చెప్పారు పవన్.

**గద్దరు అన్నలాంటివాడు..**

ఎన్డీయే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చామని అన్నారు. ఇక గద్దరు తనకు అన్నాలాంటి వాడన్నారు పవన్. 463 మంది జన సైనికులు సిద్ధాంతం కోసం ప్రాణాలు ఇచ్చారని గుర్తు చేశారు. తాను సినిమాను దృష్టిలో పెట్టుకుని ఎదగలేదని, సమాజాన్ని, దేశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎదిగానన్నారు.ఇక దాశరథి చెప్పిన మాటలు తెలంగాణకే కాదు తనకు స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. ఇప్పుడు, ఎప్పుడైనా నా మాట వినండి. సినిమా ప్రస్తావన వద్దు. ఓజీ ఓజీ అని అరవొద్దు అని ఫ్యాన్స్ కు సూచించారు. కార్యకర్తలు, ఫ్యాన్స్ కు ఐ లవ్ యూ చెప్పారు. 2003లోనే రాజకీయాల్లోకి వెళ్తానని తన తల్లిదండ్రులకు చెప్పినట్లు పవన్ తెలిపారు. తమిళనాడులోనూ తనకు రాజకీయ అభిమానులున్నారని చెప్పారు. అంతేకాదు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లోనూ జనసేనకు కార్యకర్తలు, అభిమానులున్నారన్నారు. ఇక బహుభాషా దేశానికి మంచిదేనని, దానివల్ల దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. తమిళనాడు, కేరళకైనా ఒకే సిద్ధాంతం ఉండలన్నారు. తమిళులు తనపై చూపుతున్న ప్రేమకు కృతజ్ఞతలు చెప్పారు. పిఠాపురంలోని చిత్రాడలో నిర్వహించిన జనసేన జయకేతనం సభలో పవన్ కల్యాణ్ గర్జించారు. నిర్బంధాలను చిత్తు చేసి.. అధికార పీఠం ఎక్కిన తీరును ప్రస్తావించారు. అన్యాయాన్ని, అక్రమాలపై తన పోరాటం ఎప్పటికీ ఆగదని ఉద్ఘాటించారు. పవన్ తన ప్రసంగం ప్రారంభిస్తూ.. ఎంతో స్ఫూర్తిదాయకమైన పాటను ప్రస్తావించారు. అచ్చుమిల్లై.. అచ్చుమిల్లై అంటూ సాగే పాటను పాడారు. భయం లేదు.. భయం లేదు.. అంటూ తన ధైర్యానికి కారణాన్ని పేర్కొన్నారు జనసేనాని.




**పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగం ఇదే..**

ఇల్లేమో దూరం.. చేతిలో దీపం లేదు.. గుండె ధైర్యమే కవచంగా ధరించిన వాడిని కనుకే.. అన్నీ ఒక్కడినే ఐ.. 2014 లో జనసేన పార్టీ స్థాపించాను. భావ తీవ్రత ఉంది కాబట్టే 2018 లో పోరాట యాత్ర చేశాం. ఓటమి భయం లేదు కాబట్టే 2019 లో పోటీ చేశాం. ఓడినా అడుగు ముందుకే వేశాను. మనం నిలబడ్డాం. పార్టీని నిలబెట్టాం. మనం నిలదొక్కుకోవడమే కాకుండా.. నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం. మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మేలేశారు, జబ్బలు జరిచారు, తొడలు కొట్టారు. మన ఆడపడుచులను అవమానించారు. ప్రజలను హింసించారు. ఇదేమి న్యాయం అని మన జనసైనికులు, వీర మహిళలు గొంతెత్తితో వారిపై కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని అక్రమంగా జైలులో బంధించారు. వారి పార్టీ సీనియర్ నాయకులను రోడ్డు మీద రావాలంటే భయపడేలా చేశారు. ఇక నాలాంటి వాడిపై చేయని కుట్ర లేదు, తిట్టని తిట్టు లేదు, వేయని నిందలు లేవు. ఈ ఎన్నికలో అసెంబ్లీ గేటు కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసి తొడలు గొట్టినవారికి బుద్ధి వచ్చేలా ఆ గేట్లను బద్దలు కొట్టాం. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలు, పార్లమెంట్‌లో ఇద్దరు ఎంపీలతో అడుగు పెట్టాం. దేశమంతా తల తిప్పి తిరిగి చూసేలా వంద శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించాం. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టాం. ఈరోజు జయకేతనం ఎగురవేస్తున్నాం.

# సకలైశ్వర్య ప్రధాయిని పద్మావతి అమ్మవారి కుంకుమార్చన సేవ

**భువనగిరి మార్చి 14 తెలంగాణ సేన న్యూస్ :** సకలైశ్వర్య ప్రదాయిని పద్మావతి అమ్మవారి, కుంకుమార్చన సేవ శుక్రవారం స్వర్ణ గిరిలో ఘనంగా నిర్వహించారు.అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణోత్సవం జరిపించారు.కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది.సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది.వేకువ జామున 5:45 నిమిషాలకు నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కొరకు సుదర్శన నరసింహ హవనం నిర్వహించారు.ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సువర్ణభరిత వజ్రాభరణాలతో,సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3500 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం 6:30 మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య భక్తి గీతాలాపనలతో శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.





## నాగవారిగూడెం గ్రామంలో ఘనంగా హోలీ సంబరాలు



**తెలంగాణ సేన :** యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం, అల్లందేవిచెర్వు, గ్రామపంచాయతీ పరిధిలోని నాగవారిగూడెంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామంలో ఉన్న చిన్న పెద్దలు యువకులు నాయకులు అందరు కలిసి రంగులు పూసుకొని హోలీ ఆడడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ వార్డ్ మెంబర్ ముఖ్యర్ల స్వామి యాదవ్ మాట్లాడుతూ సరదాల హోలీ పండుగ సంబరాలు అంటుకునే రంగులు చల్లుకుందాం. రంగురంగుల జీవితాన్ని పురస్కరించుకొని అన్ని రంగులు కలిసి ఉంటేనే అందం,అందరు కలిసి ఉంటేనే జీవితం అనే నినాదంతో హోలీ పండుగ జరుపుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ ఆద్వర్యంలో ఘనంగా హోలీ సంబరాలు



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా హోలీ పండుగ ఉత్సవాలు సంతోషంగా జరుపుకున్నారు.చిన్నా పెద్ద తేడా లేకుండా సంతోషంగా ఒకరికి ఒకరు రంగులు చల్లుకొని హోలీ పండుగ వేడుకలు నిర్వహించారు అందులో భాగంగా యువ నాయకుడు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులతో కలిసి హోలీ ఉత్సవాల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండుగతో అందరి జీవితాలు రంగులమయం కావాలని, కష్టాలు తొలగి సుఖ సంతోషాలతో అందరూ సౌభాగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు చిన్నారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ద్విచక్ర వాహనం లో పాము కలకలం



**కొత్తగూడ తెలంగాణ సేన :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లోని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న శివాజీ నిన్న సాయంత్రం తన సెక్షన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ,తనకున్న ద్విచక్ర వాహనం లో డాష్ బోర్డు లో పాము కనిపించింది.ముందే అప్రమత్తమైన సెక్షన్ ఆఫీసర్.సుమారు రెండు గంటల పాటు పాము కలకలం సృష్టించి,చివరకు బండి దిగి వెళ్ళిపోయింది.

## విజయానికి చిహ్నంగా హోలీ పండుగ

మాజీ కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్



**భువనగిరి మార్చు 14 తెలంగాణ సేన న్యూస్ :** చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నమే హోలీ అని మాజీ కౌన్సిలర్ పడిగల రేణుక ప్రదీప్ తెలిపారు.పట్టణ లోని 23వ వార్డు ఇందిరానగర్ లో హోలీ పండుగ సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. ప్రజలందరి జీవితాలలో హోలీ పండుగ సంతోషం సంబరమనే సప్తవర్ణాలతో నిండిన ఇంద్రధనస్సు రంగులు పులుము కోవాలని పాడిపంటలు ఆయురారోగ్యాలు సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలంతా సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తూ ఎలాంటి అవంతరాలు లేకుండా జరుపుకోవాలని యువత వేగంగా బైకులు నడపడం విన్యాసాలు చేయడం వంటివి చేయకుండా ఇంటి వద్దనే స్నేహితులతో కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా జరుపుకోవాలని కోరడం జరిగింది అన్నారు. కర్కల సుదర్శన్ ,బర్రె మహేందర్ ,బర్రె నరేందర్ ,గోపే బాబు, రాము ,దర్గాయి గణేష్, దాసరి మధు ,నరేష్ రాజు, ప్రవీణ్ సాయి ,బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తా అనడం హాస్యస్పదం ఎంపీ చామల




**భువనగిరి మార్చ్ 14 తెలంగాణ సేన న్యూస్ :** అసెంబ్లీలో జగదీశ్వర్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతు సస్పెన్షన్ విధించారు అని , సస్పెన్షన్ ఎత్తివేసే దాకా కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తాననడం విడ్డూరంగా ఉంది అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మీకు దళితుల పట్ల,దళిత నాయకత్వం పైన ఉన్నటువంటి ఆలోచన విధానాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు. స్పీకర్ ప్రసాద్ ను అవమానించిన మీరు గతంలో మీ పార్టీ మీ ప్రభుత్వం కూడా దళితులకు ఎక్కడ విలువనివ్వలేదు అని ధ్వజమెత్తారు.ఉద్యమం మొదలుపెట్టినప్పుడు నుండి దళితుడే తెలంగాణకు మొదటి ముఖ్యమంత్రి అని చెప్పిన మీ నాయన నాటి నుండి నేటి వరకు దళితులను వంచిస్తూనే ఉన్నారు అని తెలిపారు. మీ ప్రభుత్వంలో నామ మాత్రంగా రాజయ్య ను ఉపముఖ్యమంత్రిగా చేసి నాలుగు దినాలైనా ఉండకుండా భర్తరాఫ్ చేశారు అని ఎందుకు భర్త రఫ్ చేశారు అనేది ఇంత వరకు ఎవరికి తెలవకుండా పోయిందన్నారు.ప్రణబ్ ముఖర్జీ వస్తే కాళ్లకు దండం పెడతారు .అదే రామ్నాథ్ కోవింద్ వస్తే కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు గుర్తు చేశారు. రాష్ట్రంలో 10 సంవత్సరాలు ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్ కుర్చీ కున్న విలువ ఏంటో తెలుసుకొని మాట్లాడాలి అన్నాను.దళిత స్పీకర్ ను అవమానించి, మళ్లీ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి అమర నిరాహార దీక్ష చేస్తాననడం సిగ్గుచేటు అన్నారు.కేటీఆర్ మీకు దళితుల మీద ఎటువంటి చిత్తశుద్ధి లేదు ఇటువంటి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ అసెంబ్లీని స్తంభింప చేయాలని చూడటం మానుకోవాలన్నారు. కేటీఆర్ మీ డ్రామాలన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు అని ,అమర నిరాహార దీక్ష చేస్తా అనే పిచ్చి ఆలోచనలను మానుకోవాలి అని హితావు పలికారు.

## విజ్ డమ్ హై స్కూల్ లో వినియోగ దారుల చైతన్య సదస్సు




**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో విజ్ డమ్ హై స్కూల్ లో చైతన్య సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ జావేద్ అధ్యక్షత వహించగా హన్మకొండ జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షులు ప్రొఫెసర్ రతన్ సింగ్ గారు మాట్లాడుతూ వినియోగదారులకు తమకు కావలసిన వస్తువులను కొనే స్వేచ్ఛ ఉందని దానితోపాటు నాణ్యతను కూడా పొందవచ్చని, ప్రతీ వినియోగదారుడు 2019 మార్చి 15 నుండి రక్షణ చట్టం ప్రకారం తమకు చెందిన హక్కులైన భద్రత హక్కు, సమాచార హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, విన్నవించుకునే హక్కు, నష్టపరిహారం పొందే హక్కు, వినియోగదారు విద్యను పొందే హక్కులను కలిగి ఉంటాడని వారు పేర్కొన్నారు. వినియోగదారుల మండలి వరంగల్ జిల్లా అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో వినిమయం చేయబడే వస్తువు లేదా సేవలను పొందే వ్యక్తిని వినియోగదారుడంటారని, ఇలాంటి వినియోగదారుడు తాము కొంటున్న ప్రతీ వస్తువును నిశితంగా పరిశీలించి, వాటి నాణ్యతలో తేడాలున్నట్లయితే వెంటనే తగు సమాచారాన్ని సమాచార కమిషనర్, పౌరసరఫరాల శాఖ వారికి అందించాలని, తద్వారా వస్తువుతో పాటు నాణ్యతను పొందవచ్చని, భారత వినియోగదారుల చట్టం లోని అంశాలను, హక్కులను తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జావేద్, వినియోగదారుల మండలి హన్మకొండ జిల్లా అధ్యక్షులు ప్రొఫెసర్ రతన్ సింగ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, రియాజ్, రాజేష్, రవీందర్ లతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సంపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** రంగు రంగు చల్లుకుంటూ పట్టణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియ జేసిన నర్సంపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పట్టణ అద్యక్షులు, మాజీ ఎంపీపీ, మాజీ కౌన్సిలర్స్, క్లస్టర్ బాధ్యులు, వార్డు అద్యక్షులు,యూత్ నాయకులు, పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సబ్ జైల్లో హెలీ సంబురాలు



**తెలంగాణ సేన :** మహబూబాబాద్ సబ్ జైల్లో హెలీ సంబురాలు ఘనంగా జరిగాయి. జైలర్ మల్లెల శ్రీనివాసరావు, సిటిజన్ ఫోరమ్ జిల్లా కోఆర్డినేటర్ శంతన్ రామరాజు పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జైలర్ మల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషిలో ఉన్న రాక్షస ప్రవృత్తిని దహనం చేస్తూ ప్రేమాఆప్యాయతలతో జరుపుకునే హెలీ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మనిషిలో దాగివున్న నేరప్రవృత్తి అంతమై నేర అవినీతి రహిత సమాజం కోసం అందరూ కృచెయ్యాలన్నారు. హెలీ పండుగ పరమార్థం కూడా ఇదే అన్నారు. అనంతరం జైల్లో మిఠాయి పంచిపెట్టారు.ఇంకా ఈకార్యక్రమంలో జైలు సిబ్బంది సిరి ప్రసాద్, చీర వెంకన్న, జితేంద్ర ప్రసాద్, జైపాల్ రెడ్డి, విజయ్, మురళి, పోషిని జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హెూలీ సంబరాలు



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో హోలీ సంబరాలను జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు.. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ వివిధ భాగాల పార్టీ అధ్యక్షులకు పార్టీ ఎన్ రోలర్స్ సోషల్ మీడియా విభాగం మహిళ విభాగం విద్యార్థి విభాగం నర్సంపేట పట్టణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచనల మేరకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఓబీసీ అధ్యక్షులు ఓర్సు తిరుపతి, నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి చిప్ప నాగ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి బిట్ల మనోహర్, జన్ను మురళీ, నర్సంపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్కె షఫీక్, నర్సంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుకల మనీష్, నర్సంపేట పట్టణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడబోయిన కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీరం భరత్ రెడ్డి, అప్పాల శ్రీకాంత్, భూసాని సుదర్శన్, పున్నం రాజు, గోక వేదప్రకాష్, లైన్ నీతిన్, గద్ద అఖిల్, చెన్నాబోయిన సాయి శ్రావణ్ దాస్, మచ్చకంటి మనోజ్ కుమార్, ములుకల తరుణ్, పాల్గొన్నారు.

## మాదిగ హక్కులే మానవ హక్కుల ఉద్యమిస్తుంది

వేల్పుల సూరిమాదిగ



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** మున్నూరు కాపు మహజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ గ్రౌండ్ పాతనిరసనదీక్షలు నాలుగో. వరోజుకు చేరుకోవడం జరిగింది.నిరసన దీక్షలకు సభ అధ్యక్షులు వహించగా తడుగుల విజయ్ మాదిగ.మాదిగ.మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా.వేల్పులసూరి మున్నూరు కాపు మాదిగ కళ్ళేపెళ్లిప్రణయదీప్ మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులులినిరసన దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతూ మాదిగ హక్కుల ఉద్యమం నేడు మానవ హక్కుల ఉద్యమంగా ప్రజలతో ఉద్యమిస్తుందిపద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక ఉద్యమం సమాన పంపిణీ దిశగా జరుగుతుంది. సామాజిక ఉద్యమాలతో. ఆరోగ్య శ్రీ పథకం. దళిత గిరిజన.ప్రభుత్వ.ఉద్యోగులకు శాఖలలో ప్రమోషన్ లోకి రిజర్వేషన్ సాధించడం జరిగింది. రాష్ట్రంలో సామాజిక ఉద్యమాలకు ఎమ్మార్పీఎస్ఎంఎస్పీపార్టీ రాబోయే రోజుల్లో ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ ప్రజల కోసం రాజ్యాధికార దిశగా అడుగులు వేస్తుంది నిరసన దీక్షలో కూర్చున్న ఉద్యమ ప్రతినిధులు ఆరోగ్యము. సరోజనసమ్మక్క. అనిత. సుధారాణి. లక్ష్మి రజిత ప్రమీల నిర్మలశ్రీకాంతసది శ్రీకాంత్ఉప్పలయ్యరాజు సదానందం.యాకయ్య నరసయ్య రామకృష్ణ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.సామాజిక ఉద్యమ వందనాలతో దళిత రత్న కళ్ళపెల్లి ప్రణయ్ దీప్ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు.

## మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్కే లాభం.. కాదంటే పార్టీకే నష్టం

ఎమ్మెల్యేరాజగోపాల్ రెడ్డి



**తెలంగాణ సేన న్యూస్ :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై మరోసారి సంచలన కామెంట్స్ చేశారు.తనకు కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి కల్పించాలని నేరుగా డిమాండ్ చేయకుండా పరోక్షంగా తన మనసులోని మాటను బయట పెట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో ఈ సందర్భంగా మంత్రి పదవి గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.తనకు మంత్రి పదవి వస్తే కాంగ్రెస్ పార్టీకే లాభం. 2018లో తాను కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తే బీజేపీకి, ఆ తర్వాత బీజేపీ నుంచి పోటీ చేస్తే కాంగ్రెస్కు డిపాజిట్లు రాలేదు.నిద్రాహారాలు మాని భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించా.ఇప్పుడు మంత్రి పదవి కాంగ్రెస్ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం' అని పరోక్షంగా పార్టీని ఉద్దేశించి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గౌరవం అదే వస్తుందని అన్నారు. అసెంబ్లీలో జరిగిన స్పీకర్– జగదీశ్ రెడ్డి అంశం పై స్పందిస్తూ.. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన స్థానం అని, దానిని ఎవరూ ప్రశ్నించలేరని పేర్కొన్నారు. జగదీష్ రెడ్డి స్పీకర్ చైర్ ను ప్రశ్నించడం సరికాదని, అతిగా ప్రవర్తించి.. అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే సస్పెండ్ చేశారని వెల్లడించారు. తాము ఎవరినీ టార్గెట్ చేయబోమని, కాని తప్పు చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

## దూల్పేట్ మల్చి పూర లో గంజాయితో తయారుచేసిన ఐస్ క్రీమ్, కుల్ఫీ స్వాధీనం

హోలీ సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ పోలీసుల తనిఖీలు బయటపడ్డ గంజాయి ఐస్క్రీమ్లు



**తెలంగాణ సేన న్యూస్ :** ఒకవైపు తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి వాడుకునే యూరియాతో కల్తీ పాలు చేసి వాటితో ఐస్క్రీమ్లు తయారు చేస్తూ చిన్నారులు, పెద్దల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నారు. మరొకవైపు గంజాయిని కలిపి ఐస్ క్రీములు, బర్ఫీ, స్వీట్లు తయారు చేస్తూ హోలీ పండుగ సందర్భంగా ప్రజలకు అంటగట్టడానికి చేస్తున్న ముఠా ను ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు దాడుల్లో పట్టుబడ్డాయి. దూల్పేట్ మల్చి కూర లో ఐస్ క్రీమ్, బర్ఫీలో గంజాయి వాడినట్లు గుర్తించిన పోలీసులు. హోలీ వేడుకల సందర్భంగా గంజాయి విక్రయించేందుకు సత్యనారాయణ అనే వ్యక్తి గంజాయితో కుల్ఫీ, ఐస్ క్రీమ్, స్వీట్లు తయారు చేసినట్లు గుర్తించి అతన్ని అదుపులకు తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న 100 డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి ఐస్ క్రీమ్ కు, కుల్ఫీలకు అలవాటు పడితే జీవితాంతం వీటికి అలవాటు పడతారని అధికారులు వెల్లడించారు.

## గరుడ వాహనంపై ఊరేగిన శ్రీవారు

గోవింద నామ స్మరణ మధ్య మానుమోగిన శ్రీవారి గిరిలు



**తెలంగాణ సేన న్యూస్ :** శుక్రవారం రోజున పౌర్ణమి సందర్భంగా తెలంగాణా తిరుమల దేవస్థానం యందు సాయంత్రం స్వామి వారి మాడ విధుల్లలో గరుడ వాహనం పై స్వామి వారి రథోత్సవ పై మాడవీధుల్లో ఊరేగారు. ప్రతి పౌర్ణమి పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా బీర్కూర్, తిమ్మాపూర్ శివారులో వెలసిన ఆ కలియుగ దైవం గరుడ వాహనంపై మాడ వీధుల్లో దర్శనం భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు నందకిషోర్, అభిషేక్ ఆధ్వర్యంలో స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో నరసరాజు, సత్యనారాయణ, ఆలయ కమిటీ మేనేజర్ విటల్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ పశువు బోర్డు కార్యదర్శి ఘన సన్మానం



**తెలంగాణ సేన న్యూస్ :** జాతీయ పసుపు బోర్డుకార్యదర్శి భవానిశ్రీ శుక్రవారం నిజామాబాద్ కు మొట్టమొదటి సారిగా అధికారిక పర్యటన కు వచ్చిన సందర్భంగా తెలంగాణా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించింది. నిజామాబాద్ పసుపు రైతుల చిరకాల కోరిక,రైతుల ఆకాంక్షకు అనుగుణంగా జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, పసుపుకు కనీస మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సెక్రటరీని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు కె. రామ్మోహన్ రావు, ఈవియల్ నారాయణ, ఎస్.ప్రసాదరావు, లక్ష్మీనారాయణ లావు వీరయ్య, డి చక్రపాణి హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ (హైదరాబాద్) తదితరులు ఉన్నారు.

## ఈనెల 15 లోపు జ్ఞానభూమి పోర్టల్ నందు వెబ్ ఆప్షన్ పూర్తి చేయాలి




**తెలంగాణ సేన న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అమరావతి వారి ఉత్తర్వులు మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి మరియు భోజనం సదుపా యంతో కూడిన ఉచిత డీఎస్సీ శిక్షణ కొరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకో వాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సం యుక్త సంచాలకులు శ్రీమతి జె.రంగలక్ష్మి దేవి, కర్నూలు వారు, ప్రకటనలో తెలపారు ఉచిత డీఎస్సీ శిక్షణ కొరకు ప్రవేట్ శిక్షణ సంస్థలను గుర్తించి వాటి ద్వారా శిక్షణ ఇచ్చేటప్పుడు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 1000 మంది షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లను పూర్తి వేశారు షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా వారి ప్రాధాన్యతను ఎన్నుకోవాలి షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులందరూ ఈనెల 15వ తేదీ లోగా తమ వెబ్ ఆప్షన్ లను జ్ఞానభూమి మరియు https://mdfc.apcfcss నందు పూర్తి చేయాలని ఆయన తెలిపారు.

## ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసి సంఘీభావ వేదిక కమిటీ ఎన్నిక

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** మార్ఖ్స భవన్ విద్యానగర్లో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి హైదరాబాద్ జిల్లా నిర్మాణము ఏర్పరచుకోవడం జరిగింది. ఇందులో కన్వీనర్స్ గా దళిత లిబరేషన్ ఫ్రంట్ నుండి ఇందిరా ప్రజా కళామండలి నుండి రాణి చైతన్య మహిళా సంఘం నుండి జయక్క దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నుండి రవి ఏఐఎఫ్టీయూ నుండి మల్లేష్ నుండి సురేష్ కుమార్ పిడిఎస్ మహేష్. అమరుల బంధుమిత్రుల సంఘం నుండి సత్య. తెలంగాణ ప్రజా ఫ్రంట్ నుండి రాంబాబు. కొనసాగుతారు ఈ కన్వీనర్ నిర్మాణానికి పౌరహక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తారు ఈ కన్వీనర్ కమిటీలో రైతు కూలి సంఘం నుండి జి వెంకటేశ్వరరావు ఆదివాసులపై మారణ హెూమాన్ని నిలిపివేయాలని సహజ వరుణుల దోపిడిని నిలిపివేయాలని పర్యావరణాన్ని రక్షించాలని పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది.

# మానని గాయానికి మందు




వినాశనం, విస్ఫోటనం మధ్య చిక్కుకున్నది మానవ జీవితం. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా చిక్కుకున్నామని ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుంటే.. మనుషులకు మధ్య దూరం ఎలా పెరిగిందో సులభంగా అర్థమవుతుంది. మనిషి మూర?త్వ ఆలోచనలే ఇందుకు కారణం. దీనివల్ల ఈ ఆధునిక కాలంలో కూడా కొన్ని సమూహాలు ఇంకా నలిగిపోతూనే ఉన్నాయి. అలాంటి వారి గాయాలకు పసునూరి కథలు మందు రాస్తాయనడంలో సందేహం లేదు. పసునూరి రచనల్లో శ్రమైక జీవన సౌందర్యం ఉన్నది. కథల్లో జీవం ఉన్నది కాబట్టే అతని రచనలు అంత చిక్కగ ఉంటాయి. శ్రమజీవుల నుంచి పుట్టిన ప్రతీ వాక్యం సజీవంగా ఉంటుంది. కొన్నేండ్ల పాటు కాదు, కొన్ని తరాలనే శాసిస్తుంది. అట్లా పసునూరి రచించిన 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు ఆధునిక దళితుల గోసలను కండ్ల ముందుంచుతాయి. 2జీ నుంచి 5జీకి వచ్చినా మారిందేమీ లేదు. జనరేషన్ మారిందే తప్పా.. మనిషిలో ఇసుమంత కూడా మార్పు రాలేదు. ఇక్కడ కులోన్మాదం అనే మాయరోగం కరోనా కంటే వేగంగా విస్తరిస్తోందనే చేదునిజాన్ని చాటుతున్నాయి 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు. పాదం కింద ఒక నినాదం మొలుస్తుందనేది అక్షర సత్యం. ఊరు కాని ఊరు. దేశం కాని దేశం దాటి మనుషులను ముక్కలుగా చేస్తుంది. మనిషికి మనిషికి మధ్య దూరాన్ని పెంచుతోంది. ప్రయోగశాలలు, వైద్యాలయాల్లో కూడా అంటరానితనం ఇంకా అలానే ఉందనడంలో సందేహం లేదు. అద్దె గర్భం ద్వారా పుట్టే బిడ్డను కూడా కులమతాలతో వేరు చేస్తున్నారు ఈ కులోన్మాదులు. అమ్మతనాన్ని సైతం మైక్రోస్కోప్‌తో పరీక్షించే తరహాలో ఉంది నేటి సమాజం. తన కులానికి చెందినవారి ద్వారానే దాన్ని కొనేందుకు ప్రయత్నిస్తుంది కులోన్మాదం. కడుపుకే కనులుంటే కడుపు కోత అనుభవించేదా? అని ప్రశ్నించేదే ఇందులోని 'కండీషన్స్ అప్లయ్' కథ. ఊరిలో అంబేద్కర్ విగ్రహం పెట్టనివ్వకుండా దొర కుట్ర చేస్తే బహుజనులు తిప్పికొట్టిన ఒక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది 'ధమ్కీ' కథ. ఆకలిని తట్టుకోలేక ఆకులు తిన్న లింగడిని ఆదుకోవాల్సింది పోయి, అతని ఆకలిని దైవత్వంతో పోల్చడం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. ఇలాంటి సంఘటనను చూపించిందే 'లీఫ్ మ్యాన్' కథ. పల్లె నుంచి పట్నం దాకా, పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు కులోన్మాద విషం ఎంతలా విస్తరించిందో 'ప్యూర్లీ నాన్ వెజిటేరియన్' కథ వివరిస్తుంది. కట్టుకథలు, అసత్య ప్రచారాలతో మతకల్లోలాలు జరుగుతాయని చెప్పేదే 'వాట్సప్ స్టేటస్' కథ. ఇట్లా 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలో మొత్తం 19 కథలున్నాయి. మొదటి కథ 'లీఫ్ మ్యాన్' కాగా, ఆఖరిది 'వెంటాడే పాట'. నిన్ను నువ్వు నిరూపించడానికి సాహసిస్తే, నువ్విక ఒంటరిగా మిగలవంటూ ధైర్యాన్నిస్తాయని చెప్తుందీ పుస్తకం.

# ఇది కదా ఐలమ్మ ఆశయం!



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావడంతో ఇటీవల ఘనంగా విజయోత్సవాలు జరుపుకొన్నది. అధికారంలోకి రాగానే చే(ఆరు) గ్యారెంటీల అమలుపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ సర్కార్ వాటిలో ఒక్కటి, రెండు మాత్రమే, అవి కూడా అరకొరగా అమలుచేసింది. దీంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పాలకులం కాదు, సేవకులమని కాంగ్రెస్ నాయకులు మొదటినుంచీ చెప్తున్నారు. తమది ప్రజా పాలన అని చెప్తూ ప్రజాదర్బార్‌లు కూడా నిర్వహించారు. ఇది ప్రజాపాలనకు నిదర్శనమని వందిమాగధులు వంత పాడుతున్నారు. ముఖ్యమంత్రి కూడా ప్రజల్లో కాంగ్రెస్‌ప్రాబల్యం తగ్గకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నా రు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం న్యూయార్క్ వలె మారబో తున్నదని ప్రకటించారు. అంతేకాదు, మన దేశంలోని రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో తాము పోటీ పడుతున్నామని కూడా సెలవిచ్చారు. గత ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ల ద్వారా 55 వేల ఉద్యోగాలు భర్తీచేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్లకు ఎల్బీ స్టేడియాన్ని అడ్డాగా మార్చారు. అయితే, మాటలు చెప్పడం సులువే, అమలు, ఆచరణే కష్టం. చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఆమె మనమరాలును నియమిస్తున్నామని సీఎం ప్రకటించారు. ప్రతిష్టాత్మక కోఠి మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టడం ఆమెకు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు ఇది కొంతవరకు ఊరటే. దొరల గడీలను బద్దలుకొట్టి, పెత్తం దారీతనానికి పాడె కట్టిన ధీరవనిత ఐలమ్మ. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె పోరాడారు. భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించాలనే లక్ష్యంతో పోరు సలిపారు. ఐలమ్మకు కావాల్సింది పేరు కాదు, వట్టి హామీలు, మాటల గారడీతో ఈ వర్గాలను మభ్యపెట్టడం అసలు కానే కాదు, ఆయా వర్గాలకు భూములు పంచి, జీవనోపాధి కల్పించి వారి సామాజిక హోదాను పెంచడమే ఐలమ్మ సంకల్పం. అయితే, ఈ వర్గాల బలహీనతలను సొమ్ము చేసుకొని అసలైన అధికారాన్ని భూస్వాములైన పెట్టుబడిదారులు అనుభవిస్తున్నారు. భూమిని పునఃపంపిణీ చేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించవచ్చు. తద్వారా భూ యాజమాన్యంలో ఉండే అసమానతలను రూపుమాపవచ్చు. అందుకే, 'ఒట్టి మాటలు కట్టిపెట్టవోయి గట్టిమేలు తలపెట్టవోయి' అన్న గురజాడ మాటల సాధన చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. అదే ఆమె ఆశయం కూడా. 1948 సెప్టెంబర్‌లో భారత్‌లో తెలంగాణ విలీనమైనప్పటికీ, ఎస్టేట్ల చట్టం రద్దయినప్పటికీ, 1973లో అప్పటి కాంగ్రెస్ సర్కార్ భూ పంపిణీ చట్టాన్ని తీసుకువచ్చి, 1975లో ఆ చట్టాన్ని అమలుచేసింది. ఈ రెండేండ్లలో భూస్వాములందరూ తమ భూములను బినామీ పేర్లపై మార్చుకున్నారు. తద్వారా చట్టాల పరిధిలోకి భూములు రాకుండా తప్పించుకున్నారు. దీనికి అప్పటి అధికార, ఉద్యోగ యంత్రాంగం తోడ్పడింది. ప్రస్తుతం పట్టణ భూ పంపిణీ చట్టాలను పూర్తిగా రద్దుచేశారు. దీంతో కొంతమంది భూస్వాములు వందల ఎకరాలను ఆక్రమించి ఫ్యాక్టరీలు, ఫామ్‌హౌజ్‌లు నిర్మించుకొని భూమిని అట్టిపెట్టుకున్నారు. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఇది పాతకాలం నాటి జమిందారీ వ్యవస్థను తలపిస్తుంది. ధరల నిర్ణయంతో పాటు, భూముల కేంద్రీకరణ అంశం ఈ కార్పొరేటీకరణలో ప్రధానంగా ముందుకువచ్చింది. దీన్ని సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు కూడా తీసుకువచ్చాయి. తెలంగాణలో ఎస్సీలు సుమారు 14.28 శాతం మంది ఉన్నారు. బీసీలు 40 శాతానికి పైగా ఉన్నారు. ఇతర బలహీనవర్గాలు 20 శాతం వరకు ఉండవచ్చు. మొత్తంగా ఈ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల జనాభా 75 శాతం వరకు ఉంటుంది. కానీ, వీరిలో 29.97 శాతం మంది చేతుల్లో అసలు భూమే లేదు. అయితే, మిగిలిన 45 శాతం మంది చేతుల్లో 30 శాతం సేద్యపు భూమి మాత్ర మే ఉన్నది. మిగిలిన 70 శాతం సేద్యపు భూమి 25 శాత మే ఉన్న భూస్వాముల చేతుల్లో ఉన్నదని సెస్సు ఒక అధ్యయనంలో వెల్లడించింది. ఇది భూస్వామ్య వ్యవస్థను పరిరక్షించడమే. ప్రపంచంతో పోటీ పడాలంటే దక్షిణ కొరియాలో మాదిరిగా భూ గరిష్ఠ పరిమితిని ఏడున్నర ఎకరాలుగా నిర్ణయించాలి. చైనా వలె 17 రోజుల్లో భూ పంపిణీ చట్టాలను అమలుచేయండి. మన దేశంలో పంచిన మొత్తం భూమిలో ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే 20 శాతం పంచా రు. మన రాష్ట్రంలో వామపక్ష సిద్ధాంతాలకు కాలం చెల్లకుండా ఉండాలంటే భూ పంపిణీపై పోరాటం చేయాలి. అదే చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. భూ పంపిణీ చేసి సామాజిక తెలంగాణ తేవాలి. అప్పుడే ఐలమ్మ ఆశయం నెరవేరుతుంది.

# వారంపాటు అసెంబ్లీ శీతాకాల సమావేశాలు?

అసెంబ్లీ శీతాకాల సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటికీ, సోమవారం వరకు వాయిదా పడిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం సమావేశాలు పునఃప్రారంభమైన తర్వాత తొలుత సభ్యుల మౌఖిక ప్రశ్నోత్తరాలు నిర్వహించనున్నారు. అనంతరం బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం కానున్నది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే బిల్లులు ప్రవేశపెట్టాలి? వంటి అంశాలపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సభ సమావేశాలను వారంపాటు నిర్వహించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. పంచాయతీరాజ్, మున్సిపల్ వ్యవహారాలు సహా పలు శాఖల బిల్లులు సభకు వచ్చే అవకాశాలున్నట్టు తెలిసింది. కాగా, గత సోమవారం సమావేశాల ప్రారంభం రోజే తెలంగాణతల్లి నూతన విగ్రహం, రూపురేఖలు వంటి అంశాలపై సభలో చర్చించారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులను ఉభయసభల్లోకి ఉద్దేశపూర్వకంగానే రాకుండా చేసి, ప్రభుత్వం చర్చ పెట్టిందనే విమర్శలు వినిపించాయి. తెలంగాణ ప్రజలు ఆరాధించిన తల్లిని కాదని, అభయహస్తం తల్లిని ఉద్దేశపూర్వకంగా రుద్దాలనే కుట్రను ప్రభుత్వం చేసిందని, ఆ బండారం అంతా తాము బయటపెడతామనే భయంతోనే తమను ముందస్తుగానే సభకు రాకుండా అరెస్టు చేయించిందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నది.



### నేడు క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గం సోమవారం భేటీ కానున్నది. శాసనసభ ప్రాంగణంలోని అసెంబ్లీ కమిటీ హాల్-1లో మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ సమావేశం కానున్నది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న పలు బిల్లులపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించనున్నారు.

# మనసూ.. మస్తిష్కాలను మేల్కొల్పే కథ



మనిషి మాటలు నేర్చినప్పుడే కథ పుట్టింది. అక్షరాలతో పెరిగింది. అమ్మ చెప్పింది కథ. ఊహాశక్తికి రెక్కలు తొడిగింది కథ. బతుకుకు అద్దం పట్టింది కథ. ఇంతకూ కథాక్రమం బెట్టిదనిన.. సాహిత్యాన్ని కాలం, రచనా విధానాల ఆధారంగా చూసినప్పుడు అది ప్రాచీన, ఆధునిక సాహిత్యంగా విభజించబడుతుంది. కథా సాహిత్యంపై పూర్తి అవగాహన లేనివారు కథను ఆధునిక సాహిత్యంగానే పరిగణిస్తారు. అలా కథా పరిధిని, సాహిత్యంలో దాని స్థాయిని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఒక అంశం/ విషయం గురించి వివరించాలంటే దానిగురించి కొంత తెలిస్తే సరిపోతుంది. కానీ, ఒక అంశాన్ని విమర్శించాలంటే మాత్రం దాని పుట్టుక, పరిధి, విస్తృతి గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలగాలి. అప్పుడే ఆ విమర్శకు విలువ ఉంటుంది. కథ గురించి పూర్తి అవగాహన రావాలంటే మొదట దాని పుట్టుక గురించి తెలుసుకోవాలి. అందరూ అనుకుంటున్నట్టుగా కథ అనేది ఆధునిక సాహిత్యం కాలంలో పుట్టిన పసిపాప కాదు. సాహిత్యం ఊపిరి పోసుకోవటానికి ముందే పుట్టి, ప్రపంచాన్ని, ప్రజల మనో సామ్రాజ్యాన్ని పాలించిన నిత్యనూతన అమర చక్రవర్తి. కథ గురించిన మొదటి ప్రస్తావన మనకు అగ్ని పురాణంలో కనపడుతుంది. అందులో సహజమనిపించే అసహజమే కథ అని వర్ణించబడింది. దీన్నిబట్టి చూస్తే కథ అనేది లిఖిత పురాణేతిహాస సాహిత్యం కంటే ప్రాచీనమైనదని తెలుస్తుంది. అంతేకాకుండా అందులో కథను ఏడు రకాలుగా వర్గీకరించారు. అవి కథ, ఆఖ్యాయిక, పరికథ, ఖండ కథ, ఉప కథ మొదలైనవి. ఇందులో ఆఖ్యాయిక వాస్తవిక ఇతివృత్తం గలది అని, కథ అంటే కల్పిత ఇతివృత్తం కలది అని వర్ణించబడింది. అక్షరయుత భాష సైతం నేర్వకమునుపే భావప్రసారమే సాధనంగా ఉండే కాలంలో మానవుడు తనలోని కళాత్మకతను వ్యక్తీకరించడానికి ఎన్నుకున్న సాధనమే కథ. తను చూసిన విడివిడి పూసల వంటి సన్నివేశాలు, సంఘటనలకు తనలోని ఊహాశక్తి సూత్రాన్ని జోడించి దాన్ని ఒక మంచి హృదయాకర్షణీయమైన రూపంగా సృష్టించగలిగాడు. ఆ ఊహాశక్తి కథకుడి ఆలోచనలకు సంతృప్తి ఇచ్చినప్పటికీ, ఎక్కువ కాలం శ్రోతల మనసును ఆకట్టుకోలేకపోయింది. అందువల్ల అతడు కథను మరింత రసవత్తరంగా తీర్చిదిద్దేందుకు అందులో సందర్భోచితంగా అందమైన, మనసును ఆకట్టుకునే అల్లికలను, వర్ణనలను మిళితం చేయసాగాడు. అలా కథకు రూపం ఇచ్చే అల్లికలు 'రచయిత మెదడుకు సానపడుతూ, శ్రోత మనసును మరింతగా ఆకట్టుకోసాగాయి'. కథకు ప్రాణం పోసే వర్ణనలు 'రచయిత మనసులోని అనుభూతులకు ఒక సజీవ రూపాన్ని కల్పిస్తే, శ్రోతను ఊహా లోకంలోకి ఎత్తుకెళ్లి, మధుర జ్ఞాపకాలను అందించసాగాయి.' అంతేకాక కథ ప్రసరణ ముఖ్యంగా ఆశు రూపంలోనే సాగుతుంది. అలా కథ సారాంశాన్ని గుర్తుంచుకొని, తమదైన ఊహల్ని, అనుభూతులను, తమలోని చిలిపి ప్రణయ భావాలను కొత్తగా జత చేస్తూ, దానిని నిరంతరం సరికొత్తగా ముస్తాబు చేస్తుంటారు. అందుకే కథ అనేది 'మనసు (అనుభూతులు) %-% మెదడు (ఆలోచనలు)ల మేలిమలుపుగా' అభివర్ణించబడుతుంది. మొదట్లో వచనం రూపేణా మాత్రమే ప్రసరణ జరిగిన కథ తదనంతర కాలంలో క్రమబద్ధమైన పదవిరుపుల చేత లయను పొంది, మధురమైన గాత్రరూపేణా పాటలుగా తన ఉనికిని మెరుగుపరుచుకుంది. అలా కథ జనాకర్షణకు అవసరమైన మార్పులను అందిపుచ్చుకుంటూ, తన అస్తిత్వాన్ని పదిలపరుచుకున్నది. ఇదంతా అక్షర రూపం పొందని భాషా ప్రయోగం కంటే ముందే జరిగింది. అంటే కథ అనేది లిఖిత సాహిత్యం కంటే ప్రాచీనమైనది, సంఘ మానవుని తొలి కళాభివ్యక్తి రూపంగానూ ప్రసిద్ధమైనది. కథ అంటే వర్ణనలు, కథనం కూర్చటమే కాదు, కాలాతీతంగా మనసులను హత్తుకోగలిగి ఉండాలి. బృహత్కథ, చందమామ, పేదరాశి పెద్దమ్మ, భట్టి విక్రమార్క కథలే అందుకు ఉదాహరణ. నిర్మాణాత్మకత దృష్ట్యా మరికొన్ని కథలు కథకు నిదర్శనంగా గుర్తుండిపోతాయి. అందులో తొలి వరసలో నిలువదగినది బృహత్కథ. తెలుగువాడైన గుణాఢ్యుడు రాసిన బృహత్కథ ప్రపంచ కథా సాహిత్యానికే నడకలు నేర్పిన సూత్రప్రాయ ఉద్గ్రంథం. లిఖిత అక్షర జ్ఞానం పొందిన తర్వాత పురాణేతిహాసాలు కావ్యాదులు వెలువడ్డాయి. పురాణేతిహాసాలలో దైవత్వ అంశాలు, ఆముష్మిక జీవితాంశాలు ప్రధాన ఇతివృత్తాలుగా, కారణజన్ములు, చక్రవర్తుల జీవితాలు, ప్రణయ తత్వాలు ఇతివృత్తాలుగా కావ్యాదులు వెలువడ్డాయి. అంతేకాక ఈ సాహిత్యం జటిల గ్రాంథిక భాషలో ఉండటం, సామాన్యుల ప్రజల జీవితాలను స్పర్శించకపోవడం వల్ల ఇవి సామాన్య జన బాహుళ్యంపై అంతగా ప్రభావం చూపలేకపోయాయి. దాంతో సామాన్యుల జీవితాలను, వారి సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, లిఖిత సాహిత్య జ్ఞానాన్ని సామాన్యులకు పరిచయం చేయడానికి సాహిత్యకారులకు కనపడిన ఒకే ఒక్క మార్గం కథ. అలా మొదటగా కథలు కావ్య ప్రక్రియలో ప్రవేశించి, కథా కావ్యాలుగా పరిణతి చెందాయి. ఆ పరంపరలో తొలిసారి కేతన దశ కుమార చరిత్ర అనే కావ్యంను కథా రూపేణా అనువదించారు. కథలను కావ్యాలలో ప్రవేశపెట్టి కథా కావ్యాలుగా మార్చే క్రమంలో ఒక పెద్ద సవాలు ఎదురైంది. అదే అటు లిఖిత సాహిత్యకారులను, ఇటు నిరక్షరాస్యులను ఆకట్టుకోవాల్సి రావటం. అందుకోసం రచనా ప్రకారం అందులో సాహిత్య నియమాలను జొప్పించి అటు శిష్ట సాహిత్యవేత్తలను, ఇతివృత్తంలో సామా న్య జీవన విధానాలను, వారి సంస్కృతి సంప్రాదాయాలను మిళితం చేస్తూ, ఇటు జానపదులను మెప్పించటంలో కథా కావ్యాలు మరింత సఫలమయ్యాయనే చెప్పవచ్చు. అందుకు జక్కన రాసిన విక్రమార్క చరిత్రను సజీవసాక్షంగా చూపించవచ్చు. విక్రమార్కుడి జీవితాన్ని అద్భుతమైన వర్ణనలతో వివరిస్తూనే, అతడి సాహస గాథలను, అద్భుతమైన మానవాతీత శక్తులను సామాన్య జీవన విధానం, సంస్కృతులతో సందర్భోచితంగా ముడిపెడుతూ ఎంత గొప్ప కథాకావ్యంగా తీర్చిదిద్దారంటే ఎన్ని శతాబ్దాలు గడిచినప్పటికీ విక్రమార్కుని పేరు తెలియనివారు ఉండరనటం అతిశయోక్తి కాదు అనేంతలా. అలా ప్రజాదరణ కోసం, తమ అస్తిత్వాన్ని పదిలపరుచుకోవడం కోసం అనేక ప్రక్రియలు, రచనలు కథారూపంలోకి మార్చబడినాయి. ఉదాహరణకు రాజశేఖరుడి విద్దసాల భంజిక అనే నాటకం తర్వాతి కాలంలో మంచన కేయూరబాహు చరిత్రగా, భాగవత పురాణం జన వ్యవహారంలో హరికథలుగా మారడమే. తొలినాళ్లలో పురాణేతిహాస కావ్య ప్రబంధాల వలనే కథలో కూడా కొన్ని రసాలు నిబద్ధం చేయబడ్డాయి. అవి ఆది- భయానక, మధ్య-కరుణ, అంత్యంలో అద్భుతం. కానీ, జానపదులు వీటితో పాటు మరో రసం కూడా కథలో చేర్చుకున్నారు. అదే వీర రసం. ఒక రకంగా చెప్పాలంటే అదే వారి కథల్లో ప్రధానాంశం. సమాజంలో ఉన్న అన్యాయాన్ని ఎదిరించినవారిని, మంచి కోసం, సమాజం కోసం, జన్మభూమి కోసం ప్రాణాలు సైతం లెక్కచేయక పోరాడిన వీరులను దేవుళ్లుగా అభివర్ణిస్తూ, వారి సాహసాలను, పోరాటాలను, పూర్తి జీవితాన్ని ఒక కథగా కూర్చుతూ, భవిష్యత్తు తరాలకు ఉగ్గు పాలతో నేర్పిస్తారు. అవే వీరగాథలు. ఉదాహరణకు పండుగ సాయన్న మియ్యసాబ్ కథలు. వీరు ఆ వీరుల త్యాగాలను, స్ఫూర్తిని మరుగున పడకుండా, వారు చూపిన ధైర్య సాహసాలను భావితరాలు అలవర్చుకోవాలని వాటిని గానం కట్టి పాటలుగా పాడుతారు, అవే వీరగాథ గేయాలు. తర్వాత వాటిని ప్రదర్శన రూపాలుగా మలిచి, రంగస్థలంపై కూడా ప్రదర్శించసాగారు. ఆ వీరగాథ ప్రదర్శన కళారూపమే బుర్రకథ. ప్రాచీనకాలంలో వర్ణన ప్రధానంగా సాగిన సాహిత్యం తర్వాతికాలంలో భావ ప్రధానంగా పరిణామం చెందింది. అలాగే వర్ణన ప్రధానంగా ఉన్న కథ కూడా నవల రూపేణా విషయ ప్రధానంగా మారి, కథానికగా పరిణతి చెందింది. నాటి అద్భుత, వీర సమన్వయ గర్భిత కాలం నుంచి నేటి విషయ వ్యక్తీకరణ కాలం వరకు కథ భౌతిక రూపంలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ రచన, కూర్పు, వ్యక్తీకరణ, పాఠక ఆకర్షణ మొదలైన అంశాల సఫలత అనేది మనసు (అనుభూతులు)- మెదడు (ఆలోచనలు)లతో పెనవేసుకున్న అవినాభావ సంబంధాన్ని మాత్రం అవిరళంగా కొనసాగిస్తూనే ఉన్నది.

# బతుకమ్మ లేని తల్లిని ఊహించలేం

'ఉద్యమకారులు, కవులు, కళాకారులు, మేధావుల ఏకాభిప్రాయంతో 'తెలంగాణ తల్లి' ఇలా ఉండాలని నిర్ణయించి నాడే ఆ తల్లిని హుందాగా రూపొందించారు. నేడు ఆ ఆకృతిని బోసిపోయినట్టుగా మార్చడం రాష్ట్రానికే సిగ్గుచేటు. కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టుంది' అని తెలంగాణ ఉద్యమకారుడు, నాగర్‌కర్నూల్‌కు చెందిన కవి వనపట్ల సుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.



### తెలంగాణ తల్లి మార్పు విషయంలో ఓ కవిగా మీ అభిప్రాయం ఏమిటి?

వనపట్ల సుబ్బయ్య: బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఓ అభిమానిగా, ఓ కవిగా ఊహించుకోలేకపోతున్నా. ఓ రాజకీయ పార్టీనో లేక ఓ రాజకీయ నాయకుడో పెట్టింది కాదు బతుకమ్మ. తెలంగాణ లో అనాది నుంచి వారసత్వంగా వస్తున్న సంప్ర దాయం. 50 ఏండ్ల పాటు తెలుగు తల్లిగా ఉన్నటువంటి తెలంగాణలో మనకంటూ ఒక 'తెలంగాణ తల్లి' ఉండాలనే ఆలోచన చేసిన మొట్ట మొదటి వ్యక్తి కేసీఆర్. అలాంటి తెలంగాణ తల్లి విగ్రహంలో నాటి ఉద్యమకారులు బతుకమ్మకు ప్రముఖ స్థానం కల్పించారు. అలాంటి బతుకమ్మను నేటి తెలంగాణ తల్లి నుంచి వేరు చేయడం సిగ్గుచేటు.

### తెలంగాణ తల్లి విగ్రహం ఎప్పుడు వెలుగులోకి వచ్చింది? ఎప్పుడు, ఎక్కడ ఆవిష్కరించారు?

తన చేతిలో బతుకమ్మ పెట్టుకొని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తొలిసారిగా 2006లో కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో ఆవిష్కరింపబడింది. ఆ త ర్వాత తెలంగాణ తల్లి మనకు ఆరాధ్య దైవమైంది. ఏ తల్లయినా బట్టలు చినిగిపోయి ఉండాలని కోరుకోదు. అందుకే నాటినుంచి ఆభరణాలు, కిరీటం చేయించి అమ్మగా కొలుచుకుంటున్నాం.

### తెలంగాణ తల్లి రూపుమార్చాలనే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఎందుకొచ్చిందంటారు.?

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మీరు అధికారంలో ఉండి పెట్టలేకపోయారు. అందుకే, ఇప్పుడు మేము పెడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలకు పోతున్నది. కానీ అది వాస్తవానికి విరుద్ధం. 2006లోనే రాష్ట్ర వ్యాప్తంగా వేలకొద్దీ తెలంగాణ తల్లి విగ్రహాలు కొలువుదీరాయి. అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం కావచ్చు, ప్రపంచ తెలుగు మహాసభలలో ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా పూజలందుకున్న తెలంగాణ తల్లి కావచ్చు.. ఇవన్నీ గతంలో ఏర్పాటుచేసినవే. రాష్ట్రంలో మూలమూలన తెలంగాణ తల్లి విగ్రహాలున్నప్పటికీ మళ్లీ పెట్టాలనే ప్రభుత్వ ఆలోచన వెనుక కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలనే కుట్రలు కనపడుతున్నాయి.

### అంటే సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడమే మంచిదని మీ అభిప్రాయమా?

నూటికి నూరు శాతం నా అభిప్రాయం అదే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ప్రతిష్ఠించుకుందామనుకొని, అందుకోసం స్థలాన్ని కూడా సేకరించుకొని పెట్టుకున్నది. ఆలోపు అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ పనికి ఆగిపోయింది. ఆ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ కి అవకాశం ఇచ్చారు. ఆ అవకాశాన్ని కాంగ్రెస్ నాయకులు సద్వినియోగం చేసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అందుకు ఉదాహరణే సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సిన చోట, అసలు తెలంగాణకు, తెలంగాణ ఉద్యమానికి ఏ మాత్రం సంబంధంలేని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం తెలంగాణ అస్తిత్వాన్ని అణగదొక్కాలని చూడటమే. దానితోనే ఆగకుండా తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని కూడా మార్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ తల్లి, బతుకమ్మలను వేరు చేయడం ఇంకా విచారకరమైన విషయం.

### కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి మీకెందుకు నచ్చడం లేదు?

సచివాలయంలో పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో అభయహస్తం ఉంది, అది చేయిగుర్తును పోలినట్టుగా ఉన్నది. ఆ చేతిలో బతుకమ్మ ఉంటే మాకు, తెలంగాణ ప్రజలకు గౌరవంగా ఉంటుంది. బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఒక కవిగా నేను ఊహించుకోలేకపోతున్నా.

### ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠించిన కొత్త తెలంగాణ తల్లి విగ్రహం వెనుక పరాయి కుట్రలేమైనా దాగున్నాయని మీకు అనిపిస్తున్నదా?

వంద శాతం అనిపిస్తున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు కండ్ల సిద్ధాంతాన్ని ప్రదర్శించిన చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదే శ్‌కు సీఎంగా ఉన్నాడు. ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా ఉన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లను ఈ ఇద్దరు కలిసి తుడిచేయాలనే కుట్రలు చేస్తున్నట్టు ప్రస్ఫుటంగా అర్థమవుతున్నది. ఆ కుట్రలో భాగమే ఉద్యమ సమయంలో తయారు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చివేసి అబాసుపాలవుతు న్నది.

### సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం మంచి నిర్ణయమేనా?


సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడమనేది హర్షించదగిన విషయం ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు నగరానికి వస్తుంటారు, పోతుంటారు. ఆ తల్లి విగ్రహాన్ని చూడాలనుకున్నప్పుడు సచివాలయ పోలీసు సిబ్బంది వారిని లోపలికి అనుమతించే ఆస్కారం ఉండదు.

### అమరజ్యోతి గురించి మీరేమైనా చెప్పదలచుకున్నారా?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే కోరిక నాదే కాదు, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలది కూడా. అరువై ఏండ్లు పోరాడినా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించకపోవడంతో, ఇక తెలంగాణ రాష్ట్రం రాదేమోనని, మేము ఆత్మబలిదానాలు చేసుకుంటేనైనా తెలంగాణ ప్రకటిస్తారేమోనన్న ఆశతో కొంతమంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారు, అగ్నికి ఆహుతయ్యారు. వారి ఆశయాలకనుగుణంగా ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అలాంటి తెలంగాణ రాష్ట్రంలో బంగారు బాటగా దూసుకెళ్తున్న క్రమంలో పరాయి శక్తులు మళ్లీ తెలంగాణపై పడ్డాయి. అందులో భాగంగానే తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో మార్పు, ఆ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేయడమే. ఇది తెలంగాణకు క్షేమదాయకం కాదు. ప్రభుత్వం ఇకనైనా పునరాలోచించుకొని తెలంగాణ తల్లి విగ్రహ మార్పులో వెనక్కి తగ్గాలి. లేకుంటే తెలంగాణ ప్రజలు సహించరు.

### రాత్రి పూట డిన్నర్ చేశాక వాకింగ్

# చేస్తే ఎన్నో అద్భుతమైన ఫలితాలు



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే వ్యాయామం అంటే మరీ కష్టపడి జిమ్‌లలో కసరత్తులు చేయాల్సిన పనిలేదు. రోజూ కనీసం 30 నిమిషాల పాటు సాధారణ వాకింగ్ చేసినా చాలు. ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం వాకింగ్ చేయడం వల్ల రోజంతా మెటబాలిజం ఎక్కువగా ఉంటుంది. ఇది క్యాలరీలను కరిగిస్తూనే ఉంటుంది. కనుకనే ఉదయం వ్యాయామం చేయాలని వైద్యులు చెబుతుంటారు. అయితే కేవలం ఉదయం మాత్రమే కాదు.. రాత్రి పూట భోజనం అనంతరం కూడా వాకింగ్ చేయాలి. దీంతో మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయడం ఎన్నో మంచి ఫలితాలను ఇస్తుందని వారు అంటున్నారు.

**అధిక బరువు, షుగర్ లెవల్స్..**

రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కనీసం 10 నిమిషాల పాటు తేలికపాటి నడక కొనసాగించాలి. రాత్రి పూట మన మెటబాలిజం తగ్గుతుంది. కానీ వాకింగ్ చేస్తే మెటబాలిజంను పెంచుకోవచ్చు. దీంతో రాత్రి మనం నిద్రించినా కూడా మన శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తూనే ఉంటుంది. ఫలితంగా మనం నిద్రలో ఉన్నా కూడా మన శరీరంలోని కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట డిన్నర్ తరువాత వాకింగ్ చేస్తే ఎన్నో మంచి ఫలితాలను పొందవచ్చు. ఇక రాత్రి పూట భోజనం అనంతరం వాకింగ్ చేయడం వల్ల షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాత్రి డిన్నర్ తరువాత వాకింగ్ చేసేవారి ఫాస్టింగ్ షుగర్ లెవల్స్ చాలా వరకు తగ్గాయని తేల్చారు. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ షుగర్ లెవల్స్‌ను తగ్గించుకునేందుకు గాను రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయాలి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం.

**కొలెస్ట్రాల్ లెవల్స్..**

కొలెస్ట్రాల్ లెవల్స్ అధికంగా ఉన్నవారు రోజూ కచ్చితమైన డైట్‌ను పాటిస్తూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అప్పుడే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. అయితే రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేయడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ గణనీయంగా తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు రోజూ రాత్రి వాకింగ్ చేస్తే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే రోజూ రాత్రి వాకింగ్ చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. భోజనం చేసిన వెంటనే గ్యాస్ వస్తుందని, కడుపు ఉబ్బరంగా ఉంటుందని భావించే వారు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేస్తే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

సాధారణంగా భోజనం చేసిన వెంటనే శరీరంలో రక్త సరఫరా మొత్తం జీర్ణాశయం వైప చేరుతుంది. కానీ రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే రక్త సరఫరా మెరుగు పడుతుంది. హైబీపీ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. బీపీ ఉన్నవారు రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. రాత్రి డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పనితీరు మెరుగు పడుతుంది. రాత్రి వాకింగ్ చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# మీరు యజమానా? వాచ్ మ్యానా?


దైనందిన జీవితంలో సత్యం అనిపించిన ఎన్నో విషయాలు ఆర్థిక సూత్రాల్లో అంతగా ఇమడవు! ఓ మధ్యతరగతి మనిషికి పొదుపు అంటే%ా% ఖర్చులు తగ్గించుకోవడం వరకే ఆలోచిస్తాడు. మదుపు అంటే ప్రైవేటుగా చిట్స్ వేసి.. ధర్మవడ్డీకి తిప్పడమనే తెలుసు!! ముచ్చటపడి కట్టుకున్న ఇంట్లో మురిపెంగా ఉండాలని ఉన్నా.. ఇంకేదో ఆశిస్తాడు. రూపాయి, రూపాయి కూడబెట్టి ఇల్లు మీద ఇల్లు కట్టి.. యజమానిగా చెలామణీ కావాలని ఆశిస్తాడు. ఈ రకంగా ఆలోచించిన ఎందరో.. యజమానులుగా కన్నా, జీతం భత్యం లేని వాచ్‌మెన్లుగా మిగిలిపోతున్నారు. ఏ పెట్టుబడి అయినా మనల్ని ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేదై ఉండాలి. కానీ, ఆ పెట్టుబడే గుదిబండగా మారితే.. ఆశించిన లాభాలు రావు సరికదా, తలకు మించిన భారంగా పరిణమిస్తుంది. నడివయసులోనే సొంతింటి కలను నిజం చేసుకున్న వారు నిజంగా అదృష్టవంతులే! దానికి తృప్తిచెంది.. ఇతర పెట్టుబడుల గురించి ఆలోచిస్తే మేలైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు. కానీ, చాలామంది మూసపద్ధతికి అలవాటుపడినవాళ్లే ఉంటారు. వాళ్లు చేసే తప్పులు ఎలా ఉంటాయో పరశురామ్ కథ చదివితే అర్థమవుతుంది. పరశురామ్ ప్రైవేట్ ఉద్యోగి. మంచి జీతం వస్తుంది. ఊళ్లో కొద్దోగొప్పో ఆస్తి ఉంది. భార్య, ఇద్దరు పిల్లలు. జీవితం ఉన్నంతలో రిచ్‌గానే సాగిపోతుంది. పిల్లలు బడి వయసు దాటి కాలేజీలోకి ప్రవేశించారు. ఒకరోజు పరశురామ్ అత్తామామ ఊడిపడ్డారు. అత్తగారేమో తన కూతురుతో వంటింట్లో సొంతిళ్లు సొద మొదలుపెట్టింది. మామగారేమో అల్లుడితో అదే విషయాన్ని తన అనుభవాన్నంతా రంగరించి చెప్పనారంభించాడు. ‘అల్లుడుగారూ! కూడబెట్టిన సొమ్ముతో మంచి స్థలం తీసుకోండి. మంచి బిల్డర్‌కు ఇచ్చి లోను మీద ఇల్లు కట్టుకోవచ్చు. మూడంతస్తులు వేసి.. పై పోర్షన్‌లో మీరు ఉండి, మిగతావి అద్దెకిస్తే.. తిని కూర్చోవచ్చు! ఏమంటారు?’ అన్నాడు. మామగారి ఆలోచన సబబుగానే తోచింది పరశురామ్‌కు. తల్లి బోధతో అతని భార్య కూడా ఆలోచించండి అన్నట్టుగా చూసింది.

**కోరికలు.. ఫిర్యాదులు..**

ఇల్లు కట్టాలని ఫిక్సయిన పరశురామ్ అప్పటి వరకు తను కూడబెట్టుకున్న డబ్బంతా వెలికితీశాడు. ఈపీఎఫ్‌లో ఉన్న మొత్తాన్ని తీసుకున్నాడు. కొంత బంగారం కుదువపెట్టాడు. వెంచర్‌లో చిన్న స్థలాన్ని అమ్మేసి రూ.కోటి సర్దుబాటు చేసుకున్నాడు. ఆ మొత్తంతో నగర శివారులో 220 గజాల స్థలం కొన్నాడు. బిల్డర్‌ను సంప్రదిస్తే మరో కోటితో జీం2తోపాటు పైన పెంట్‌హౌజ్ నిర్మించేలా ఒప్పందం చేసుకున్నాడు. బ్యాంకులో రూ.1.20 కోట్లు గృహరుణం తీసుకున్నాడు. అప్పటికే 45 ఏండ్లు ఉండటంతో, లోను టెన్యూర్ 15 ఏండ్లు పెట్టుకున్నాడు. ఈఎమ్‌ఐ రూ.1.20 లక్షలుగా ఫిక్సయింది. అంటే అతని జీతంలో సగం వాయిదాకు చెల్లించాలని ఫిక్సయ్యాడు! ఇల్లు పూర్తయింది. ఆరు పోర్షన్లు అద్దెకిస్తే నెల తిరిగేసరికి రూ.60వేలు వసూలు అవుతున్నాయి. పరశురామ్ ఆనందానికి అవధుల్లేవ్. మూడు నెలలు గడిచాయో లేదో.. అద్దెదారులు పరస్పరం గొడవలకు దిగడం, తీర్పు కోసం పరశురామ్ తలుపు తట్టడం కామన్ అయిపోయింది. తప్పు చేసిన వారిని ఇల్లు ఖాళీ చేయించడమో, అలా చేయలేకపోతే తమదే ఒప్పు అనుకున్న వాళ్లు మరో ఇంటికి మకాం మార్చడమో జరుగుతూ వచ్చింది. ఆరు పోర్షన్లలో ఎప్పుడూ రెండు ఖాళీగానే ఉంటున్నాయి. ఇది చాలదన్నట్టు.. నీళ్లు రావడం లేదనీ, కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తున్నదనీ, మంచి నీళు పైకి వచ్చేలా ఏర్పాటు చేయమనీ, వాష్‌రూమ్‌లో నీళ్లు పోవడం లేదనీ.. ఇలా రోజుకో ఫిర్యాదు రావడం మొదలైంది. వాళ్ల కోరికలు మన్నించలేక, ఫిర్యాదులు పరిష్కరించలేక.. పరశురామ్‌కు సొంతింట్లో ఉంటున్న ఆనందం రెండేండ్లకే ఆవిరైంది. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్‌ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు. స్పష్టంగా చెప్పాలంటే.. రెండు కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేసిన యజమాని కాస్త ఆ ఇంటికి వాచ్‌మ్యాన్‌గా మారిపోయాడు. ఇప్పుడు మీరు ఆలోచించండి.. రూ.2.20 కోట్ల పెట్టుబడి పెట్టి.. ఇల్లు తీసుకున్న వ్యక్తి దర్జాగా బతక్కుండా, ఇలా నీరుగారిపోవడాన్ని ఏ ఆర్థిక సూత్రం మాత్రం ఆమోదిస్తుంది. ఇదే పరశురామ్ రూ.కోటితో ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌గానీ, అదే నగర శివారులో డూప్లెక్స్ ఇల్లు గానీ తీసుకుంటే.. ‘అనుభవించు రాజా!’ అని పాడుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేసేవాడు. తానొకటి తలస్తే విధి మరొకటి తలచింది. శాశ్వత ఆదాయం మాయలోపడి జీవితంలో ప్రశాంతతకు దూరం అయ్యాడు. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్‌ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు.




# పేరులోనే అంతా ఉంది




మార్పు శాశ్వతం అనే చమత్కారాన్ని మనం తరచూ వింటూనే ఉంటాం. తెలుగు సాహిత్యంలో ఈ మార్పును కవులు బాగానే ఒంటపట్టించుకున్నారు. ముఖ్యంగా తమ కవిత్వ సంకలనాల శీర్షికల విషయంలో ఈ మార్పు కనిపిస్తుంది. ఇంతకుముందు అంటే రెండు, మూడు దశాబ్దాల క్రితం అన్నమాట.. కవిత్వ సంకలనాలకు మూస టైటిళ్లు ఉండేవి. తాము రాసిన కవితల్లో ఓ కవిత పేరే సంకలనానికి పెట్టేవారు. ఇది ఇప్పుడూ కొనసాగుతోంది కానీ, ఆ కవితకు పెడుతున్న శీర్షికే కొత్తగా, ఆకర్షణీయంగా ఉంటోంది. ముఖ్యంగా ఓ దశాబ్దం నుంచి కవుల్లో ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే మార్పు కోరిన తరంగా కనిపిస్తోంది. ‘ఒక వెళ్లిపోతాను’ అని ఎం.ఎస్.నాయుడు తన కవిత్వ సంకలనానికి అందులోని ఒక పద్యం పేరే పెడితే తెలుగు సాహిత్య లోకమంతా చాలా ఆశ్చర్య పోయింది. ఆ కవిత్వ సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవయిత్రి విమల అయితే, ఆ పేరు చూసి కవిత్వంలో ఎన్ని మార్పులు వస్తున్నాయో అని ఆశ్చర్యచకితులయ్యారు. ఆ సభలోనే విమల మాట్లా డుతూ ఒక్క లైనులోనే ఓ కవితను చెబుతున్న వారూ ఉన్నారన్నారు. ఇదీ నేటి కవిత్వ భాష. ఇక ప్రసేన్ అయితే తన మూడు కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు చూసి ఆ కవిత్వం చదవాలనిపిస్తుంది. (కొనాలనిపించదు. కొట్టేసి చదవాలనిపిస్తుంది). ప్రసేన్‌కు జర్నలిస్టుగా అనుభవం ఎక్కువే కాబట్టి, అక్కడ హెడ్డిం గులు పెట్టినట్టే తన కవిత్వ సంకలనాలకు కొత్తకొత్త పేర్లు పెట్టి పాఠకులను తన వైపు తిప్పుకునేలా చేస్తున్నారా యన. అంటూ కార్పొరేట్ ప్రకటనలు వస్తున్నాయి కానీ, తెలుగు కవిత్వాన్ని మాత్రం ఆ కవర్ పేజీ, ముఖ్యంగా ఆ సంకలనానికి పెట్టిన పేరుని బట్టే చదువుతున్నారు. అంతేకాదు.. పుస్తక ప్రదర్శనల్లో కొంటున్నారు కూడా. ప్రసేన్ తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కొందరికి కొత్తగా అనిపిస్తే%ా% ఇంకొందరికి మాత్రం గమ్మత్తుగా అనిపించాయి. నాకు భలే నచ్చాయి ఆ పేర్లు. ప్రసేన్ రాసిన ఓ కవిత్వ సంకలనం పేరు ‘ఇంకా వుంది’. సృజనకారులకు ఎందులోనూ ముగింపు ఉండదు. కవి అనండి, రచయిత్రి కానివ్వండి ఏది రాసినా అంతా అసంపూర్ణమే. వాళ్లు చెప్పేందుకు ఇంకా చాలానే ఉం టుంది. బహుశా అందుకు సంకేతమే ఈ ‘ఇంకా వుంది’. ఇలాంటి తాత్వికతే మరో రెండు సంకలనాల టైటిళ్లలోనూ కనిపిస్తుంది. అందులో ఒకటి ‘ఎవరికి వర్తిస్తే వారికి’. ఈ కవిత్వం చదవడానికి కాసింత ధైర్యం కావాలనిపిస్తుంది. ఆ సంకలనం తెరిస్తే ‘మన గురించి, మనల్ని ఉద్దేశించి ఏమైనా రాశారా, మనల్ని మన అద్దం లో చూపించారా!? లేదా తన అద్దంలో చూపిం చారా!?’ అనే సంశయం ప్రారంభమవుతుంది. ఏది కనిపించినా అది ఎవరికి వర్తిస్తే వారికి అలా సీనియర్ కవిగా గుర్తింపు పొందిన జూకంటి జగన్నా థం తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కూడా భలే గమ్మత్తుగా ఉంటాయి, బాగుం టాయి. ఈ మధ్య ఖమ్మం ఈస్థటిక్స్‌వారు ఉత్తమ కవిత్వ సంకలనంగా జూకంటి రాసిన ‘ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజ్ లు’కే ప్రకటించారు. ఈ సంకలనానికి అవార్డు ప్రకటించారని తెలియగానే తొలు త ఆశ్చర్యపోయాను. జూకంటి ఇప్పటి కవి కాదు. ఇంతకుముందు కూడా తన కవిత్వ సంపుటాలకు ‘ఇండియా ప్రైవేట్ లిమిటెడ్’ అని, ‘వాస్కో డిగామా డాట్‌కామ్’ అని సరికొత్త పేర్లు పెట్టారాయన. అంటే నేటి తరంతో నాటి జూకంటి అప్‌డేట్ అవుతు న్నారనిపించింది. ఊరికే పేరేనా లోపల విషయం ఉందా అని చూస్తే చాలానే ఉందనిపిస్తుంది. ఈ కప్పు చాయ్ పద్యం ‘వన్నెల వెన్నెలని చూడలేదు/ ఉదార హృదయాన్ని కనలేదు’ అంటూ ప్రారంభమై మధ్యలో ‘ఏమరుపాటుగా కుర్చీలో కూర్చుని/ ఒక కప్పు చాయ్ సిప్ చేస్తూ/ సెల్‌లో ఎంగిలి మెసేజ్‌లు చదువుతూ/ కొత్త ప్రపంచంలోకి ప్రవేశం/ కాకిలగ్గం డేటింగ్ చాటింగ్ చేస్తుంటాడు’ అంటారు. ఎంత గొప్పగా వెటకరించారు సెల్‌ఫోన్‌లే లోకంగా బతుకుతున్న నేటితరాన్ని. కవులే కాదు.. కవయిత్రులు కూడా తమ సంకలనాలకు సరికొత్త పేర్లు పెడుతూ పాఠకులకు చేరువవుతున్నారు. తోట సుభాషిణి ‘ఒకటి ఒకటి పదకొండు’, మందరపు హైమావతి ‘రాతిచెయ్యి’ కవిత్వ సంకలనాలు తీసుకొచ్చారు. తన కవిత్వ సంకల నాలకు ‘లోహనది’, ‘మరో దశ’ వంటి సీరియస్ పేర్లు పెట్టిన వసీరా మూడో సంకలనానికి మాత్రం ‘సెల్ఫీ’ అని నామకరణం చేశారు. ఇది తన మూడు దశాబ్దాల కవిత్వ ప్రయాణంలో తానే తీసుకున్న సెల్ఫీ. ఎప్పుడూ అచ్చమైన కవిత్వం రాసే పసునూరి శ్రీధర్‌బాబు ‘నిద్రపోని మెలకువ చెప్పిన కల’ అంటూ పొయెటిక్ సంకల్పం చెప్పుకొన్నారు తన కొత్త కవిత్వానికి. తెలుగు సాహిత్యంలో చాలామందికి గురుస్థానంలోకి వచ్చిన సీనియర్ కవి శివారెడ్డి అయితే పొసగనివన్నీ కలిపి ఓ కవిత్వ సంకలనం వేశారు. అది కూడా దశాబ్దంన్నర క్రితమే. అలాగే ‘పక్కకు వొత్తిగిల్లితే’ ఏం జరుగుతుందో కూడా శివారెడ్డే చెప్పారు. ఎనిమిది పదుల వయసులోకి వచ్చాక అసలు సిసలు ప్రేమని కనుగొని దానికి ‘%ాంవ ుశీ ాశీజవ% అను ప్రేమగీతం’ పాడారు. ఇంకా చాలామంది తమ కొత్త శీర్షికలు, కవిత్వ సంకలనాల పేర్లతో తెలుగు కవిత్వాన్ని వినిపిస్తున్నారు. ‘పేరులోన ఏముంది’ అన్నమాట కాదు నేడు వినిపిస్తున్నది.. ‘పేరులోనే అంతా ఉంది’ అన్నదే నేడు వినిపిస్తున్న కవిత్వం.

# ఆత్మ నివేదన

గత 127 వారాలుగా ‘కాశీమజిలీ కథలు’ అనుసృజనను ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలు. 1930వ దశకంలో 12 భాగాలుగా మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథల విశిష్టతను గురించి, ఈ అనుసృజనలో ఆ కథలను చెప్పేందుకు అనుసరించిన నిబంధనలను గురించి క్లుప్తంగా తెలియచేస్తూ.. ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం. తెలుగులో కాశీమజిలీ కథలకున్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. సంసార వ్యామోహాన్ని విడిచిపెట్టి సన్యాసం స్వీకరించిన మణిసిద్ధుడు అనే యతి.. కాశీయాత్ర చేయాలని నిశ్చయించుకుంటాడు. అయితే యాత్రలకు ఒంటరిగా వెళ్లరాదనే నియమాన్ని పురస్కరించుకుని, తనకు తోడుగా రమ్మని ఒక గోపాలకుణ్ని కోరుతాడు. కథలంటే మక్కువ కలిగిన ఆ గోపాలకుడు.. ‘దారిలో కనిపించే విశేషాలన్నిటినీ నాకు విడమరిచి చెబితేనే మీతో వస్తా!’ అని షరతు పెట్టాడు. మణిసిద్ధుని వద్ద ఒక అపురూపమైన మణి ఉంది. దాని సాయంతో దారిలో కనిపించిన ప్రతి విశేషాన్ని తెలుసుకుని, ఎప్పటికప్పుడు మణిసిద్ధుడు ఆ గోపాలకుడికి కథలు కథలుగా చెబుతాడు. అవే కాశీ మజిలీ కథలు. 1930వ దశకంలో మధిర సుబ్బన్న దీక్షిత కవి రచించిన కాశీమజిలీ కథలు తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించాయి. చిన్నా పెద్దా తేడాలేకుండా, పండిత పామరులనే భేదం లేకుండా.. ఒకప్పుడు తెలుగు వారందరూ కాశీమజిలీ కథలను ఆస్వాదించినవారే! పూర్తి జానపద శైలితో సాగినప్పటికీ, సామాన్యులకు అంతగా రుచించని వేదాంత, వ్యాకరణాది అంశాలను పరమార్థ బోధారూపంగా అందించిన అద్వితీయ రచన కాశీమజిలీ కథలు. మధిర సుబ్బన్న దీక్షితులు ఈ కథలను రచించేనాటికి తెలుగులో నవలలు లేవు. చిన్నవైనా, పెద్దవైనా కథలు మాత్రమే! కాశీమజిలీ కథల్లో 359 మజిలీలు ఉంటాయి. ఆ మజిలీలన్నిటిలో ‘కథ’ అనే పేరు కనిపిస్తుంది. లెక్కకు మిక్కిలిగా కథలుంటాయి. ఉదాహరణకు మొదటి సంపుటంలో వరప్రసాదుల కథ ఉంటుంది. ఇది అయిదుగురు స్నేహితుల కథ. ప్రధాన కథ ఇదే అయినప్పటికీ.. వేర్వేరు శీర్షికలకు కూడా కథ అనే పేరుతోనే పేర్కొన్నారు. ఈ అనుసృజనలో ప్రతిభాగానికీ వేర్వేరు శీర్షికలను ఉంచినప్పటికీ ప్రధాన కథ ప్రారంభాన్ని, ముగింపునీ తప్పనిసరిగా తెలియచేశాం. ఆవిధంగా చూస్తే ఇప్పటివరకు 28 కథలను మీరు చదివారు. ఇంకా మిగిలిన కథలేమయ్యాయి?! వాటిని ఎందుకు చెప్పలేదు!? అనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా స్మరించాల్సి ఉంది. కాశీమజిలీల్లో ప్రధాన కథ ఎప్పుడూ మణిసిద్ధుడనే యతి.. గోపాలకుడనే సహాయకుడికి బోధించినట్లుగా మొదలవుతుంది. కథలో చర్చించబోయే విషయాన్ని నాటకఫక్కీలో ముందుగా వారిద్దరి మాటల్లో చర్చించారు. అయితే ఈ అనుసృజనలో వారిద్దరి పాత్రలనూ పక్కన పెట్టినప్పటికీ అసలు స్మరించకుండా ఉండలేదు. ఇక, వరప్రసాదుల కథలోనే కృష్ణదేవరాయల వృత్తాంతం ఇమిడి ఉంటుంది. కృష్ణరాయని కథను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దిన రచయిత, అందులోనే తిమ్మరుసు కథ, గజపతులతో సంబంధం వగైరా కథలను హేతుబద్ధంగానూ, చరిత్రకు అందే విధంగానూ రచించారు. అయినప్పటికీ ఈ అనుసృజనలో చారిత్రక పురుషులపై వచ్చిన కథలను తప్పించడం జరిగింది. కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్న దీక్షితులు.. 1. జానపద ఇతివృత్తాలు, 2. చారిత్రక ఇతివృత్తాలు, 3. కావ్యకథలు, 4. పౌరాణిక కథలు అనే విభాగాల నుంచి స్వీకరించి రచించారు. ఇందులో ఇప్పటివరకు మనం జానపద ఇతివృత్తాలను మాత్రమే చదువుకున్నాం. కృష్ణరాయని కథతో పాటుగా.. జగన్నాథ పండితరాయలు, తెనాలి రామలింగడు వంటి చారిత్రక పురుషుల కథలను అప్పటి పండిత పామరులను రంజింపచేసే విధంగా సుబ్బన్న దీక్షితులు రచించారు. అవి ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి బాగుంటాయి. జనబాహుళ్యాన్ని కాస్త తికమక పెడతాయి. కనుకనే వాటిని విడిచిపెట్టడం జరిగింది. రెండో సంపుటంలో పూరీ జగన్నాథుని అవతార నేపథ్యానికి సంబంధించిన ఇంద్రద్యుమ్న మహారాజు వృత్తాంతాన్ని యధాతథంగా వర్ణించాం. 8వ సంపుటిలోని పౌరాణికమైన మదాలస కథను చెప్పాం. పురాణ పాత్రల నేపథ్యాలతో వచ్చిన మరికొన్ని కథలనూ చెప్పాం. విక్రమార్కుడు ఉట్టికోసిన కథ, భేతాళుని వశం చేసుకున్న కథ ఒక క్రమపద్ధతిలో లేవు. అవన్నీ ఇతరత్ర బహుళ ప్రాచుర్యంలో ఉన్నవే. కాశీమజిలీల్లోనివే అయిన విక్రమార్కుని మనుమని కథను చదువుకున్నాం. కానీ, అతను పాతాళానికి వెళ్లి విభీషణుడు మొదలైన రాక్షసులను కలుసుకోవడం వగైరా కథలను నేటితరం వారికి ఓ పట్టాన కొరుకుడు పడవు కనుక, విడిచిపెట్టాం. వీణావిద్వాంసుని కథ చాలా చిన్నదే కానీ, మజా కలిగించే కథ కాదు. నాలుగు కులాలకు చెందిన నలుగురు కన్యలు ఒకే వరుణ్ని వరించిన కథను కూడా ఈ శీర్షికలో చెప్పలేదు. 5వ సంపుటిలోని శంకరవిజయాన్ని ఈ అనుసృజనకారుడు గతంలో నవలగా రచించారు. కనుక ఇక్కడ మళ్లీ చెప్పలేదు. అలాగే అదే సంపుటిలోని కాదంబరి అనే కావ్యకథను కూడా విడిచిపెట్టాం. ఈ అనుసృజనలో మూలంలోని వర్ణనాసౌందర్యాన్ని చెడగొట్టలేదు. ఏ ముఖ్యవిషయాలు చెప్పడం ద్వారా పాఠకుల స్థాయి పెరిగేలా మూలకర్త వాటిని రచించారో.. వాటిని చెప్పకుండా వదిలి పెట్టలేదు. కాశీమజిలీ కథలకు రెండో మూడో సరళ అనువాదాలు వచ్చాయి. ఇందులోని అనేక కథలను విఠలాచార్య వంటివారు పలు సినిమాల్లో ఉపయోగించుకున్నారు. జగదేకవీరుని కథ, చిక్కడు దొరకడు.. వంటి హిట్ సినిమాలు కాశీమజిలీల్లోని ముఖ్యమైన థాట్‌ని ఉపయోగించుకుని చేసిన కథలే. కాశీమజిలీలను రూపొందించడంలో మధిర సుబ్బన్న దీక్షితకవి చూపించిన రచనా నైపుణ్యం అనితర సాధ్యం. అయినప్పటికీ ప్రతికథకూ ప్రాచీన సాహిత్యపు మూలాలు కూడా కొన్ని ఉన్నాయి. ప్రధానంగా కథాసరిత్సాగరం కనిపిస్తుంది. అలాగే సంస్కృత కావ్యాలలోని కథలను తనదైన భాషలోకి మలుచుకుని, గమ్మత్తయిన మలుపులతో మధిర సుబ్బన్న దీక్షితులు ఆరోజుల్లో ఆబాలగోపాలాన్ని అలరించారు. నేటికీ ఈ కథలు వీటికివే సాటి అని చెప్పుకోవాలి. ఈ అనుసృజనకు ఇది చివరి భాగం. కాశీమజిలీల్లోని తొలిభాగం మణిసిద్ధుడనే యతికి, గోపాలకుడికి మధ్య సంభాషణతో మొదలు అవుతుంది. 12వ సంపుటిలో కాశీమాహాత్మ్య గాథలుంటాయి. అవన్నీ మన పౌరాణికాలను పరమార్థ బోధారూపంగా చెప్పినవి. కాశీఖండం నుంచి స్వీకరించిన దివోదాసు కథ ప్రత్యేకంగా ఇందులో వర్ణించారు. ఈ కథ పద్మకల్పంలోని స్వాయంభువ మనువు కాలానికి చెందినది. అప్పట్లో అరవై ఏళ్లపాటు భూమిపై అనావృష్టి సంభవించింది. పాడిపంటలు నశించాయి. ప్రజలు విశూచి, మశూచి మొదలైన దారుణ రోగాలపాలయ్యారు. ప్రజలు కోటానుకోట్లుగా మరణిస్తుండగా, యమధర్మరాజు విసిగిపోసాగాడు. యజ్ఞయాగాదికాలు చెడ్డాయి. మానవులకు కలుగుతున్న అన్యాయానికి ఇంద్రాదులను నిలవేసి అడిగేవారే కరవయ్యారు. ఈ విశేషాలన్నీ నారదుడి వల్ల విన్న బ్రహ్మదేవుడు.. స్వాయంభువ మనువు వంశంలో పుట్టిన రిపుంజయుణ్ని ధరణీచక్రాన్ని పాలించవలసిందిగా నియమించాడు. రిపుంజయుని పేరును దివోదాసుగా మార్చాడు. అయితే దివోదాసు ఒక షరతు పెట్టాడు. “దేవతలకు స్వర్గం, నాగులకు పాతాళం ఉండగా.. వారు ఈ భూమిమీద ఎందుకు సంచరించాలి? వాళ్లు భూమి వదిలిపోవాలి. నేను కాశీని రాజధానిగా పాలిస్తాను.. కనుక శివుడు కూడా అక్కడినుంచి వెళ్లిపోవాలి” అన్నాడు. బ్రహ్మదేవుడు అతని కోరికను శివునికి విన్నవించగా.. “బ్రహ్మా! నీవు చేసిన నిర్ణయానికి కట్టుబడి.. నేను మందర పర్వతానికి వెళ్లిపోతాను. నేను తిరిగి వచ్చేదాకా ఈ ధరణీచక్రాన్ని దివోదాసుడే ఏలనీ” అన్నాడు. దివోదాసు అధికారం చేపట్టగానే నేలపై పాతాళవాసులను తరిమికొట్టాడు. తన బలంతో వర్షదేవతలను శాసించి వర్షాలు కురిపించాడు. దాంతో భూమి సస్యశ్యామలమైంది. నేలపై ధర్మం నాలుగు పాదాలతో నడవ సాగింది. కొంతకాలం జరిగిన పిమ్మట దివోదాసు రాజ్యంలో పుట్టలోని పామువల్ల పుత్రుణ్ని పోగొట్టుకున్న ఆటవికులు న్యాయంకోసం అతని వద్దకు వచ్చారు. వారికి ఆ పుత్రుణ్ని తిరిగి ఇచ్చే నిమిత్తం.. దివోదాసు కథంతా చిత్రవిచిత్రాలతో సుబ్బన్న దీక్షితులుగారి శైలిలో సుందరంగా సాగుతుంది. ఆ కథలో భాగంగా రసాతలం నుంచి నాగులు, యక్షులు మొదలైనవారంతా భూమిపై నివసించడానికి తగిన అనుమతిని దివోదాసు మంజూరు చేశాడు. కానీ, దేవతలను మాత్రం రానివ్వలేదు. కాశీని విడిచి ఉండటం ఇష్టంలేని దేవతలు బృహస్పతికి మొరపెట్టుకున్నారు. ఆయన సూచన మేరకు భూలోకంలో అగ్నిదేవుడు తన తత్త్వాన్ని ఉపసంహరించాడు. వాయువు స్తంభించాడు. వరుణుడు వర్షించడం మానేశాడు. దేవతల కపటం గ్రహించిన దివోదాసు, తన యోగవిద్యాబలంతో తానే సర్వదేవతామయునిగా మారిపోయాడు. రాజ్యాన్ని ఎప్పటిలా పాలించసాగాడు. కాశీనగరం శివుని నివాసభూమి. ఆయన కాశీవియోగాన్ని సహించలేక ముందుగా అరవైనాలుగు మంది యోగినీస్త్రీలను కాశీకి పంపాడు. వారు కాశీలో స్థిరపడిపోయారు. ఆలస్యం భరించలేక, శివుడు తరువాత సూర్యుడిని పిలిచాడు. “దివోదాసును ఏదోవిధంగా ధర్మవిముఖుడిని చేయి” అని కోరాడు. కానీ ఆ పని సూర్యుడివల్ల కూడా కాలేదు. అటుపై ఈశ్వరుని ఆజ్ఞపై బ్రహ్మ బ్రాహ్మణ వేషంలో కాశీకి వెళ్లి.. దశాశ్వమేధ యాగాలతో ఈశ్వరుడిని ప్రతిష్ఠించి.. గంగానదికి పడమటి తీరంలో ఉండసాగాడు. కానీ, కాశీని విడిచిపెట్టి వెనక్కు రాలేకపోయాడు. ఆ తరువాత ప్రమథులు కూడా వెళ్లి.. ఆ క్షేత్రంలోని అద్భుతానందాన్ని అనుభవిస్తూ అక్కడే ఉండిపోయారు. అప్పుడు డుంఠి భట్టారకుడై గణపతి వెళ్లాడు. అతడు కాశీవాసులకు అనేక దుశ్శకునాలు కల్పిస్తూ, వాటికి శాంతులు కూడా తెలియచేయసాగాడు. ఒకనాడు డుంఠి భట్టారకుని దర్శనానికి దివోదాసు వెళ్లాడు. “కాశీ ప్రజలకు ఉత్పాతాలు రావడానికి కారణం ఏమిటి?” అని ప్రశ్నించాడు. అప్పుడు భట్టారకుడు.. “ఇటుపైన ఇంకా ఉత్పాతాలు రావడానికి అవకాశముంది. వాటిని నేను ఉపశమింప చేయగలను. కానీ, నువ్వు ఇక్కడ ఉండటం మంచిదికాదు. నేటికి పద్దెనిమిదో రోజున నీకోసం ఒక బ్రాహ్మణుడు వస్తాడు. అతడు చెప్పినట్లుగా చేయి” అని సూచించాడు. ఆయన చెప్పినట్లుగానే ఆ పద్దెనిమిది రోజులలో చాలా వింతలు జరిగాయి. విష్ణువే లక్ష్మీ గరుడ సమేతంగా దిగివచ్చాడు. వాళ్ల బోధలతో అధర్మం పెచ్చుపెరిగి పోయింది. పద్దెనిమిదో రోజున మధుసూదనుడు బ్రాహ్మణ వేషంలో దివోదాసుని కలుసుకున్నాడు. అప్పుడు విఘ్నేశ్వరుడు రాజు హృదయాన్ని ఆవేశించి ఉన్నాడు. “ఇన్నాళ్లూ నా రాజ్యంలో అకాల మరణాలు, వ్యాధులు, దారిద్ర్యం, ముసలితనం లేవు. ఎందుకో అవన్నీ ఇప్పుడు కలుగుతున్నాయి. నేను దేవతలను తృణీకరించిన అపరాధం తప్ప మరే దోషమూ ఎరుగను. ఇదంతా దేవతలు కల్పించిన నాటకంలా కనిపిస్తున్నది. ఏదేమైనా నేను చాలాకాలం రాజ్యం చేశాను. నా ఇంద్రియాలు విశ్రాంతి కోరుతున్నాయి. నేను మోక్షం కోరుకుంటున్నాను. ఏం చేయాలో సెలవియ్యండి” అని కోరాడు దివోదాసుడు. ఆపైన మధుసూదనుడు చెప్పినట్లుగా, కాశీలో లింగప్రతిష్ఠ చేశాడు. తన కొడుక్కి పట్టాభిషేకం చేసి, దైవభక్తిని ఉపదేశించాడు. తాను తపోవనానికి వెళ్లిపోయాడు. దివోదాసు వారణాసి వదిలేసి వెళ్లాడన్న వార్త విష్ణువు ద్వారా తెలుసుకున్న ఈశ్వరుడు తిరిగి వచ్చాడు. ఆయనతోపాటు సర్వదేవతలూ కాశీ చేరుకున్నారు. ఆనాటినుంచి ఈ భూమండలాన్ని దేవతలే పాలిస్తారని విశ్వేశ్వరుడు ప్రకటించాడు. దివోదాసు కథ తరువాత, కాశీమజిలీ కథల్లోని 12వ సంపుటిలో.. పుండరీకుని కథను వర్ణించారు. ఈ కథ మనందరం ఎరిగిన పాండురంగ మహత్యాన్ని చాటే పుండరీకుని కథ కాదు. వైకుంఠ సభలో ఈశ్వరుడి చేత శపించబడిన ఇంద్ర, చంద్రులు.. పుండరీక, కుమారకేసరులుగా జన్మించారు. పార్వతీదేవి శాపం వల్ల అహల్య, తార పాతాళంలో ఉదయసుందరి, తారావళులుగా పుట్టి, భూలోకంలో అనేక కష్టాలు పడ్డారు. పుండరీక, కుమారకేసరులను పెళ్లాడారు. వాళ్లే తరువాతి జన్మలో గంధర్వలోకంలో హంసుడికి మహాశ్వేతగా, చిత్రరథుడికి కాదంబరిగా.. ఈశ్వరుడి వరం వల్ల జన్మించారు. ఇంద్రచంద్రుల మరో రూపాలైన చంద్రాపీడ, పుండరీకులని వివాహమాడి సంతానం పొందగానే వారి శాపం తొలగిపోయింది. చంద్రుడి భార్య అయిన రోహిణి కూడా అతణ్ని మూడు జన్మలలోనూ అనుసరించింది. కాశీమజిలీల్లో అటుపైన వైశ్వానర, నిర్ఋతి, వరుణుడు మొదలైన దిక్పతుల పూర్వగాథలు ఉంటాయి. చివరిగా మణిసిద్ధుడు, గోపాలుడు కాశీపుర ప్రవేశం చేసి, అక్కడే స్థిరపడడంతో పన్నెండో భాగం పరిసమాప్తమైంది.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 15 - 03 - 2025

# ట్రంపరితనం!

ప్రస్తుత ప్రపంచ నియమాల పట్ల తనకు గౌరవం బొత్తిగా లేదని డొనాల్డ్ ట్రంప్ నిర్లజ్జగా చాటి చెపుతున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని చర్చలకు పిలిచి అవి ఫలించకపోడంతో ప్రపంచ మీడియా ముందే అతడిని గెంటివేసిన ట్రంప్ తన అమానవీయతకు హద్దు లేదని స్పష్టం చేశారు. ట్రంప్‌ను నిర్భయంగా నీళ్లు నమలకుండా ఎదుర్కొన్న జకదేకవీరుడనే ఖ్యాతి జెలెన్ స్కీని వరించింది. ఇంకొకవైపు ట్రంప్‌కు దాసోహం చెప్పి వచ్చినట్టుగా ప్రధాని మోదీని ఇండియాలోని కొన్ని వర్గాలు ఖండిస్తున్నాయి.జో బైడెన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా పూర్తి అండదండలు ఇచ్చింది. అమెరికా, యూరప్‌లు జెలెన్ స్కీకి సైనిక ఆర్థిక సహాయాన్ని దండిగా అందించాయి. అది ఉక్రెయిన్ - రష్యా యుద్ధంగా కాకుండా రష్యా - అమెరికా కూటమి మధ్య సమరంగా సాగింది. ఇందులో ఉక్రెయిన్ అప్పుడప్పుడూ అక్కడక్కడా కొద్ది విజయాలు సాధించినప్పటికీ మొత్తం మీద రష్యాదే పైచేయి అయింది. ఆంక్షలు రష్యాను ఏమీ చేయలేకపోయాయి. దీనితో ట్రంప్ యుద్ధానికి తెరదించాలని నిర్ణయించాడు. 2022 ఫిబ్రవరిలో మొదలైన ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్లు దాటి కొనసాగుతూ వచ్చింది. యుద్ధం వల్ల ఆహారం, ఇంధనం తదితరాల ధరలు పెరిగిపోయి మానవాళి తీవ్ర అశాంతికి గురి అవుతున్నది. అందుచేత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన యుద్ధవిరమణ ఘట్టాన్ని స్వహస్తాలతో ఆవిష్కరిస్తున్నాడనే ఖ్యాతి ట్రంప్ ఖాతాలో చేరుతున్నది. ఆయన ఉక్రెయిన్ యుద్ధం నుంచి అమెరికా సేనలను ఉపసంహరించారు. రష్యాపై ఆంక్షల ఉపసంహరణకు చర్యలు చేపట్టారు.ఒకవైపు యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగిస్తామంటూనే అమెరికా మద్దతు లేకపోతే అభాసుపాలు అవుతామని యూరపు దేశాలూ గ్రహించాయి. అవి సొంత రక్షణ బడ్జెట్లను పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. జెలెన్ స్కీతో కలిసి శాంతి ఒప్పందం ముసాయిదాను సిద్ధం చేసి అమెరికా ముందు ఉంచాలని భావిస్తున్నాయి. అయితే ఆ ప్రతిపాదనను ట్రంప్ గాని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గాని అంగీకరిస్తారా? జెలెన్ స్కీ తాము కోల్పోయిన భూభాగాలను తిరిగి తమకు అప్పగించాలని కోరుతాడు. అంతే కాదు, భవిష్యత్తులో ఉక్రెయిన్ భద్రతకు అమెరికా, యూరప్‌లు హామీ ఇవ్వాలని కూడా జెలెన్ స్కీ అర్థిస్తున్నాడు, నాటోలో సభ్యత్వమూ కావాలంటున్నాడు. అందుకు ట్రంప్ నిరాకరించాడు. అందుచేత అది అయ్యే పని కాదు. ఉక్రెయిన్‌కి సభ్యత్వం ఇచ్చి నాటో తన గుమ్మం వద్ద తిష్ట వేసుకోవడం నచ్చకనే పుతిన్ యుద్ధాన్ని మొదలుపెట్టాడు. తాము ఆక్రమించుకున్న 20శాతం ఉక్రెయిన్ భూభాగంలో అరంగుళమైనా ఇచ్చేది లేదని పుతిన్ తెగేసి చెపుతాడు. పుతిన్ తన మాట కాదనడనే ధీమాలో ట్రంప్ ఉన్నాడు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తాజాగా శాంతి చర్చల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నట్టు, భవిష్యత్తులో అమెరికా మద్దతు కోసం అవసరమైన ఒప్పందంపై సంతకం చేయదలచినట్టు తనకు లేఖ రాశాడని ట్రంప్ తాజాగా పార్లమెంటులో ప్రకటించాడు.ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించడానికి ట్రంప్ సిద్ధం చేసుకున్న శాంతి వ్యూహంలో రెండు భాగాలున్నాయి. ఉక్రెయిన్‌లోని అత్యంత అరుదైన ఖనిజాలను తవ్వి తీసుకుపోవడానికి జెలెన్ స్కీ సమ్మతి తీసుకుంటూ ఒప్పందాన్ని కుదుర్చుకోడం అందులో ఒకటి. తాను ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగాల్లోని విలువైన ఖనిజాలను తవ్వి తీయడానికి కూడా అమెరికాను అనుమతిస్తానని పుతిన్ ప్రకటించాడు. ప్రపంచంలో అత్యంత అరుదైన ఖనిజాల్లో 5 శాతం మేరకు ఉక్రెయిన్‌లోనే ఉన్నాయి. ఎలక్ట్రిక్ కార్లు తదితర విద్యుత్ వాహనాల బ్యాటరీల్లో ఉపయోగించే గ్రాఫైట్ నిల్వలు 19 మిలియన్ టన్నుల వరకు ఉన్నాయి. ఇవి భారీగా ఉన్న అయిదు దేశాల్లో ఉక్రెయిన్ ఒకటి. విమానాలు, విద్యుత్ కేంద్రాల వంటి నిర్మాణాల్లో ఉపయోగించే టైటానియంబీ బ్యాటరీల తయారీలో కీలక ముడిసరకు లిథియంబీ అణు ఆయుధాలు, రియాక్టర్లలో ఉపయోగించే బెరిల్లియం, యురేనియం నిక్షేపాలు ఉక్రెయిన్‌లో ఉన్నాయి. అణ్వాయుధాలు, విండ్ టర్బైన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర ఆధునిక సాధనాల్లో ఉపయోగించే 17 అపురూప ఖనిజాల నిల్వలు అక్కడ ఉన్నాయి. ఈ ఖనిజాల సంపదలో 75 శాతంతో చైనా ప్రపంచాధిపత్యాన్ని వహించి ఉంది. దానిని దెబ్బతీయడం కోసం ఉక్రెయిన్‌పై ట్రంప్ కన్నేశాడు. వాస్తవానికి రష్యాను జయించడానికి ఉక్రెయిన్‌ను అడ్డం పెట్టుకుని అమెరికా, యూరప్‌లు జెలెన్ స్కీకి సైన్యాన్ని, ఆయుధాలను సరఫరా చేశాయి. వాటిని అప్పుగా ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ట్రంప్ దాన్ని అప్పు ఖాతాగా రాసి ఉక్రెయిన్ ఖనిజాలను దోచుకోదలచుకున్నట్టు అర్థమవుతున్నది.ట్రంప్ హయాంలో అమెరికా ప్రపంచ ప్రజాస్వామ్య గురువు పాత్ర నుంచి తప్పుకుంటున్నదా అన్నది నేటి కీలక ప్రశ్న. అంతర్జాతీయంగా కరడుగట్టిన సామ్రాజ్యవాదిగా, నియంతగా ఉన్నప్పటికీ దేశీయంగా ప్రజాస్వామ్య మర్యాదలు పాటిస్తూ వచ్చిన అమెరికా ఇప్పుడు దానిని కూడా వదులుకుంటున్నది. అక్రమ వలసల పేరుతో విదేశీయులను తరిమేయడం, కనీసావసర ఖర్చుల కోసం క్యాంపస్ బైట చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూ వచ్చిన విదేశీ విద్యార్థులకు ఆ సౌకర్యాన్ని సైతం తొలగించడం ట్రంప్ అమెరికా దిగజారుడుతనాన్ని చాటుతున్నది. ట్రంప్‌ను ఎన్నుకున్న మెజారిటీ ఓటర్లు అమెరికా తన ధనాన్ని అంతర్జాతీయ కర్తవ్యాల కింద దుర్వినియోగం చేస్తున్నదనే ట్రంప్ ప్రచారాన్ని నమ్మి ఆయనకు ఓట్లు వేశారు. ట్రంప్ ఆధిపత్యం తాత్కాలికమే కావచ్చు, అమెరికన్ ఓటర్లలోని తిరోగమన ధోరణి ఒకంతట పోయేది కాదు.డాలర్ ద్వారా కాకుండా సొంత కరెన్సీలతో విదేశీ వాణిజ్య లావాదేవీలు జరిపితే చూస్తూ ఊరుకోబోమని బ్రిక్స్ (బ్రెజిల్, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాలను ట్రంప్ బెదిరించాడు. అంటే బలప్రయోగంతో డాలర్ ఆధిపత్యాన్ని కొనసాగింపజేయాలన్నది ట్రంప్ ఆంతర్యంగా బోధపడుతున్నది. ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు కేవలం 45 బిలియన్ డాలర్లే. ఈ మాత్రం భాగ్యానికి ఇండియా టారిఫ్‌లు దారుణమైనవని ట్రంప్ భూతద్దంలో చూపిస్తున్నాడు. చైనాతో దానికున్న వాణిజ్య లోటు 300 బిలియన్ డాలర్లు. అమెరికా మొత్తం వాణిజ్య లోటు 1.2 ట్రిలియన్ డాలర్లు. చైనాతో అమెరికాకు గల లోటు అందులో నాలుగో వంతు. ట్రంప్ తన ప్రతీకార సుంకాల విధానంతో ఈ అగ్రరాజ్య మర్యాదను మంచితనాన్ని బూడిదపాలు చేస్తున్నాడు. ట్రంప్‌ను సంతృప్తిపరచడానికి ఇండియా కొన్ని రాయితీలను ప్రకటించింది. ట్రంప్ ఒకవైపు అమెరికాను ప్రపంచ దేశాలకు అగ్రరాజ్యం అన్న బాధ్యత నుంచి తప్పించదలిచాడు. అదే సమయంలో తన సుంకాల బీభత్సానికి దేశ దేశాలు తల వంచేలా చేయదలిచాడు. ట్రంప్ సుంకాలు, వాటికి ప్రతీకార సుంకాలు ధరలను విపరీతంగా పెంచివేస్తాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్, పారిస్ వాతావరణ ఒప్పందం వంటి సంస్థల నుంచి అమెరికా మళ్ళీ ఉపసంహరించుకుంటున్నది. అమెరికా భాగస్వామిగా ఉన్న అన్ని అంతర్జాతీయ సంస్థలపై ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ట్రంప్ ఆదేశించాడు. కలిసి నడవడం కంటే, ప్రపంచ చుక్కానిగా ఉండడం కంటే జాతీయ ప్రయోజనాలే ప్రధానంగా అడుగులు వేయాలని ట్రంప్ అమెరికా ఆశిస్తున్నది. పాలస్తీనా మీద అమానుష అనైతిక నిప్పుల వర్షం కురిపిస్తూ నిరాయుధులైన అమాయక జనాన్ని ఊచకోత కోస్తున్న ఇజ్రాయెల్‌ను ఎవరైనా వెనకేసుకుని రాగలరా? అటువంటి ఇజ్రాయెల్‌కు వ్యతిరేక వైఖరి తీసుకున్నందుకు, "తన దృష్టిలో" మానవ హక్కులను ఉల్లంఘిస్తున్న దేశాలైన చైనా, వెనెజులా, క్యూబా, సౌదీ అరేబియాలను చేర్చుకున్నందుకు, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్ నుంచి అమెరికా తప్పుకున్నట్టు బోధపడుతున్నది. ట్రంప్ మొదటి పాలన సందర్భంగా 2018లో మొదటిసారి, ఇప్పుడు రెండోసారి ఈ కమిషన్ నుంచి అమెరికా వైదొలగింది. ప్రపంచంలో మానవహక్కుల పరిరక్షణ తన దృష్టి కోణం నుంచి జరగాలని ట్రంప్ కోరుతున్నాడు! స్త్రీ బాల వృద్ధులనే విచక్షణ లేకుండా దాదాపు ఏభై వేలమంది గాజా వాసులను హతమార్చడం ఆయన దృష్టిలో మానవ హక్కుల ఉల్లంఘన కాదు.ఇంతవరకూ అంతర్జాతీయ సహాయ కార్యక్రమాలకు తమ వంతు వాటా ఇస్తూనే అప్రతిహత ఆధిపత్యాన్ని చలాయించిన అమెరికా ఇప్పుడు దేనికీ పైసా ఇవ్వకుండా రౌడీయిజాన్ని ప్రదర్శించబోతున్నది. తనకున్న అపారమైన సైనిక శక్తితో నియంతృత్వాన్ని అమలు చేయదలచింది. ఇది ట్రంపరితనం! ఐక్యరాజ్య సమితి, ఆరోగ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి అమెరికా తప్పుకున్న మేర దాని స్థానాన్ని చైనా వంటి దేశాలు నెమ్మదిగా భర్తీ చేసే అవకాశాలు లేకపోలేదు. ట్రంప్ దూకుడుకు అడ్డుకట్ట వేయలేక, ఆయనను ఎదిరించనూ లేక ప్రధాని మోదీ అభాసుపాలవుతున్నారు. ట్రంప్‌తో ఇలాగే కలిసి నడిస్తే అంతర్జాతీయంగా మనం మరింత చులకన అయిపోతాము.

# పాక్‌లో ఉగ్రదాడి



ఉగ్రవాద భూతాన్ని పెంచి పోషించి, ఎగుమతి చేసిన దేశంగా పాకిస్థాన్ అపఖ్యాతి మూటగట్టుకున్నది. ఇప్పుడు అదే ఉగ్రవాదం కోరల్లో చిక్కుకొని పాకిస్థాన్ విలవిలలాడుతున్నది. బలూచ్ వేర్పాటువాదులు ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసి పాక్ పాలకులకు భారీ సవాల్ విసిరారు. సాయుధ బలగాల దాడిలో ఉగ్రవాదులు హతులైనప్పటికీ పెద్ద సంఖ్యలో అమాయకులైన బందీలు మరణించడం బాధాకరం. 30 గంటలపాటు జరిగిన హోరాహోరీ పోరు తర్వాత 300 మందికి పైగా ప్రయాణికులను విడిపించినట్టు పాక్ సైనిక ప్రతినిధి వెల్లడించారు. అనేకమంది ప్రయాణికులు అమరులైనట్టు బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టీ ప్రకటించారు. చనిపోయిన ప్రయాణికుల్లో సెలవుపై వెళ్తున్న సైనికులు ఎక్కువమంది ఉండటం గమనార్హం.పాకిస్థాన్ నైరుతి ప్రాంతంలో ఉండే బలూచిస్థాన్ పాక్‌లోని అతిపెద్ద రాష్ట్రం. అతి తక్కువ జనాభా ఉండే ఆ రాష్ట్రం కొండలు గుట్టలతో దుర్గమంగా ఉంటుంది. అయితే ఖనిజ వనరులు మాత్రం అక్కడ విస్తారంగా ఉన్నాయి. చాగీ జిల్లాలో రెండుచోట్ల బంగారు, రాగి నిల్వలు దండిగా ఉన్నాయి. సుసంపన్నమైన తమ వనరులపై పాక్ ప్రభుత్వం పెత్తనాన్ని సహించని బలూచీలు మొదటి నుంచీ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు. దేశ విభజన సమయంలో పాక్ నాయకత్వం, ముఖ్యంగా దేశ వ్యవస్థాపకుడు ముహమ్మద్ అలీ జిన్నా స్వాతంత్ర్యాన్ని ఎంచుకున్న బలూచీల మెడలు వంచి మరీ విలీనం చేసుకున్నది. తమ వనరులపై పెత్తనం సాగిస్తున్న పాక్ ప్రభుత్వం తమ అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే భావన బలూచీల్లో బలంగా ఉన్నది. 1970 దశకంలో పాక్ నుంచి బంగ్లాదేశ్ విడివడటంతో బలూచీల్లో వేర్పాటువాదం మరింత బలంగా వేళ్లూనుకున్నది. అందులో నుంచే బీఎల్ఏ, బీఎల్ఎఫ్ (బలూచ్ లిబరేషన్ ఫ్రంట్) వంటి సాయుధ సంస్థలు ఆవిర్భవించాయి. రెండు దశాబ్దాలుగా ఉగ్రదాడులతో విరుచుకుపడుతున్నాయి. పాక్ సైన్యాన్ని, పౌరులను అవి హతమారుస్తున్నాయి. పాక్.. చైనాతో చేతులు కలిపి తమ వనరులను తరలించుకుపోతున్నారని, అం దులో తమకు ఎలాంటి లబ్ధి కలుగడం లేదని బలూచీలు విమర్శిస్తుంటారు.చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టులో భాగంగా బలూచిస్థాన్‌లో పలు ఓడరేవులు, రోడ్డు మార్గాలు, ఇతర మౌలిక నిర్మాణాలకు భారీగా నిధులు సమకూర్చింది. ఇవి చైనాకు సరుకుల రాకపోకలను సులభతరం చేసేందుకు చేపట్టినవేననేది తెలిసిందే. ఈ కారణంగానే ఖనిజాల అన్వేషణ, సేకరణ వంటి వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం వచ్చే చైనా పౌరుల పైనా బీఎల్ఏ దాడులకు తెగబడుతున్నది. తరచుగా రైళ్లను లక్ష్యం చేసుకోవడం బీఎల్ఏ ప్రత్యేకత. పొరుగున ఉన్న ఇరాన్‌లోనూ కొంత బలూచీ ప్రాంతం ఉన్నది. అక్కడ కూడా అప్పుడప్పుడూ వేర్పాటువాద దాడులు జరుగుతుంటాయి. బలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం ఇవ్వడమంటే పాకిస్థాన్‌కు ఆత్మహత్యా సదృశ్యమే. ఎందుకంటే విశాలమైన భూభాగంతో పాటుగా వనరులపై ఆధిపత్యం అది కోల్పోవాల్సి ఉంటుంది. కనీసం ప్రజాభీష్టం మేరకు స్వయంప్రతిపత్తి కల్పించి బలూచీలకు తమ వనరులకు తామే యజమానులమన్న భావన ఏర్పడటానికి వీలు కల్పించాలి. అప్పుడే బలూచ్ సమస్యకు తెరపడుతుందని పాక్ గుర్తించాలి.


# సుక్కల పూట



మా ఊరికి సీతాపతి సెరువుంది. మాకది కన్నతల్లి. నాలుగు చినుకులు నేలరాలినా సెరువు నిండుతుంది. నాలుగు కొండల మీద పన్ని చినుకులన్నీ దొర్లుకుంటూ సెరువులోకి వస్తాయి. అంత వాటం, పల్లం ఉంది. దిక్కుల ఊర్లలో మా సెరువు జూసి మీరు పున్నెం చేసినారు అందుకే ఎంత కరువు పెట్టినా సీతాపతి సెరువులో చిప్పడు నీల్లయినా ఉంటాయి అంటారు. మాకు సెరువుకింద ఇరవై కుంటల మడుంది. దాంట్లో వరిపైరు ఏసినాము. వాన్లు సరిగ్గా పడకపోవడంతో సెరువులో నీల్లు సాలక పూట్లు నిర్నయిస్తావుండారు. ఈ సారన్నా పంటొస్తే తిండి గింజలకు బయముండదు.నేను ఇంట్లో పనులు చేసుకుంటా ఉండా. నాకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. కాలేజీ సదువులు సదువుతున్నారు. ఆడబిడ్లు ఇద్దరూ నీళ్ల వొగరు తెస్తూ, పాత్రలు వొగరు కడుగుతూ నాకు ఎదరప చేస్తూ ఉన్నారు. ఈ మగపిల్లాడు మాత్రం ఇటు ఉన్ని పుల్ల అట్లేయడు. ఇమ్ముదప్పి పోయి దప్పికి నీల్లు ఈరా అంటేకూడా ఈడు. రేయ్ ఇంట్లో చిన్న చిన్న పనులు చేయరా అంటే ఊర్లో మగపిల్లలు ఎవరూ చేయరు నేను పని చేస్తే నన్ను ఆడోడు అంటారు పోమ్మా అనేసి ఎలిపోతాడు.రేపు నిన్ను చేసుకునేది ఏం తీరుబాకు తీర్సినారు అని తిడుతుంది అని చెప్పినా ఇనేవాడు కాదు. జత పిల్లల్ని ఎంటేసుకొని బైరేగను ఎలిపోతాడు. ఆకిలయినప్పుడు మాత్రమే ఇంటి మింద జోలి. జతలు మరిగి చెడుదావ పట్టినావురా అని నేను రోజూ తిట్టేదే. లత్త గవ్వలు అన్ని ఒక దరికి చేరినట్టు ఈ మగనాబట్టలు అందరూ ఒకటే. నూటికి నూరు జెప్పిన ఆడబిడ్డలే మేలు.మా ఇంట్లో మేము తల్లి కూతుర్లు అన్ని పనులు చేసి వండి పెడితే అన్నం యాలకి తినేదానికి వచ్చిరి నాయన, కొడుకు. నేను నా మొగుడ్ని అడిగితి "బండమీదకి పోతివే ఏమయ్యా" అని."సెరువు కింద సాగు చేసే వాళ్లందర్నీ పిలిపించిరి. పూట్ల ప్రకారం మడికి నీల్లు పార గట్టుకోమన్రి. మొదటి పూట మీ ఈరమామది. తొలిత మొలుస్తుంది చూడు జాముసుక్క అబుడు. వరసగా మూడు సుక్కలుంటాయి అవి గుడిసి నాట్లు .అవి మొలిసే టబుడు మా యంగటన్నది పూట. మధ్యలో వొగ పెద్ద సుక్క దాని చుట్టూ చిన్న చిన్న సుక్కలు దానే పిల్లల కోడి అంటారు. పిల్లలకోడి మొలిసినప్పుడు మీ నాగన్నది పూట. మూలసుక్క మొలిసినప్పుడు మనది పూట. ఈ సుక్క పరమట మూలయాసగా పుడుతుంది. గుడ్డిసుక్క మొలిసినప్పుడు మా సీనన్నది పూట. కాంతి సుక్క అన్ని సుక్కల కంటే కాంతిగా ఉంటుంది. ఇది కూడా పరమటనే మొలుస్తుంది. ఈ సుక్క తెల్లారి ఆరు దాక కనబడుతుంది ఇది మొలిస్తే ఆ పూట గోపన్నది" అని విసిదంగా చెప్పే పిల్లలు కూడా ఇంటున్నారని.నేను ఉండు కోని "కాదే అందరి పూట్లు పొద్దుకు అట్లాఇట్లా ఉంటే నీ పూట మాత్రం సరిగ్గా రాయినీరు కరిగే పొద్దుకి, సరిగ్గా కోడి పిల్లలకు పాలు తాపేటైంకి ఉంది, యాలగానియాల వొగనివే పోవల్ల నీపూట మార్చమనకూడదా" అంటి."ఆ యాల కాడ పోతేనే మన పని బచ్చా పడేది. నిద్రకు తట్టుకోలేక ఒక అడుగు ఎనుకు ముందు వస్తారు. ఆయాల దాకా నీల్లు మనమే కట్టుకోవచ్చు. అదీగాక మన మడి పట్టకర్రతో ఉంది. పొట్లుపగిలి ఎన్ను ఇడస్తా ఉంది. ఎన్ను ఇడిసి కాయి వాలే టబుడు నీల్లు తగ్గ దీస్తే వడ్లు జల్లులు పడతాయి. పట్టకర్రతో ఉన్న మడి ఎక్కువ నీల్లు తాగుతుందంట. అయినా వాన కార్తులు ముందుండాయి కదా అనే ధైర్యంతో మడి నాటితిమి. అయి మల్లీ మోసం జేసె" అని నామొగుడు గొనుక్కుండే.నా కూతురు ఉండుకోని "నాయనా వాన కార్తులు ఎన్ని" అని అడగే వాల్ల నాయన్ని."వాన కార్తుల్లో వాన పడితేనే మనకు, గొడ్డు గోదకు తిండుండేది. ఎండకాలం పాతనే తొలిత వచ్చేది భరణి కార్తీ. ఈ కార్తిలో బర్ని పక్షులు మాండ్లల్లో గూక్ గూక్‌మని కూస్తుంటాయి. ఈ కార్తీలో సింత పూత ఎక్కువ పూస్తుంది. ఈ కార్తిలో వరి నార్లు పోస్తే ఒడ్లు సింత పూలు రాలినట్లు రాలుతాయంటారు. అంటే పంట బాగా పండుతుంది" అని వాల్ల నాయన సెబతాఉండాడు.సింత పూత అంటేనే మా యవ్వ గెవనానికొచ్చే. మేము చిన్న బిడ్డలప్పుడు మా ఇంట్లో సుమారు పది మంది జనం ఉండేది. ఆ కాలాన కూటికి జరిగేది కష్టం. ఏడేళ్లు కరువు. గవర్నమెంటోల్లు గెంజి పోస్తా ఉండారు. మా యమ్మకి అమ్మ మాయవ్వ ఉండే. ఇప్పుడు విఆర్వో సెక్రటరీ మాద్రి అప్పుడు గ్రామానికి అంతా రెడ్డి ఉండేది. వాళ్లను గామిస్ రెడ్డి అనేది. రెడ్డి ఇంటి కాడ గంజి పోస్తరంట అని చాటింపు యేసేవాల్లు అబుడు. మా యవ్వ ఎనకాలే చెంబెత్తు కొని పోయేది. ఆ రెడ్డి ఇంటికాడ క్యూలో నిలబడితే వాల్లు అన్నమంతా దేవేసి వొట్టి గంజి బోసేది. ఆడా మోసమే. పోసినామని పేరు గవర్నమెంట్ లెక్క చెప్పుకునే దానికి. దాన్ని ఇడిస్తే గతి లేదని మైలు దూరం నడిచి పోయేది. అట్లా గెంజి తాగి గూడా పానాలు కాపాడుకున్నాము. అట్లాంటి కరువులో మాయవ్వ ఆ గంజి నీల్లలో వొట్టి రాగిపిండి బోసి సంగటి గెలికేది. అప్పుడు సింతపూల కాలం. ఆ సింతపూలన్నీ రాల్సు కోనొచ్చి అవన్నీ చాటలో పోసి చెరిగితే పూలు కిందపడి మొగ్గలు మిగులుతాయి. వాటికి మా యవ్వ మిరక్కాయలు, ధనియాలు, తెల్లగడ్డ, ఎర్రగడ్డ, మెంతి, జిలకర, కాసింత బీము ఏసి ఏయించి నూరి ఈ సింత మొగ్గలు పోసి తెర్లిచ్చేది. ఆ వొట్టి పిండిసంగటికి ఈ సారు కలిపి తింటే ఏముండేదిలే. మా యవ్వ ఇట్లాంటి కరువు సార్లు బలే జేసేది."ఈ కార్తి పాతనే రోహిణి కార్తి. అది వచ్చి పోయేది కూడా ఎవురికి తెలియదు. మూడోది మగశిల కార్తి. ఈ కార్తీలోవానలు బాగా పడడంతో కొన్ని ఊటు సేన్లల్లో సద్దలు సామలు చల్ల తారు నాలుగవది ఆరుద్దల కార్తి. ఈ కార్తి లో వరి నాటేది. ఎర్రమసూర నెంబరొడ్లు, బై రొడ్లు, బుడ్డడ్లు, గంగసానొడ్లు, రాజేంద్ర, తెల్లంస, అయ్యేటి లాంటి రకాలు పోస్తారు. ఐదవ కార్తి పెద్దపుచ్చిల కార్తి. ఇత్తనాలన్నీ భూమిలో పడిపోతాయి. ఆరవది చిన్నపుచ్చిల కార్తి. ఏడవది ఉత్తర కార్తి. ఎనిమిదవది హస్త కార్తి. తొమ్మిదవది చిత్తకార్తి. ఈ కార్తిలో పైన పొటపొట మనిచినుకులు రాలుతుంటే చేన్లలో ఉలవలు జల్లుతారు. పుట్టగొడుగులు యాడ చూసిన లేస్తాయి. కుక్కలు కట్టుబోతుతనానికి వచ్చి కొట్లాడుకుంటా ఒక ఆడ కుక్క చుట్టూ పది కుక్కలు చేరి కొట్లాడుకుంటా అరస్తా ఉంటాయి. కోరిక తీరని కుక్కలు ఆకాసం కల్లా ఎగచూసుకొని ఏడుస్తాయి. పదవుది సాతి కార్తి. ప్రతి ఒక పంట ఈ కార్తీలో ఎన్ని బోతాయి.సాబ్బండ కింద ఉన్న గడ్డి కూడా ఎన్ను బోతుందంటారు. తర్వాతొచ్చేది ఇసారాక్ కార్తి. ఈ కార్తిలో జంతువులకి మనుషులకి పంటలకి రోగాలొస్తాయి. నానితే దగ్గులు జ్వరాలు పట్టుకుంటాయి. పన్నెండోది అనారాక్ కార్తి. ఈ కార్తిలో అన్ని రోగాలు పోతాయంటారు. నానితే కూడా మంచిదంటారు. పదమూడోది మూలకార్తి. ఈ కార్తిలో కూడా వానలు బాగా పడి చెరువులు నిండుతాయి. పదనాల్గోది దెస్ట కార్తి. వానలు ఎక్కువపడి మూలాలు ముంచి ఎక్కువ దెస్టలు చేరుస్తుంది. పదైదవది సంక్రాంతి గర్భాలు. అప్పుడు కూడా వానలు పడతాయి ఈడికి కార్తులన్ని ఆకీరు.చిన్న పుచ్చుల కార్తీలో వాన పల్లే. ఇది తప్పితే పెద్ద పుచ్చుల కార్తీలో అన్న వానపడుతుంది అనుకుంటిమి అది పాయ. మగసిలకార్తిలో దాన్ని మగమేలేదు. అన్నారాక్ కార్తి అనుకోకుండా బోయే. పెద్దలు అనేది ఈ కార్తులన్నీ మోసంచేసి ఇంక ఈ ఊర్లో మనం బతకలేము అనీ గుడ్డ గుసురు, బోకి బాలి అన్ని గంపకు పెట్టుకొని సుట్టగుడ్డ నెత్తిన పెట్టి ఉత్తరం చూసి ఎత్తర గంప అంటే అప్పుడు ఉత్తరం చూస్తే అస్తం చూపించి నేను వస్తా ఉండ యాడికి పోవద్దండి అని అభయమిచ్చి దంట అస్త కార్తీ. నేనుఉన్నాను అని కుమ్మ వర్షం కురిసిందంట. అయినా మన ఎర్రి కాకపోతే ఈ కాలం యాడ కార్తీలో వాన కురస్తా ఉండేది, ఆకాశం తొక్కు ఎగచూసి ఎగ చూసి మెల్లు నొస్తా ఉండాయి. చినుకు నేల రాలాలంటే గగనం అయిపోతా ఉంది. ఇగ నెల దినాలు కాపాన్నామంటే చేతికొచ్చిన పంట నోటికొస్తుంది లేదంటే ఎండిపోతుంది. అదిగాక ఈసారి చెరువు కింద సాగుబడి ఎక్కువైపోయింది. మునుపు నీల్లతో చెరువు మొరవ కాడకి తునికేసేది. ఇప్పుడు తూము కాడికి ముగుసుకున్నాయి. సాగు ఎక్కువైంది, నీకు ఎక్కువ నీల్లు పాయ నాకు తక్కువ నీల్లు పాయ అని కొట్లాడుకుంటుంటే పూట్లు పెట్టినారు. మన పూట మూల సుక్క మొలిసి నప్పుడు వస్తుంది. నేను ఆదమరిస్తే కూడా నువ్వు గెవనంలో ఉండి లేపు అనే నాతో మా ఇంటాయన. నేను ఉండుకొని "కాదే మన మడి దిగువన ఉండేది. మనకు కాలవ సాగోచ్చే కుందికి గంట పడుతుంది. ముందుగా మన మడికి వదలమన కూడదా" అంటే దానికి నా మొగుడు "నీకు దోడుమైంది వొగతి పెల్లి పీట్ల మింద నుండి పిర్రగిచ్చిందంట. మనం వారగా పదాం మనం వారగా పదాం అని. ఎందుకు అని మొగుడు అడిగితే నేనువొగటి ఎత్తిపెట్టినాను అన్నంట. వాడు ఇంగ సంబరంగా నా పెండ్లాము ఏందో విలువైందే ఎత్తి పెట్టుంటుంది అని ఇంట్లో వాళ్ళ అమ్మ నాయన మీద రంపు జేసి వారగా బాయినంట. ఇబుడు నువ్వెత్తి పెట్టి ఉండేది ఎత్తకరాబో అంటే అది దినము సంగటి చేసేటప్పుడు ఎవరికి తెలియకుండా దినానికి వొగ సంగటి ముద్ద వాడకు ఏసి పెట్టిందంట. ఆ వాడ మూత కింద పెరికినంట. ఆ వాడ బొక్కలోనుంచి సంగటి, కుల్లి పోయి నీల్లై కారతా ఉందంట. మొగుడు అది చూసి ఇదేనా నువ్వు దాసిపెట్టింది, నీ మాటలిని ఎక్కడా కాకుండా పోతినే అని నెత్తిన గుడ్డ ఏసుకున్నంట. అట్లదానివి నువ్వు. పైనుండి పార కట్టుకుంటా రానీలే ఒకేల నీల్లు అయిపోయిన ఎగవ నుండి దిగువకు వచ్చే నీల్లు మల్లలోపడతాయి. యగవన నీరు నిలేసినా ఆ ఎడగాలవ నీల్ల తోనే మడి పారుతుంది. మనకే మేలు" అనే నా మొగుడు. నేను "కాదే మూల సుక్క మొలీసేటబ్బుడు పన్నెండు ఒంటిగంట అవుతుంది నేనుగూడా వస్తా నీతో" అంటి. "నువ్వు నా ఎనికిటి వస్తే బిడ్డలు ఒకరే అయిపోరా నాకేం భయం లేదు నేను బోతాలే" అనే!నేను ఇంట్లో అన్నం కూర చేస్తా ఉండా. నా బిడ్డలు పొగులంతా ఎండనకా గాలనకా పిల్లల జతన ఏగులాడి ఏగులాడి పొద్దట్ల మస్కులు పడతానే నిద్రకు తట్టుకోలేక తూగత బెట్టకన్ను ఏస్తా ఉండారు. నేను బిడ్డలు యాడ నిద్రపోతరో అని బిరిబిరి సంగటి గెలికి ముద్దలు జేసి సింతసారు చేసి గిన్నెల్లో పెట్టి రేయ్ తినేసి నిద్రపోండి అని వాళ్ళను ఎచ్చరిచ్చ. అందరం సంగటి పెట్టుకొని తింటా ఉండాము. ఈ పిల్లలు కారానికి కారాలు ఆరస్తా నోరు మంటకి వుసీట్లు కొడతా ఉండారు. పొగులంతా నిలుకు లేకుండా చెరుకులు తిని తిని వీల్లకి నోర్లు మంటలు. ఏ పక్క చూసినా చెరుకు తోటలే. మేమందరం తిని చేలు కడిగి అట్లా కుసున్నాము.అప్పుడు జాముసుక్క మొలిసింది. మా వీరమామ భుజాన కమిడి ఏసుకొని చేతిలో దొన్నికట్టి పట్టుకొని తల మగసాల్లోకి వచ్చి "ఒరేయ్ సీనా, జాముసుక్క మొలిసింది సెరువు కిందకి నేను పోతా ఉండా. నువ్వు రా" అనేసి పాయ. తూర్పున మెడకాయ ఎత్తి చూస్తే మూడు నచ్చత్రాలు వరుసగా కనిపించాయి. అవే గుడిసెనాట్లు. అవి కనపడతానే వెంకటన్న సెరువు కాడికి పొతా "ఒరేయ్ గుడిసినాట్లు మొలిసినయ్ నేను పోతా ఉండా" అనేసిపాయ. ఆయాలకే నా మొగుడు తూగేసినాడు. నేను మేలుకొనే ఉండా. కాస్సేపటికి మైమరచి తూగతుండగా మా నాగన్న వచ్చి తలుపు తట్టే. "ఒరేయ్ శీనా పిల్లల కోడి మొలిసింది, నేను పోతా ఉండా" అనేసి పాయ. పిల్లల కోడి మొలిసిన తరవాత మూల సుక్కే. నేను మేలుకొని కండ్లు పులుముకుంటూ ఆకాశం తొక్కు ఎగ చూసుకోనుండా. మూల సుక్క కనపడతానే నా మొగున్ని లేపి పంపిస్తి.ఇంగన్న కాంచేడి నిద్ర పోదాంలే అని తలుపు గట్టిగా ఏసి పనుకుంటే గుడ్డి సుక్క మొలిసినప్పుడు మా అన్న వచ్చి లేపే. కాంతి సుక్క మొలిసినపుడు మళ్లీ లేపిరి. అబుటికే కోడి గూసె! తెల్లారి పాయ! నా మొగునితోపాటు నాకూ జాగారమాయె! నా మొగుడు ఇంటికి వచ్చి పనుకుండే. నేను మాత్రానికి ఇంట్లో పనులు జేసుకుంటుండా. ఆడది వొల్లు బాగ లేనప్పుడు తప్ప తెల్లారిందాకా పనుకుంటే అది సంసారానికి పనికి రాదు అంటారు. మడి పండి గింజలు ఇల్లు చేరే దాకా నాకు నిద్ర కరువే!

# గ్లకోమా కంటిని దొంగ దెబ్బ తీస్తుంది

పైకేమీ తెలియకుండా లోలోపలే చూపును దోచేస్తుంది. పోయిన చూపు తిరిగిరాదు. ఉన్నదాన్ని కాపాడుకోవటం తప్పించి చేయగలిగిందేమీ లేదు.నీటికాసుల సమస్య (గ్లకోమా) కంటిని దొంగ దెబ్బ తీస్తుంది. పైకేమీ తెలియకుండా లోలోపలే చూపును దోచేస్తుంది. పోయిన చూపు తిరిగిరాదు. ఉన్నదాన్ని కాపాడుకోవటం తప్పించి చేయగలిగిందేమీ లేదు. అలాగని పూర్తిగా నిరాశ పడాల్సిన పనిలేదు. క్రమం తప్పని కంటి పరీక్షలతో దొంగను ముందే పట్టుకోవచ్చు. మరింత చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చు. మార్చుకోదగిన కారకాలను సవరించుకుంటే, జాగ్రత్త పడితే నివారించుకోవచ్చు కూడా. ప్రపంచ గ్లకోమా వారం సూచిస్తున్నదీ ఇదే. 'సీ ద ఫ్యూచర్ క్లియర్లీ' అంటూ అవగాహన పెంచుకొని, భవిష్యత్తును ముందుగానే చూడమని బోధిస్తోంది.కన్ను నిర్మాణం, పనితీరు అత్యద్భుతమైంది. కంట్లోకి వచ్చే కాంతి ముందుగా కటకం, కార్నియా నుంచి ప్రయాణించి, ఆ వెనకాల రెటీనా మీద పడుతుంది. ఇది దృశ్యనాడి ద్వారా మెదడుకు చేరుకొని, ఆయా దృశ్యాలు కనిపిస్తాయి. కటకం, కార్నియా పారదర్శకంగా ఉంటేనే వాటిలోంచి కాంతి ప్రయాణించగలదు. అందుకే వాటికి రక్తం సరఫరా కాదు. మరి వీటికి పోషకాలు ఎలా లభిస్తాయి? ఇందుకు స్వచ్ఛమైన ద్రవం (అక్వియస్ హ్యూమర్) తోడ్పడుతుంది. ఇది కటకం, కార్నియాకు పోషకాలు అందించటమే కాదు.. కన్ను ఒకే విధమైన ఒత్తిడి స్థితిలో తేలి ఉండేలా చేస్తుంది కూడా. ఈ ద్రవం నిరంతరం ఉత్పత్తి అవుతుంటుంది. అదే సమయంలో కంటికి ఒక మూల నుంచి ప్రత్యేకమైన మార్గాల ద్వారా బయటకు పోతుంది. ఎంత ద్రవం ఉత్పత్తి అయితే అంత బయటకు పోయినంతవరకూ ఇబ్బందేమీ ఉండదు. కానీ ఈ మార్గాల్లో అడ్డంకి ఏర్పడినా, అవి మూసుకుపోయినా ద్రవం సరిగా బయటకు వెళ్లదు. అది లోపలే పోగు పడుతూ వస్తుంది. దీంతో కంట్లో ఒత్తిడి పెరుగుతుంది. ఇది దృశ్యనాడి మీదా ప్రభావం చూపుతుంది. క్రమంగా దృశ్యనాడి నొక్కుకు పోయి, చూపు దెబ్బతింటుంది. నీటికాసులంటే ఇదే. కొన్ని జన్యు సమస్యల కారణంగా శిశువుల్లో, చిన్న పిల్లల్లో ఈ మార్గాలు ఏర్పడకపోవచ్చు. వీరికి పుట్టుకతోనే గ్లకోమా ఉండొచ్చు లేదా చిన్నతనంలో తలెత్తొచ్చు.



**లక్షణాలేవీ ఉండవు**

గ్లకోమాలో నొప్పి, ఎరుపు వంటి ఇబ్బందులేవీ ఉండవు. అసలు జబ్బు ఉందన్న సంగతే తెలియదు. కానీ లోలోపలే చూపు తగ్గటం మొదలవుతుంది. చుట్టుపక్కల నుంచి చూపు తగ్గుతూ రావటం దీని ప్రత్యేకత. ఆఖరికి మధ్య చూపు పోతుంది. చుట్టుపక్కల చూపు కొద్దిగా తగ్గినా తేడా ఏమీ తెలియదు. తీవ్రమవుతున్నకొద్దీ పక్క వైపు దృశ్యాలు కనిపించక ఇబ్బంది పడతారు. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు గోడలకు తాకటం, ఎత్తు పల్లాలను గుర్తించలేకపోవటం, మెట్లు ఎక్కటానికి ఇబ్బంది పడటం, కింద పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది ఇలాంటి స్థితిలోనే ఏదో సమస్య ఉందని డాక్టర్‌ను సంప్రదిస్తుంటారు. అప్పటివరకూ అసౌకర్యంగా అనిపించినా పెద్దగా పట్టించుకోరు. కాంతి ఎక్కువగా ఉండేలా చూసుకోవటం వంటి వాటితో నెట్టుకొస్తుంటారు. సమస్యను గుర్తించేసరికే 90 శాతం చూపు దెబ్బతిని ఉండటం విషాదకరం. చదివే వయసులో చూపు తగ్గితే చేయగలిగిందేమీ లేదు. చికిత్సలతో చూపు మరింత దెబ్బతినకుండా చూడటం తప్పించి పోయిన చూపును తిరిగి రప్పించలేం. ఇది చదువులు, కెరీర్ మీద విపరీత ప్రభావం చూపుతుందని గ్రహించాలి.

**ఎవరికి? ఎందుకు?**

గ్లకోమా ఎవరికైనా రావొచ్చు. కాకపోతే వయసు మీద పడుతున్నకొద్దీ ముప్పు పెరుగుతుంది. సాధారణంగా 40 ఏళ్లు పైబడ్డవారిలో ఎక్కువ. వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వల్ల ఇప్పుడిది ఎక్కువగానూ కనిపిస్తోంది. అయితే చిన్న వయసులో రాకూడదనేమీ లేదు. కొందరికి పుట్టినప్పుడే గ్లకోమా ఉండొచ్చు. ఒకట్రెండు ఏళ్ల వయసులోనూ రావొచ్చు. ఇందుకు రకరకాల కారణాలు దోహదం చేస్తాయి.జన్యు స్వభావం: కొందరికి వంశపారంపర్యంగా రావొచ్చు. వంశపారంపర్య జబ్బుల విషయంలో అతి ఎక్కువగా వచ్చే సమస్యల్లో రెండోది గ్లకోమానే. రక్త సంబంధికుల్లో ఎవరికైనా గ్లకోమా ఉంటే దీని ముప్పు 10 రెట్లు ఎక్కువవుతుంది.

**మధుమేహం:** రక్తంలో గ్లూకోజు నియంత్రణలో లేనివారికి కళ్లలో కొత్త రక్తనాళాలు పుట్టుకొచ్చి, లోపల రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఈ రక్తనాళాలు కంట్లోంచి ద్రవాలను బయటకు తెచ్చే మార్గాలనూ మూసేయొచ్చు. కేవలం 24 గంటల్లోనే మార్గాలు మూసుకోవచ్చు. హ్రస్వదృష్టి (మయోపియా): హ్రస్వదృష్టి, గ్లకోమాతో ముడిపడిన జన్యువులకు దగ్గరి సంబంధముంటుంది. మరోవైపు హ్రస్వదృష్టిలో కనుగుడ్డు పెద్దగా అవుతుంది కూడా. దీంతో కంట్లో అసాధారణ మార్పులు తలెత్తి, మార్గం మూసుకోవచ్చు. హ్రస్వదృష్టి గలవారికి గ్లకోమా వచ్చే స్వభావమూ ఉన్నట్టయితే ముప్పు మరింత పెరుగుతుంది.

**స్టిరాయిడ్లు:** వీటి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. స్టిరాయిడ్లతో కూడిన సౌందర్య క్రీములను ముఖానికి రాసుకోవటం ఇప్పుడు శాపంగా మారుతోంది. వీటిల్లో స్టిరాయిడ్లు ఉంటున్నాయనే సమాచారాన్నీ ముద్రించటం లేదు. నీటికాసులు వచ్చే స్వభావం గలవారికివి చాలా హాని చేస్తాయి. ప్రత్యేకించి మనదగ్గర మరింత విపరీత ప్రభావం చూపుతుండటం గమనార్హం. క్రీముల ద్వారా కంట్లోకి వెళ్లిన స్టిరాయిడ్లు ద్రవం బయటకు వచ్చే మార్గాన్ని మూసేస్తాయి. అప్పుడు 3-4 వారాల్లోనే కంట్లో ఒత్తిడి విపరీతంగా పెరగొచ్చు. దీన్ని చాలామంది గుర్తించలేరు, అనుమానించలేరు. ఏదో చూపు కాస్త మందగించిందని భావిస్తుంటారు గానీ నీటికాసులని తెలుసుకోలేరు. కంట్లో స్టిరాయిడ్ చుక్కల మందులు, స్టిరాయిడ్ మాత్రలూ కొందరికి ముప్పు తెచ్చిపెట్టొచ్చు.

**గాయాలు:** కళ్లకు దెబ్బలు తగలటం వల్ల గ్లకోమా వచ్చే అవకాశం ఎక్కువవుతుంది. వాటర్ బుల్లెట్స్, గన్స్ వంటి ఆట వస్తువులతో ఎంతోమంది పిల్లలు కంటి గాయాల పాలవుతుండటం చూస్తున్నాం. ఇది పెద్ద సమస్య. కళ్లకు దెబ్బ తగిలినా, చూపు సరిగా కనిపించకపోయినా తల్లిదండ్రులు తిడతారేమోననే భయంతో పిల్లలు పైకి చెప్పరు. ఇది సమస్య ఇంకాస్త ముదరటానికి దారితీస్తోంది.గ్లకోమాను ప్రధానంగా రెండు రకాలుగా చెప్పుకోవాలి. 1. ఓపెన్ యాంగిల్ రకం. ఇందులో మార్గం పూర్తిగా మూసుకుపోదు గానీ ద్రవం సరిగా బయటకు వెళ్లదు. ఇది నెమ్మదిగా ముదురుతూ వస్తుంది. లక్షణాలేవీ ఉండవు. దృశ్యనాడి బాగా దెబ్బతినే వరకూ చూపు తగ్గిన విషయమే తెలియదు. 2. యాంగిల్ క్లోజర్ రకం. ఇందులో మార్గం దాదాపు పూర్తిగా మూసుకుపోతుంది. కొన్నిసార్లు ఇది హఠాత్తుగానూ మూసుకుపోవచ్చు. అప్పుడు తీవ్రమైన తలనొప్పి, కంటి నొప్పి, వాంతి, వికారం, చూపు మసకబారటం, కళ్లు ఎరుపెక్కటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ రకం గ్లకోమాకు లేజర్‌తో, తర్వాత మందులతో చికిత్స చేస్తారు.

**శిశువుల్లో భిన్నం**

పుట్టుకతోనే గ్లకోమా ఉన్నట్టయితే పిల్లల్లో నల్లగుడ్డు కాస్త నీలంగానో, తెల్లగానో ఉంటుంది. కనుగుడ్లు చాలా పెద్దగా ఉంటాయి కూడా. ఆసుపత్రిలో కాన్పు అయితే చిన్న పిల్లల డాక్టర్ చూసి, గుర్తించగలుగుతారు. కానీ ఇళ్లలో లేదా వైద్య నిపుణులు అందుబాటులో లేని చోట కాన్పు అయితే తెలుసుకోలేక పోవచ్చు. పుట్టుకతో వచ్చే గ్లకోమాకు నెల లోపే ఆపరేషన్ చేసి, మార్గాన్ని సరిచేయటానికి వీలుంటుంది. మామూలు పిల్లల్లాగానే పెరుగుతారు. చాలామంది బిడ్డ పెరిగిన తర్వాత చూద్దాంలే. అదే కుదురుకుంటుందిలే అని ఆలస్యం చేస్తుంటారు. ఇది ప్రమాదం.

**చికిత్స: మందులే ప్రధానం**

గ్లకోమా చికిత్సలో ప్రధానమైంది కంట్లో ఒత్తిడిని తగ్గించటం. ఇందుకు ద్రవం ఉత్పత్తిని తగ్గించేవి, ద్రవం తేలికగా కంట్లోంచి బయటకు వెళ్లేలా చేసే చుక్కల మందులు ఉపయోగ పడతాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకుంటే గ్లకోమా తలెత్తకుండా కాపాడుకోవచ్చు. జబ్బున్నా ముదరకుండా చూసుకోవచ్చు. ద్రవం బయటకు వెళ్లే మార్గం మూసుకుపోతే లేజర్ చికిత్సతో తిరిగి తెరవొచ్చు. అయితే కొందరికి మార్గం పూర్తిగా తెరచుకోకపోవచ్చు. వీళ్లు మందులను కొనసాగించాల్సి ఉంటుంది. దాదాపు 80-90% మందికి ఈ మందులు, లేజర్ చికిత్సతోనే సమస్య నియంత్రణలో ఉంటుంది. కాకపోతే ఎంత త్వరగా చికిత్స తీసుకుంటే అంత మంచిది. నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా చూపు పోవచ్చు. దీన్ని తిరిగి తేవటం అసాధ్యం.

**శస్త్రచికిత్స:** మందులతో ఫలితం లేకపోయినా, మందులు పడకపోయినా, మందులు వాడుకోలేని స్థితిలో ఉన్నా శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఇందులో కంట్లోంచి ద్రవం బయటకు పోవటానికి మరో మార్గాన్ని సృష్టిస్తారు. మరీ చిన్న పిల్లల్లోనైతే శస్త్రచికిత్సే ప్రధానం. వీరిలో ద్రవాలు బయటకు పోయే మార్గాలు ఏర్పడకపోవచ్చు. కొత్త మార్గాన్ని ఏర్పాటు చేస్తే సమస్య కుదురు కుంటుంది.

**కొవిడ్ నేర్పిన పాఠం**

నీటికాసుల శస్త్రచికిత్స చేశాక రెండు వారాల్లో కనీసం నాలుగు సార్లయినా ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. కొవిడ్ సమయంలో ఇది కుదిరేది కాదు. సమయానికి ఆసుపత్రికి రాలేకపోయినా కళ్లు దెబ్బతినకుండా చూడటం సమస్యగా మారింది. దీన్ని పరిష్కరించటానికి మూసుకున్న మార్గంలో స్టెంట్ అమర్చే పద్ధతి మొదలైంది. సాధారణంగా కంట్లోంచి ద్రవాన్ని బయటకు పంపే శస్త్రచికిత్సలో మూసుకున్న నాళం పక్క నుంచి కొత్త మార్గాన్ని (బైపాస్) ఏర్పాటు చేస్తారు. ఇప్పటికీ సమస్య మరీ తీవ్రంగా, క్లిష్టంగా ఉంటే దీన్నే చేస్తున్నారు. కానీ మామూలు, ఒకమాదిరి నీటికాసులకు స్టెంట్ పద్ధతి బాగా ఉపయోగపడుతున్నట్టు అనుభవాలు చెబుతున్నాయి. దీంతో త్వరగా కోలుకోవటం సాధ్యమవుతుంది. అంత ఎక్కువగా ఆసుపత్రికి రావాల్సిన అవసరముండదు. బైపాస్ సర్జరీతో పోలిస్తే దుష్ప్రభావాలూ తక్కువే. ఇప్పుడు దీన్ని విస్తృతంగానూ చేస్తున్నారు.

**జన్యు పరీక్షతో ముందే గుర్తింపు**

మూడేళ్ల నుంచి నలభై ఏళ్ల వయసులో (జువైనల్) వచ్చే గ్లకోమా చాలా తీవ్రంగా ఉంటుంది. ఇందులో కంట్లో ఒత్తిడి చాలా తీవ్రంగా ఉంటుంది. దీన్ని గుర్తించలేకపోతే నెలల్లోనే పూర్తిగా చూపు పోయే ప్రమాదమూ ఉంది. సమస్యేంటంటే- ఇది ఎవరికి వస్తుంది? ఏ వయసులో వస్తుందనేది ఏమాత్రం తెలియకపోవటం. దీని విషయంలో జన్యు పరీక్ష కొత్త ఆశలు కలిగిస్తోంది. ఇది చాలావరకూ వంశపారం పర్యంగా వస్తుంది కాబట్టి ఇంట్లో ఎవరికైనా గ్లకోమా వచ్చినట్టయితే కుటుంబంలో మిగతా సభ్యులతా జన్యు పరీక్ష చేయించుకోవచ్చు. ఒకప్పుడిది మనదేశంలో అందుబాటులో ఉండేది కాదు. ఇప్పుడు చాలా ల్యాబ్‌ల్లో చేస్తున్నారు. ఖర్చూ తగ్గింది. జన్యు పరీక్షలో ఎంవైఓసీ జన్యుమార్పు కనిపిస్తే గ్లకోమా ముప్పు ఎక్కువగా ఉందనే అర్థం. చిన్న పిల్లల్లో జన్యు మార్పు ఉంటే నిశితంగా గమనిస్తూ, క్రమం తప్పకుండా పరీక్షలు చేయటం ద్వారా గ్లకోమాను వీలైనంత ముందుగా పట్టుకోవచ్చు. జన్యుమార్పు లేకపోతే నిశ్చింతగా ఉండొచ్చు. ఎలాంటి రకం పరీక్ష అవసరం? ఫలితాలను ఎలా అంచనా వేయాలనేది జన్యు కౌన్సెలర్లు సూచిస్తారు. దాన్ని బట్టి డాక్టర్లు అవసరమైన చికిత్స చేస్తారు. తల్లికి లేదా తండ్రికి, వారి పెద్ద పిల్లలకు గ్లకోమా ఉంటే పుట్టబోయే బిడ్డకు వచ్చే అవకాశాన్ని గుర్తించటమూ సాధ్యమవుతోంది. గర్భం ధరించిన మూడు నెలల్లోపే జన్యు పరీక్ష చేయొచ్చు. జన్యు మార్పు ఉన్నట్టయితే బిడ్డను కనాలో, వద్దో నిర్ణయించుకోవటానికీ వీలుంటుంది. కొన్నిసార్లు తల్లిదండ్రులకు గ్లకోమా లేకపోయినా వారి నుంచి బిడ్డలకు వచ్చే అవకాశముండొచ్చు. ఇలాంటివారు కృత్రిమ గర్భధారణ పద్ధతితో ఆరోగ్యవంతమైన బిడ్డను కనటానికీ వీలుంది. అండం ఫలదీకరణ చెందిన తర్వాత జన్యుపరీక్ష చేసి, జన్యుమార్పులు లేని పిండాన్ని తల్లి కడుపులో ప్రవేశపెట్టొచ్చు. కాకపోతే దీనికి ఎక్కువ ఖర్చు అవుతుంది.

**నివారించుకోవచ్చా?**

నీటికాసుల నివారణ కష్టమనే చెప్పుకోవచ్చు. కానీ తొలిదశలోనే గుర్తిస్తే ముదరకుండా చూసుకోవచ్చు. చూపు పోకుండా కాపాడుకోవచ్చు. ఇందుకు క్రమం తప్పకుండా కంటి పరీక్ష చేయించుకోవటం మేలు చేస్తుంది. రక్త సంబంధీకుల్లో ఎవరికైనా గ్లకోమా ఉన్నట్టయితే 30, 40 ఏళ్లు దాటాక ఏటా కంటి పరీక్ష చేయించుకోవటం మంచిది.చత్వారం వంటి సమస్యలు గలవారు అద్దాలతో సరిపెట్టుకోకుండా కంట్లో ఒత్తిడి, దృశ్యనాడిని క్షుణ్నంగా పరిశీలించే సమగ్ర కంటి పరీక్ష కూడా చేయించుకోవాలి. కంట్లో ఒత్తిడి ఎక్కువగా గలవారు చుక్కల మందును క్రమం తప్పకుండా వేసుకోవాలి. గ్లకోమా నిర్ధరణ అయినవారూ చుక్కల మందు మానరాదు.కంటికి గాయాలు కాకుండా చూసుకోవాలి. ఒకవేళ కంటికి దెబ్బలు తగిలి, కంట్లో రక్తస్రావమైనవారైతే ఒకట్రెండు సంవత్సరాలకోసారి కంటి పరీక్ష చేయించుకోవాలి. పిల్లల కళ్లకు దెబ్బ తగిలినట్టు గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. జన్యు కౌన్సెలింగ్, పరీక్షలతో పుట్టబోయే పిల్లలకు రాకుండా చూసుకోవచ్చు. వచ్చిన తర్వాతా ముందే గుర్తిస్తే త్వరగా ముదరకుండా చూసుకోవచ్చు. మధుమేహం వంటి సమస్యల్లో మార్గాలు మూసుకోవటాన్ని ముందే గుర్తిస్తే కొన్ని ఇంజెక్షన్లు, లేజర్‌తో రక్తనాళాలను తొలగించొచ్చు. అనంతరం మందులు లేదా శస్త్రచికిత్సతో చూపు దెబ్బతినకుండా కాపాడొచ్చు.సౌందర్య క్రీములు, ఏదైనా సమస్యకు స్టిరాయిడ్ కంటి చుక్కల మందులు, ఆస్థమా కోసం స్టిరాయిడ్ మందులను పీల్చేవారు చూపులో ఏమాత్రం తేడా కనిపించినా తాత్సారం చేయరాదు. ఏ సమస్య కోసమైనా స్టిరాయిడ్ చుక్కల మందులను ఒకట్రెండు వారాలు లేదా డాక్టర్ చెప్పినంత కాలమే వాడుకోవాలి. అనవసరంగా ఎక్కువకాలం వాడితే చూపు పోయే ప్రమాదముంది. ఇలాంటి అంధత్వాన్ని పూర్తిగా నివారించుకోవచ్చు.

# మోకాలి నొప్పికి ముక్కు సాయం!



మోకాలి నొప్పులు తగ్గటానికి ముక్కు తోడ్పడితే మోకాలికీ ముక్కుకూ ముడిపెట్టటమంటే ఇదేనని పెదవి విరవకండి.యూనివర్సిటీ ఆఫ్ బేసల్, యూనివర్సిటీ హాస్పిటల్ బేసల్ పరిశోధకులు నిజంగా అలాంటి ఘనతే సాధించారు. ముక్కుదూలం కణాలతో మృదులాస్థిని వృద్ధి చేసి, కీళ్లలో అమర్చే విధానాన్ని రూపొందించారు!మోకాలి కీళ్లు ఒరుసుకుపోకుండా, సాఫీగా కదలటానికి తోడ్పడే మృదులాస్థి దెబ్బతినటం పెద్ద సమస్య. ఇది మిగతా కణజాలాల్లా దానంతటది కుదురుకోదు. అందుకే దీర్ఘకాలం మోకాలి నొప్పులు వేధిస్తుంటాయి. వీటి నుంచి బయటపడటానికి బేసల్ యూనివర్సిటీ పరిశోధకుల వినూత్న ప్రయత్నం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఇందులో రోగి ముక్కులోని మృదులాస్థి నుంచి కొంత నమూనాని తీస్తారు. దీని కణాలను ప్రయోగశాలలో వృద్ధి చేసి, వాటిని మృదువైన పీచుతో కూడిన చట్రంలో కూర్చుతారు. అప్పుడవి కొత్త మృదులాస్థి కణజాలంగా వృద్ధి చెందుతాయి. ఇది అవసరమైనంత సైజు, ఆకారానికి చేరుకున్నాక దెబ్బతిన్న మోకాలి కీలులో అమరుస్తారు. దీంతో నొప్పులు తగ్గి, రోజువారీ పనులు చేసుకోవటానికి వీలవుతుంది. వీటిని నాలుగు దేశాలకు చెందిన 98 మంది మీద పరీక్షించి చూశారు కూడా. కొందరికి రెండు రోజులు, మరికొందరికి రెండు వారాల పాటు వృద్ధి చెందిన మృదులాస్థిని అమర్చారు. ఇవి రెండూ మంచి ఫలితాన్నే కనబర్చాయి. కాకపోతే ఎక్కువకాలం వృద్ధి చెందిన మృదులాస్థితో రెండో సంవత్సరంలోనూ ప్రయోజనాలు కొనసాగాయి. దీన్ని అమర్చిన చోటే కాకుండా చుట్టుపక్కల మృదులాస్థి సైతం మెరుగవుతుండటం గొప్ప విషయం.

# ఆయుష్షుకు పొగ!



అంతేకాదు, ఆయుష్షునూ తగ్గిస్తుంది. కాల్చే ఒక్కో సిగరెట్టుతో సగటున 20 నిమిషాల జీవనకాలం తగ్గుతున్నట్టు యూనివర్సిటీ కాలేజ్ లండన్ అధ్యయనంలో తేలింది. లింగ పరంగా చూస్తే- మగవారిలో 17 నిమిషాలు, ఆడవారిలో 22 నిమిషాల ఆయుష్షు తగ్గుతున్నట్టు బయటపడింది. మొత్తమ్మీద పురుషులు 10 ఏళ్లు, ఆడవారు 11 ఏళ్లు జీవనకాలాన్ని కోల్పోతున్నారు. పొగ తాగే అలవాటు రకరకాల రూపాల్లో ఆయుష్షు మీద ప్రభావం చూపుతుంది. కానీ ఎంత త్వరగా మానితే అంత ఎక్కువ కాలం జీవించే అవకాశముండటం గమనార్హం. ఉదాహరణకు- రోజుకు 10 సిగరెట్లు కాల్చేవారు ఈరోజు మానేస్తే వారం తిరిగే సరికల్లా ఒక రోజు ఆయుష్షు పెరుగుతుంది. అదే ఏడాది వరకైతే 50 రోజుల ఆయుష్షు పొడిగించుకోవచ్చు. పొగ అలవాటు ఆయుష్షును తగ్గించడమే కాకుండా మధ్య వయసులో ఆరోగ్యాన్నీ గణనీయంగా దెబ్బతీస్తుంది. ఉదాహరణకు 50 ఏళ్ల వయసువారి ఆరోగ్యం 60 ఏళ్ల వయసువారిలో మాదిరిగా ఉంటుంది. అయితే పొగ అనర్థాలు అందరిలో ఒకేలా ఉండాలనేమీ లేదు. ఈ అలవాటు గల కొందరు ఇతరులతో పోలిస్తే ఎక్కువకాలం జీవించొచ్చు, ఆరోగ్యంగానూ ఉండొచ్చు. ఇది ఎన్ని సార్లు, ఎంత గాఢంగా పొగ పీలుస్తున్నారు అనే ధోరణులు.. సిగరెట్ పొగ రకాలు, పొగలోని విషతుల్యాలు ఆయా వ్యక్తుల మీద చూపే ప్రభావం వంటి వాటి మీద ఆధారపడి ఉంటుంది.



# పచ్చబొట్లతో క్యాన్సర్!

పచ్చబొట్టు పొడిపించుకుంటున్నారా? మరోసారి ఆలోచించుకోండి. దీంతో క్యాన్సర్ ముప్పు 33% నుంచి 62% వరకూ ఎక్కువగా ఉంటున్నట్టు డెన్మార్క్ పరిశోధకులు కవలల మీద నిర్వహించిన అధ్యయనంలో బయటపడింది. పెద్ద పచ్చబొట్లతో ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటున్నట్టూ వెల్లడైంది. అరచేతి కన్నా పెద్ద సైజు పచ్చబొట్లతో చర్మ క్యాన్సర్ ముప్పు రెండు రెట్లు ఎక్కువగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అదే లింఫ్ గ్రంథులకు వచ్చే క్యాన్సర్ (లింఫోమా) ముప్పు దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుండటం గమనార్హం. చర్మంలోకి చొచ్చుకెళ్లే పచ్చబొట్టు సిరా రేణువులు లోపలికి వెళ్లిపోవచ్చు, ఇవి లింఫ్ గ్రంథుల్లో పోగు పడొచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఈ అధ్యయనంలో జన్యు, పర్యావరణ పరంగా ఒకేలాంటి అంశాలను పంచుకునే కవలలను ఎంచుకొని పరిశీలించారు. వీరిలో కొన్ని జంటల్లో ఒకరికి క్యాన్సర్ వచ్చినవారూ ఉన్నారు.పచ్చబొట్టు పొడిపించుకోని కవలతో పోలిస్తే పొడిపించుకున్న కవలకు చర్మ, లింఫ్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. ఎంత పెద్దగా, ఎంత ముందుగా పొడిపించుకుంటే అంత అధికంగా లింఫ్ గ్రంథుల్లో సిరా పోగుపడుతున్నట్టు తేలింది. శరీరం వీటిని తమకు సంబంధించినవి కావని భావిస్తుండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంటే రోగనిరోధక వ్యవస్థ పచ్చబొట్టు సిరా మీద నిరంతరం దాడి చేయటానికి ప్రయత్నిస్తుందన్నమాట. ఈ సిరా లింఫ్ గ్రంథుల పనితీరును బలహీనం చేస్తుందో లేదో, ఇతర జబ్బులకు దారితీస్తుందో లేదో ఇంకా తెలియదు. అందుకే సిరా రేణువులు లింఫ్ గ్రంథుల మీద ఎలా ప్రభావం చూపుతున్నాయో అర్థం చేసుకోవటానికి పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. పచ్చబొట్టులోని కొన్ని వర్ణద్రవ్యాలు అంత ఆరోగ్యకరం కావని గత అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ తాజా పరిశోధనలో ఆయా సిరల రంగు, క్యాన్సర్ల మధ్య స్పష్టమైన సంబంధమేదీ కనిపించలేదు.

# పండుటాకులు పదిలం!

రోజురోజుకీ ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధుల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం చాలా ముఖ్యం. వయో వృద్ధుల్లో చెమట అంతగా ఉత్పత్తి కాదు. శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే సామర్థ్యమూ తగ్గుతుంది. ఫలితంగా వేడి సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువ. అందువల్ల వృద్ధులను కాపాడుకోవటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తగినంత నీరు: వేడి సమస్యల నివారణలో ఒంట్లో నీటిశాతం తగ్గకుండా చూసుకోవటం కీలకం. కాబట్టి వృద్ధులను రోజంతా తగినంత నీరు తాగేలా ప్రోత్సహించాలి. దాహం వేయకపోయినా తాగేలా చూడాలి. మొత్తమ్మీద మూత్రం రంగు గాఢంగా మారకుండా చూసుకోవాలి. మద్యం ఒంట్లో నీటిశాతం తగ్గేలా చేస్తుంది. కాబట్టి దీని జోలికి వెళ్లనీయొద్దు. ఒకవేళ అలవాటుంటే పరిమితం చేయాలి.యటకు తక్కువగా: ఎండ ఎక్కువగా కాసే సమయంలో.. ముఖ్యంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. అంతగా అవసరమైతే ఉదయం గానీ సాయంత్రం గానీ బయటకు వెళ్లేలా జాగ్రత్త పడాలి. ఒకవేళ పగటి పూట బయటకు వెళ్తే విధిగా గొడుగు, వెడల్పయిన అంచుల టోపీ, చలువ కళ్లద్దాలు ధరించేలా చూడాలి. చర్మానికి సన్‌స్క్రీన్ లోషన్ రాయాలి.ఇంట్లో చల్లదనం: వేసవిలో వృద్ధుల సంరక్షణకు ఇంట్లో చల్లగా ఉండే వాతావరణం కల్పించాలి. హాలులో, పడకగదిలో ఫ్యాన్లు, కూలర్లు లేదా ఏసీలు ఏర్పాటు చేయాలి. కిటికీలకు, తలుపులకు వట్టివేళ్ల పరదాలైనా వేలాడదీయొచ్చు. వీటిని నీటితో తడిపితే ఇల్లు చల్లగా ఉంటుంది.ఆరోగ్యకరమైన ఆహారం: తేలికగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.



# బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!




బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమి యం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబోతున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే.ఖదీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ప్రీమి యం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్‌డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

## హెూలీ.. ఆర్థిక వ్యవస్థకు ఆనంద కేళి



**రంగుల పండుగ రోజున రూ.60 వేల కోట్లు వ్యాపారం**

రంగుల పండుగ హెూలీ కేవలం ఆనందం, ఐక్యతకు వేడుకగా మాత్రమేకాదు, దేశంలో గణనీయమైన ఆర్థిక వ్యాపారానికి తోడ్పాటునందిస్తోంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) గణాంకాల ప్రకారం ఈ ఏడాది హెూలీ రోజున రూ.60,000 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. గత ఏడాది నమోదైన రూ.50,000 కోట్ల వ్యాపారంతో పోలిస్తే ఇది 20 శాతం అధికమని తెలిపింది.

**అన్ని రంగాల్లో ఆర్థిక వృద్ధి**

సాధారణంగా పండుగ సమయాల్లో విభిన్న విభాగాల్లో వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. స్వీట్లు, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ), గిఫ్ట్ ఐటమ్స్, డ్రై ఫ్రూట్స్, దుస్తులు, పూలు, పండ్లు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ వంటి ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉంటుంది. పండుగలకు ముందే కొందరు ఆయా వస్తువులను కొనుగోలు చేస్తే, పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంకొందరు ఈమేరకు ఖర్చు చేస్తారు. దాంతో రిటైల్ వ్యాపారులతోపాటు, దుకాణదారులతో మార్కెట్లు సందడిగా ఉంటాయి. గతంలో కంటే ఈసారి అధికంగా ఖర్చు చేస్తారని అంచనాలు ఉండడంతో స్థానిక వ్యాపారాలు, చిన్న వ్యాపారులు, ఎంఎస్‌ఎంఈ రంగానికి ప్రయోజనం చేకూరుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**స్థానిక ఉత్పత్తులకు గిరాకీ**

ఈ ఏడాది వివిధ విభాగాల్లోని వ్యాపారులు భారత్‌లో తయారవుతున్న వస్తువులను ప్రమోట్ చేయడంపై దృష్టి సారించారు. వినియోగదారులు చైనీస్ ఉత్పత్తులకు దూరంగా స్థానికంగా తయారైన హెర్బల్ కలర్స్, ట్రెడిషనల్ వాటర్ గన్స్ (పిచ్కారీస్), బెలూన్లు, పూజా సామగ్రిని ఎంచుకుంటున్నారు. ఈ మార్పు దేశీయ పరిశ్రమలకు మద్దతుగా నిలుస్తుంది.

**ఒక్క ఢిల్లీలోనే 3000కు పైగా కార్యక్రమాలు..**

పెద్ద ఎత్తున హెూలీ మిలన్ కార్యక్రమాలు, సమావేశాలు ఆర్థిక వృద్ధికి మరింత దోహదం చేస్తున్నాయి. ఒక్క ఢిల్లీలోనే ఇలాంటి 3,000కు పైగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించడంతో వేదికలు, క్యాటరింగ్, సంబంధిత సేవలకు గిరాకీ పెరిగింది. వివిధ రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలను ఉత్తేజపరిచే ఈ ఉత్సవం సామర్థ్యం సాంస్కృతిక, సామాజిక కోణాలకు అతీతంగా దాని ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

## పసిడి పరుగు..



స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరుగుతున్న బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. హెూలీ రోజున బంగారు ఆభరణాలు గిఫ్ట్‌గా ఇవ్వాలంటే మాత్రం ధరల విషయంగా కొంత ఆలోచించాలని సూచిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో శుక్రవారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.82,300 (22 క్యారెట్స్), రూ.89,780 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. గురువారం ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.1,100, రూ.1,200 పెరిగింది.

చెన్నైలో శుక్రవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,100, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1,200 పెరిగింది. దీంతో గోల్డ్ రేటు రూ.82,300 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.89,780 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.

దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.1,100 పెరిగి రూ.82,450కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.1,200 పెరిగి రూ.89,930 వద్దకు చేరింది.

**వెండి ధరలు**

బంగారం ధరల మాదిరిగానే శుక్రవారం వెండి ధరల్లోనూ మార్పులు కనిపించాయి. నిన్నటి ధరలతో పోలిస్తే వెండి కేజీపై ఏకంగా రూ.2,000 పెరిగి రూ.1,12,000 వద్దకు చేరింది.

# రాబోయేది కోతల కాలమే!




రాబోయే ద్రవ్యసమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను గట్టిగానే కోత పెట్టవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ ఎకోరాప్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలుందని చెప్తున్నది. గత నెల జరిగిన ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును ఆర్బీఐ పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2020 మే నెలలో చివరిసారిగా తగ్గించారు.

ఇంకా తగ్గనున్న వడ్డీరేట్లు,వచ్చే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు 75 బేసిస్ పాయింట్లు దిగిరావచ్చన్న అంచనాలు,ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం,రిజర్వ్ బ్యాంక్ ఆమోదయోగ్య స్థాయిలోనే తాజా నివేదికలో ఎస్బీఐ రిసెర్చ్ వెల్లడి,న్యూఢిల్లీ, మార్చి 13: రాబోయే ద్రవ్యసమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను గట్టిగానే కోత పెట్టవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ ఎకోరాప్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలుందని చెప్తున్నది. గత నెల జరిగిన ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును ఆర్బీఐ పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2020 మే నెలలో చివరిసారిగా తగ్గించారు. ఇప్పుడు రెపోరేటు 6.25 శాతంగా ఉన్నది. కరోనాతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు వడ్డీరేట్లను పెద్ద ఎత్తున తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపు పేరిట వరుసగా పెంచుతూపోయింది. దీంతో 6.50 శాతానికి చేరింది. అయితే వచ్చే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇచ్చారు. అందుకు తగ్గట్టే దాస్ తర్వాత వచ్చిన కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా.. ఫిబ్రవరిలో చేపట్టిన తన మొదటి ద్రవ్యసమీక్షలోనే 25 బేసిస్ పాయింట్లు తగ్గించారు. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గవచ్చని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ అంచనా వేస్తున్నది. ఇలా ఈ ఏడాది కనీసం 75 బేసిస్ పాయిట్కంట్లైనా రెపోరేటు తగ్గుతుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నది.

**4.7 శాతానికి ద్రవ్యోల్బణం**

ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుండటం వడ్డీరేట్ల కోతలకు కలిసొస్తున్నదని ఎస్బీఐ రిసెర్చ్ చెప్తున్నది. ఈ జనవరి-మార్చిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.9 శాతానికి తగ్గవచ్చని, మొత్తం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) 4.7 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంటున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) సైతం 4-4.4 శాతం శ్రేణిలోనే ఉండవచ్చంటున్నది. దీంతో ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిలోనే ద్రవ్యోల్బణం గణాంకాలుండటం వల్ల వడ్డీరేట్ల కోతలను ఇంకా ఆశించవచ్చని అంటున్నది. ఈ ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.6 శాతంగా నమోదైన సంగతి విదితమే. ఆహారోత్పత్తులు, శీతల పానీయాలు, కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది.

**బ్యాంకులపైనే ఆధారం**

ఆర్బీఐ రెపోరేటును తగ్గించినా.. దానికి అనుగుణంగా బ్యాంకులు తామిచ్చే రుణాలపై వడ్డీరేట్లను తగ్గించకపోతే రుణగ్రహీతలపై భారం అలాగే ఉంటుందని, మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరగదని నిపుణులు చెప్తున్నారు. ఆర్బీఐ కూడా ఇటీవలికాలంలో ఇదే ఆందోళనను వ్యక్తం చేస్తూ వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని కస్టమర్లకు ఇవ్వాలని తరచూ సూచిస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. రుణాలపై వడ్డీరేట్లు తగ్గితే ఈఎంఐల భారం దిగుతుంది. ఇది రియల్టీ, ఆటో, కన్స్యూమర్ గూడ్స్ తదితర రంగాల్లో సేల్స్‌ను పెంచుతుంది. మొత్తానికి వచ్చే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలపై అటు రుణగ్రహీతలు, ఇటు వ్యాపార-పారిశ్రామిక వర్గాలకు, మరోవైపు బ్యాంకులకు పెద్ద ఎత్తునే అంచనాలున్నాయని చెప్పవచ్చు.

**కోతలకు ట్రంప్ సెగ**

దేశీంగా ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినా ఆర్బీఐకి వడ్డీరేట్ల తగ్గింపునకు మరో అడ్డంకి ట్రంప్ రూపంలో వచ్చిపడుతున్నది. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాల పోరుకు కాలుదువ్వుతున్న అగ్రరాజ్యాధినేత.. భారత్‌పైనా వచ్చే నెల నుంచి అధిక సుంకాలు పడుతాయని హెచ్చరిస్తున్నది తెలిసిందే. ఇదే జరిగితే అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తూత్పత్తుల రేట్లు అమాంతం పెరగడం ఖాయమే.

# సెన్సెక్స్ - 1,05,000



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఉరుముతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు ఒకడుగు ముందుకు, నాలుగడుగులు వెనుకకు అన్నట్టున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రికత్తలు ఆందోళనల్ని రేకెత్తిస్తుంటే.. మదుపరులు స్టాక్స్ నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. భారతీయ పరిస్థితులూ ఇందుకు మినహాయింపు కాదు. అయినప్పటికీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఈ ఏడాది ఆఖరుకల్లా లక్ష మార్కును దాటి 1,05,000 వద్దకు వెళ్తుందన్న ఓ తాజా అంచనా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారుతున్నది. అవును.. మోర్గాన్ స్టాన్లీ వేసిన ఈ అంచనా ట్రేడ్ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నదిప్పుడు.ప్రస్తుతం సెన్సెక్స్ ఉన్న స్థాయితో చూసినైట్టైతే.. మోర్గాన్ స్టాన్లీ అంచనా 41 శాతం అధికం మరి. గురువారం 74వేల మార్కునూ కోల్పోయింది. ఈ క్రమంలో ఏకంగా లక్ష స్థాయిని దాటేస్తుందని మోర్గాన్ స్టాన్లీ చెప్పడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ట్రంప్ టారిఫ్ భయాలతో ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలనే చవిచూస్తున్నాయి. అప్పుడప్పుడు పెరిగినా.. ఆ తర్వాత వచ్చే నష్టాలు ఆ ఆనందాన్ని దూరం చేస్తున్నాయి. అయితే పరిస్థితులన్నీ చక్కబడుతాయన్నట్టుగా మోర్గాన్ స్టాన్లీ చెప్తున్నది. దీంతో మదుపరుల్లో కొత్త ఆశలు చిగురించే వీలుందని స్టాక్ బ్రోకర్లు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**74వేల దిగువకు సెన్సెక్స్**

రియల్టీ, ఐటీ, వాహన రంగ షేర్లలో గురువారం భారీగా విక్రయాలు జరగడంతో వరుసగా ఐదోరోజూ సూచీలు నష్టపోయాయి. 200 పాయింట్లకుపైగా నష్టపోయిన సెన్సెక్స్ 74 వేల దిగువకు పడిపోయింది. చివరకు 73,828.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్లు కోల్పోయి 22, 397.20 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోతున్నారు.

# జియోస్టార్ యూట్యూబ్ కంటెంట్ తొలగింపు




భారత బ్రాడ్‌కాస్టింగ్, డిజిటల్ స్ట్రీమింగ్ పరిశ్రమలో ప్రముఖ సంస్థగా ఉన్న జియోస్టార్ మే 1, 2025 నాటికి యూట్యూబ్ నుంచి ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్‌ను తొలగించే ప్రణాళికలను ప్రకటించింది. పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్యను పెంచుకునేందుకు సంస్థ ఈమేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. పే-టీవీ(డబ్బు చెల్లిస్తే టీవీ సర్వీసులు అందించడం) డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్ నుంచి ఉచిత డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌కు చందాదారుల వలసలను అరికట్టడానికి ఈ వ్యూహాత్మక నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేసింది.జియోస్టార్ ఇకపై ప్రీమియం కంటెంట్‌ను సబ్‌స్క్రిప్షన్ పరిధిలోకి తీసుకురావాలనే వ్యూహానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఇలా చేయడం ద్వారా పెయిడ్ సర్వీసులను పెంచుతూ సబ్‌స్క్రైబ‌లను ప్రోత్సహించేందుకు వీలు అవుతుందని కంపెనీ నమ్ముతుంది. జియోసినిమా, డిస్నీ హాట్‌స్టార్ విలీనంతో ఓటీటీ విభాగంలో జియోస్టార్ కీలకంగా మారింది. ఇది బాలీవుడ్, అంతర్జాతీయ సినిమాలు, ప్రాంతీయ సిరీస్‌లు, లైవ్ స్పోర్ట్స్‌తో సహా విభిన్న కంటెంట్‌ను అందిస్తోంది.

**బ్రాడ్ కాస్టింగ్ పరిశ్రమపై ప్రభావం**

యూట్యూబ్ నుంచి కంటెంట్‌ను తొలగించాలన్న నిర్ణయం బ్రాడ్‌కాస్టింగ్ పరిశ్రమపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. టాటా ప్లే, ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీ వంటి పే-టీవీ డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్‌లు ఉచితంగా ప్రీమియం కంటెంట్ అందిస్తున్నాయి. క్రమంగా ఈ ప్లాట్‌ఫామ్‌లు కూడా ఇదే పంథాను ఎంచుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దాంతో తమ సబ్‌స్క్రైబర్ల సంఖ్యను పెంచుకునే వీలు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం పే-టీవీ సబ్ స్క్రిప్షన్ల సంఖ్య 8.4 కోట్లుగా ఉంది. ఇది గతంలో ఎక్కువగానే ఉండేది. చందాదారులను నిలుపుకోవడానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి కంపెనీలు విభిన్న మార్గాలను అన్వేషిస్తున్నాయి. భారతదేశంలో టీవీ సబ్ స్క్రిప్షన్ మార్కెట్ విలువ రూ.40,000 కోట్లు ఉంటుందని అంచనా.

**సవాళ్లు ఇవే..**

సబ్‌స్క్రిప్షన్ ఆధారిత మోడల్‌పై కంపెనీలు దృష్టి పెట్టడం ఆదాయ వృద్ధికి అవకాశాలను పెంచేవైనప్పటికీ.. ఉచిత కంటెంట్‌కు అలవాటు పడిన భారతీయ వినియోగదారులు ఎంత మేరకు పెయిడ్ సబ్ స్క్రిప్షన్‌లకు మారుతారో గమనించాల్సి ఉంటుంది. ఏదేమైనా జియోస్టార్ కంటెంట్ లైబ్రరీ, లైవ్ స్పోర్ట్స్, ప్రాంతీయ కంటెంట్ వంటి ప్రత్యేక సదుపాయాలు వీక్షకులను సబ్‌స్క్రైబ్ చేసుకునే దిశగా ఆకర్షిస్తుందని కంపెనీ విశ్వసిస్తుంది.

# ఓలా స్కూటర్లపై భారీ రాయితీ



ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా..హెూలీ పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. హెూలీ ఫ్లాష్ సేల్‌తో ప్రారంభించిన ఈ ఆఫర్ల కింద ఎస్1 ఈ-స్కూటర్లపై రూ.26,750 తగ్గింపునిస్తున్నది. అలాగే ఎస్1 ఎక్స్ం(జనరేషన్ 2)పై రూ.22 వేలు డిస్కౌంట్‌ను ఇస్తున్నది.దీంతో ఈ రెండు మాడళ్ల ప్రారంభ ధరలు రూ.89,999, రూ.82,999కి దిగివచ్చాయి.ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 17 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. దీంతోపాటు మిగతా ఎస్1 స్కూటర్లపై కూడా రూ.25 వేల డిస్కౌంట్ ఇస్తున్నది. ప్రస్తుతం సంస్థ మూడు రకాల స్కూటర్లను విక్రయిస్తుండగా, ఇవి రూ.69,999 నుంచి రూ.1,79,999 ధరల శ్రేణిలో లభిస్తున్నాయి. వీటితోపాటు కొత్తగా ఓలా స్కూటర్లను కొనుగోలు చేసిన వారికి రూ10,500 వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. దీంట్లో రూ.2,999 విలువైన మూవ్ ఆపరేటింగ్ సిస్టమ్, రూ.14,999 విలువైన వారెంటీని రూ.7, 499కి అందిస్తున్నది. వీటిలో ఎస్1 ప్రోం మాడల్ రూ.1,59,999 నుంచి రూ.1.85 లక్షల మధ్యలో లభించనుండగా, ఎస్1 ప్రో మాడల్ రూ.1,29,999 నుంచి రూ.1,54, 999, ఎస్1 ఎక్స్ మాడల్ రూ.89,999 నుంచి రూ.1,19,999 మధ్యలో ధర నిర్ణయించింది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332